RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 25.09.2024 | సంపుటి : 11 సంచిక : 75 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య

రాజీనామా

బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకే నట!

హైదరాబాద్(జనంసాక్షి): వైసీపీకి మరో బిగ్ షాక్ తగిలింది. రాజ్యసభ సభ్యత్వానికి వైసీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌కు అందజేయగా.. రాజీనామాను ఆమోదిస్తున్నట్లు రాజ్యసభ ఛైర్మన్ మంగళవారం

మిగతా 2లో..

మహిళలకు నెలసరి సెలవులు

తప్పనిసరి

ఐక్యరాజ్యసమితిలోగళమెత్తిన భారత మహిళ ప్రియదర్శిని

న్యూయార్క్(జనంసాక్షి): నెలసరి రోజుల్లో మహిళలకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలంటూ ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఒడిశాకు చెందిన సామాజిక ఉద్యమకారిణి రంజితా ప్రియదర్శిని

మిగతా 2లో..

ఆక్రమణల్లో ఉన్న పేదలను ఆదుకోండి

అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం లేదా ఇతర ప్రత్యామ్నాయం చూపండి

- ఓఆర్ఆర్ లోపల చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి
- ఆక్రమణలకు గురికాకుండా చెరువుల వద్ద సీసీ కెమెరాలు
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): మూసీ అభివృద్ధి ప్రాజెక్టులో నిర్వాసితులకు 16,002 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూసీలో 10,200 మంది నిర్వాసితులు కానున్నట్లు ఇప్పటికే అధికారులు గుర్తించారు.బుధవారం ఇంటింటికి వెళ్లి ఇళ్ల కేటాయింపు వివరాలను నిర్వాసితులకు తెలియజేయనున్నారు. మరోవైపు రివర్ బెడ్ ఆక్రమణలో ఉన్న 1,600 ఇళ్లను అధికారులు తొలగించనున్నారు. మూసీ బఫర్ జోన్‌లో నివసించే వ్యక్తులు, నిర్మాణాలకు పరిహారం చెల్లించనున్నారు. చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపుపై సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, మెట్రో రైలుపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆక్రమిత చెరువులు,

మిగతా 2లో..

పనుల్లో నిర్లక్ష్యం సహించబోం

సాగర్ ఎడమకాల్వ గండ్లకు మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి

ఆలస్యంపై మంత్రి ఉత్తమ్ ఆగ్రహం

సూర్యాపేటప్రతినిధి(జనంసాక్షి): నాగార్జున సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనుల్లో జాప్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇంకా ఎన్నిరోజులు చేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని చెప్పారు. పనుల్లో జాప్యానికి కారణమైన ఇంజినీర్లపై ఎందుకు చర్యలు తీసుకోవద్దో తెలుపాలన్నారు. ఇటీవల వచ్చిన వరదలకు సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితపు రామచంద్రాపురం వద్ద నాగార్జున సాగర్ ఎడమ కాలువకు గండిపడింది.గండి పూడ్చివేత పనులు గత వారం ప్రారంభమయ్యాయి ఆ పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా.. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.. గండిపూడ్చివేత పనులు జరుగుతున్న తీరును పరిశీలించిన మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే గండి పూడ్చివేత పనులు ఆలస్యం అవుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇప్పటికైనా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు

తీపికబురు

కాంట్రాక్టు పద్ధతిలో రిక్రూట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి):2008 డీఎస్సీ (బీఈడీ) అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో రిక్రూట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2008 డీఎస్సీలో డీఈడీ అభ్యర్థులకు 30శాతం ఎస్‌జీటీ కేటాయించాలన్న జీవో

మిగతా 2లో..

ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్‌లు తయారు చేసిందెవరు?

ఇంజనీర్లను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్

కొనసాగుతున్న కాళేశ్వరం విచారణ

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్: కాళేశ్వరంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజినీర్లు, మాజీ ఇంజినీర్లు మంగళవారం విచారణకు హాజరయ్యారు. ఉన్నతాధికారులకు తెలియకుండా ఈఈ తిరుపతిరావు ఏజెన్సీలకు రూ. 1,600 కోట్ల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చినట్టు ఇంజినీర్లు తెలిపారు.బ్యాంకు

మిగతా 7లో..

అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్లు

- అర్హులైన లబ్ధిదారులకు అందిస్తాం
- ప్రజా అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి
- ప్రైవేటు కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం

ఖమ్మం(జనంసాక్షి):తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఇందుకు మరో వారం రోజుల్లో విధివిధానాలు రూపొందించనున్నారు. ఇల్లెందు నియోజకవర్గంలో జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అక్టోబరు 15 నుంచి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపడతామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఇందుకు వారం రోజుల్లో విధివిధానాలను రూపొందిస్తామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సమావేశంలో

మిగతా 2లో..

నా అవినీతి ఏంటో చెప్పండి

నేను అలాంటివాడిని కాదని ప్రత్యర్థులూ నమ్ముతారు: కేజ్రీవాల్

చండీగఢ్(జనంసాక్షి): తనను ఒక దొంగగా చిత్రీకరించేందుకు భాజపా భావించిందని ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అందుకే తనను అరెస్టు చేయించిందని అన్నారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రానియా నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. "అసలు నేను చేసిన తప్పేంటి..? దిల్లీకి పదేళ్లు సీఎంగా ఉండడమేనా. పేదల పిల్లలకు మంచి విద్యను ఏర్పాటు చేశా. గతంలో 7 నుంచి 8 గంటలు

మిగతా 2లో..

దేశంలో ఉపాధిలేక విదేశాలకు యువత

నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోన్న భాజపా: రాహుల్ గాంధీ

చండీగఢ్(జనంసాక్షి): భారతీయ జనతా పార్టీ (భాజపా)పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. దేశంలోని యువతకు భాజపా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించట్లేదని మండిపడ్డారు. అందువల్లే హరియాణాలోని ఎక్కువ శాతం యువత 'డంకీ'లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని యువతకు భాజపా ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించకపోవడం వల్ల వేరే దారిలేక వారు పని కోసం విదేశాలకు వెళ్తున్నారని పేర్కొన్నారు. అక్కడ వారు సరైన తిండి, నివాసం లేకపోవడంతో పాటు, చిత్ర హింసలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో తమ సమస్యలు చెప్పుకొని బాధపడ్డారని తెలిపారు. హరియాణా నుంచి విదేశాలకు వెళ్లిన వారు ఎదుర్కొంటున్న

మిగతా 2లో..

హైడ్రాకు చట్టంలేదు..

చుట్టరికమే

బీఆర్ఎస్ నేత కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): హైడ్రా అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి టార్గెట్‌గా చేసుకుని కేటీఆర్ కామెంట్స్ చేశారు. వారికి కోర్టుకు వెళ్లేలాగా పరిస్థితి కల్పించి సామాన్యుల ఇళ్లు మాత్రం కూల్చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్‌కేజీ చదివే

మిగతా 2లో..

ఓటుకు నోటు కేసు..

16న హాజరుకండి

సీఎం రేవంత్‌కు ఈడీ కోర్టు నోటీసులు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఓటుకు నోటు కేసులు చిక్కులు తప్పేలా లేవు. ఈ కేసులో పెద్ద ఎత్తున అక్రమ నగదు చెలామణి జరిగిందని ఈడీ నమోదు చేసిన కేసులో ఆయనకు సమన్లు జారీ అయ్యాయి. వచ్చే నెల పదహారో తేదీన కోర్టు ఎదుట హాజరు కావాలని రేవంత్ రెడ్డి సహా నిందితులందరికీ నోటీసులు జారీ చేసింది.

మిగతా 2లో..

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై

సిట్

2లో

చీఫ్‌గా సర్వశ్రేష్ఠ త్రిపాఠి

సిద్ధరామయ్యకు హైకోర్టులో చుక్కెదురు

2లో

ముడా విచారణపై గవర్నర్ నిర్ణయానికి సమర్థన

కోర్టుపై విశ్వాసం ఉంది..

సత్యానిదే అంతిమ విజయం: సీఎం సిద్ధరామయ్య

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు

కట్టుబడి ఉన్నాం

మోదీ పునరుద్ఘాటన

జెలెన్‌స్కీతో ప్రధాని భేటీ

న్యూయార్క్(జనంసాక్షి): భారత ప్రధాని అమెరికా పర్యటనలో భాగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ద్వైపాక్షిక భేటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు భారత్ మద్దతును మోదీ పునరుద్ఘాటించారు. దాదాపు నెల రోజుల వ్యవధిలో జెలెన్‌స్కీ, మోదీల మధ్య ఇది రెండో భేటీ కావడం గమనార్హం.ఇక, జెలెన్‌స్కీతో భేటీ అయినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తెలిపారు. గత నెలలో ఉక్రెయిన్ పర్యటన సందర్భంగా ఆ దేశంలో శాంతిస్థాపన అమలుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. శాశ్వతమైన, శాంతియుతమైన పరిష్కారాన్ని సులభతరం చేయడానికి అన్ని మార్గాల్లో భారత్ సిద్ధంగా ఉందన్నారు. 'మేము ఇరుదేశాల సంబంధాలను చురుకుగా అభివృద్ధి చేస్తున్నాం. వివిధ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయడానికి కలిసి పనిచేస్తున్నాం. అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్‌లపై ముఖ్యంగా యూఎన్, జీ20 సదస్సులలో శాంతి సూత్రాన్ని అమలుచేయడం, రెండో శాంతి శిఖరాగ్ర

మిగతా 2లో..

మాకు బాగా దగ్గరైన ప్రధాని

మోదీనే

అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి

వార్త 2లో

భౌగోళిక రాజకీయాల్లో

తలదూర్చం

ఇండియా,చైనాల మధ్య నలిగిపోదల్చుకోలేదు

శ్రీలంక నూతన అధ్యక్షుడు దిసనాయకే

కొలంబో(జనంసాక్షి):భారత్-చైనాల మధ్య తాము నలిగిపోదల్చుకోలేదని శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వెల్లడించారు. అసలు ఏ రెండు దేశాల మధ్య తాము ఒత్తిడికి గురికావాలని కోరుకోవడం లేదని

మిగతా 2లో..

శ్రీలంక నూతన ప్రధానిగా

హరిణి అమరసూర్య

సిరిమావో తరవాత రెండో మహిళా ప్రధాని

వార్త 2లో

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా

కమాండర్ మృతి

లెబనాన్‌కు అండగా ఉంటాం

ఇజ్రాయెల్ దాడులను ఖండించిన చైనా

బీజింగ్(జనంసాక్షి): గాజా యుద్ధంలో కొంత తటస్థంగా ఉన్న బీజింగ్.. లెబనాన్ విషయంలో మాత్రం స్పష్టమైన వైఖరి తీసుకొంది. యుద్ధంతో అట్టుడుకుతున్న బీరుట్‌కు చైనా నుంచి మద్దతు లభించింది.ఆ

మిగతా 2లో..

బీరూట్(జనంసాక్షి):లెబనాన్ మిలిటెంట్ సంస్థ హెజ్‌బొల్లాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగళవారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా కమాండర్ ఇబ్రహీం క్వబైసీ హతమయ్యాడు. ఈ దాడిలో కమాండర్‌తోపాటు మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ రక్షణ వర్గాలు వెల్లడించాయి. హెజ్‌బొల్లా క్షిపణి వ్యవస్థకు ఇబ్రహీం కమాండర్‌గా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.గత నాలుగు రోజులుగా హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులను ఉధృతం చేసింది. రాకెట్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. కేవలం క్షిపణి కేంద్రాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు

మిగతా 2లో..

2008 డీఎస్సీ అభ్యర్థులకు తీపికబురు

వల్ల నష్టపోయిన వారికి అవకాశం ఇవ్వనున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో పనిచేసేందుకు 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థులను విధుల్లోకి తీసుకోనున్నట్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఇప్పటికే 2008 డీఎస్సీలో 30 శాతం రిజర్వేషన్ వల్ల నష్టపోయిన అభ్యర్థుల వివరాలను పాఠశాల విద్యాశాఖ నుంచి సేకరించిన సర్కారు.. ఆయా అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో రిక్రూట్‌మెంట్‌పై సమాచారం అందించింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పాఠశాల విద్య అధికారిక వెబ్‌సైట్‌లో కన్సెంట్, వెరిఫికేషన్ దరఖాస్తులను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కాంట్రాక్టు పద్ధతిలో జిల్లాల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపిన అభ్యర్థులకు సెప్టెంబరు 27 నుంచి అక్టోబరు 5 వరకు జిల్లాల్లో డీఈవోల ఆధ్వర్యంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది.

రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య రాజీనామా

ప్రకటించారు. ఆర్ కృష్ణయ్య స్థానం ఖాళీ అయిందంటూ రాజ్యసభ సెక్రటరీ బులిటెన్ విడుదల చేశారు. పదవీకాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయడం గమనార్హం. ఇటీవలే వైసీపీ రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణలు తమ రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. రాజ్యసభలో గతంలో 11మంది వైసీపీ తరఫున ఎంపీలు ఉండగా.. మొత్తం ముగ్గురు రాజీనామాలు చేశారు. ముగ్గురు రాజీనామా చేయడంతో వైసీపీ రాజ్యసభ ఎంపీల సంఖ్య 8కి పడిపోయింది.

నా అవినీతి ఏంటో చెప్పండి

కరెంటు కోతలు ఉండేవి. కానీ, ఇప్పుడు దిల్లీ, పంజాబ్‌లలో ఉచిత కరెంట్‌ను అందిస్తున్నాం. అందుకోసం రూ.3 వేల కోట్లు ఖర్చు చేశాం. ఆప్ ప్రభుత్వం వృద్ధులకు ఉచితంగా 'తీర్థ యాత్ర' అందిస్తోంది. అదేనా నేను చేసిన తప్పు..?అవినీతిపరులెవరూ ఇలా చేయరు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు."ఒకవేళ నేను అవినీతిపరుడినే అయితే.. ఆ డబ్బంతా నా జేబులోకే వెళ్లేది. అప్పుడు ఇంత అభివృద్ధి కనిపించేది కాదు. నన్ను ఓ దొంగగా చిత్రీకరించాలని భాజపా భావిస్తోంది. అందుకే నన్ను జైల్లో పెట్టింది. నా ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తోంది. నేను అవినీతికి పాల్పడలేదని ప్రత్యర్థులూ విశ్వసిస్తారు. జైల్లో ఉన్నప్పుడు నన్ను మానసికంగా, శారీరకంగా దెబ్బతీయాలని చూశారు. నాకు ఇన్సులిన్ ఇవ్వకుండా నిలిపివేశారు. నాడు వారు నన్ను ఏం చేయాలనుకున్నారో అర్థం కాలేదు" అని కేజ్రీవాల్ భాజపాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రస్తుతం ప్యూన్ ఉద్యోగాన్ని కూడా ఎవరు వదలడం లేదని.. కానీ, తాను మాత్రం దిల్లీ సీఎం పదవికి రాజీనామా చేశానని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను అధికారం కోసం ఆరాట పడే వ్యక్తిని కాదని అన్నారు. కాగా.. బెయిల్‌పై విడుదలైన కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత తాత్కాలిక సీఎంగా మంత్రి ఆతిశీ పేరును ఆప్ ప్రకటించింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆతిశీ.. పక్కన కుర్చీని ఖాళీగా ఉంచి, ఆమె వేరే సీట్లో కూర్చొని బాధ్యతలు చేపట్టారు.

భౌగోళిక రాజకీయాల్లో తలదూర్చం

తేల్చిచెప్పారు. ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన విదేశాంగ విధానంపై తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన దిసనాయకే సోమవారం బాధ్యతలు చేపట్టారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జయంత జయసూరియా దేశ 9వ అధ్యక్షుడిగా ప్రమాణం చేయించారు. అధ్యక్ష సచివాలయం ఇందుకు వేదికైంది. అనంతరం దిసనాయకే జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ప్రజాతీర్పును గౌరవిస్తూ అధికార మార్పిడి శాంతియుతంగా సాగేందుకు సహకరించిన తాజా మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘేకు కృతజ్ఞతలు తెలిపారు. భౌగోళిక రాజకీయ శత్రుత్వాల మధ్య చిక్కుకోనే పరిస్థితులకు కొలంబో వీలైనంత దూరంగా ఉంటుందని తేల్చిచెప్పారు. తాము ఓ వర్గం పక్షం వహించమన్నారు. భారత్-చైనాతో సంబంధాలను ఎన్‌పీపీ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసుకొంటూ వెళ్లాలని నిర్ణయించింది. భౌగోళిక రాజకీయ యుద్ధంలో మేము పోటీదారులం కాదు. భవిష్యత్తులో వాటిల్లో భాగస్వామి కాబోము. వీటిల్లో శాండ్‌విచ్ వలే నలిగి పోవాలనుకోవడం లేదు. ముఖ్యంగా భారత్-చైనా మధ్య ఇబ్బంది పడాలనుకోవడంలేద. ఇరు దేశాలు మాకు విలువైన మిత్రులే. ఎన్‌పీపీ ప్రభుత్వ హయాంలో మా స్నేహం మరింత బలపడుతుందని భావిస్తున్నాను. అదే సమయంలో ఐరోపా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలతో సన్నిహిత సంబంధాలు కోరుకుంటున్నామని తన విదేశాంగ విధానంపై దిసనాయకే కీలక విషయాలు వెల్లడించారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ శ్రీలంక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి తటస్థ వైఖరి చాలా కీలకమని దిసనాయకే అభిప్రాయపడ్డారు. ప్రపంచ శక్తుల అధిపత్య పోరుకు శ్రీలంక దూరమన్నారు. అదే సమయంలో ఉభయ పక్షాలకు ప్రయోజనకరంగా ఉండేలా దౌత్య, భాగస్వామ్యాలను కుదుర్చుకోవడంపై తాము దృష్టిపెడతామని పేర్కొన్నారు.

శ్రీలంక నూతన ప్రధానిగా
హరిణి అమరసూర్య
సిరిమావో తరవాత రెండో మహిళా ప్రధాని

కొలంబో(జనంసాక్షి): శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె ప్రమాణ స్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణి కావడం విశేషం. నేషనల్ పీపుల్స్ పవర్ కి చెందిన 54 ఏళ్ల హరిణి అమర సూరృతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే, మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు. దీంతో శ్రీలంకలో దిసనాయకేతో పాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక శాఖ, ఆరోగ్యం, పెట్టుబడులు వంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేసిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్శిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. మరోవైపు, ఎన్‌పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపుణరచిచి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి శ్రీలంక నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుత పార్లమెంట్‌ను రెండు రోజుల్లో రద్దు చేస్తామని ఆయన సోమవారం వెల్లడించడంతో శ్రీలంకలో ముందస్తు పార్లమెంటు ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రైలు పట్టాలపై కుట్రపూరిత ప్రయత్నాలు
దోషులపై కఠిన చర్యలు
హెచ్చరించిన కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

జైపుర్(జనంసాక్షి): రైళ్లు పట్టాలు తప్పేలా ఇటీవల కొన్ని కుట్రపూరిత ప్రయత్నాలు వెలుగు చూడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి రైలుకు ప్రమాదం తలపెట్టే ఘటనలు కలకలం రేపాయి. ఇటువంటి వాటిపై రైల్వేశాఖ అప్రమత్తంగా ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ తరహా ఘటనలను నిర్మూలించేందుకు అనేక రాష్ట్రాల యంత్రాంగం, పోలీసులతో చర్చలు జరుపుతున్నామన్నారు. రైలు ప్రమాదాలకు ప్రయత్నించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆక్రమణల్లో ఉన్న పేదలను ఆదుకోండి

నా లాలతోపాటు మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే పేదల వివరాలు సేకరించాలని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు లేదా ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల ఉన్న చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షించేందుకు చెరువుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో సంబంధిత అధికారులతోపాటు హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా పాల్గొన్నారు. ఇకపై చెర్వులు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా సిటీలో ఉన్న అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానం చేయాలని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు అన్నింటినీ గుర్తించి ఎఫ్టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని చెప్పారు. హైదరాబాద్ సిటీలో అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న ప్రతీ చెరువు, నాలాల ఆక్రమణల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా ప్రభుత్వం చేపట్టే చర్యలుండాలని అప్రమత్తం చేశారు. జూబ్లీ హిల్స్ లో నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎయిర్ పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తి స్థాయి నివేదికను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలని చెప్పారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే అధికారులు వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్టతో పాటు మెట్రో విస్తరణకు సంబంధించి పలు అంశాలను ఈ సందర్భంగా అధికారులు సీఎంకు వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్ కు సంబంధించి పూర్తిస్థాయి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సీఎం చెప్పారు.

ఉపాధిలేక విదేశాలకు యువత

ఇబ్బందులను పేర్కొంటూ వారు మాట్లాడిన వీడియోను షేర్ చేశారు. వీడియోలో కొందరు యువత మాట్లాడుతూ తమ సొంత రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఉండటం వల్ల తాము ఉపాధి కోసం యూఎస్ వెళ్లవలసి వచ్చిందని.. అక్కడ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. రాహుల్ వీడియోను షేర్ చేస్తూ 'హరియాణా ప్రజలు 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు?' అంటూ ప్రశ్నించారు. భాజపా చేస్తున్న తప్పునకు యువత తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ శిక్ష అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. దీని వల్ల వృద్ధాప్యంలో ఉన్న వారి తల్లిదండ్రులను చూసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయిందని అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే యువత తమ కుటుంబాలకు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడకుండా ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగావకాశాలు లేకపోవడంతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలి వెళ్లేవారిని 'డంకీ'లుగా పిలుస్తారు..

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై సిట్

అమరావతి(జనంసాక్షి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై విచారణకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిట్ చీఫ్‌గా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ప్రభుత్వం నియమించింది. సిట్‌లో విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజుతోపాటు మరికొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు ఉండనున్నారు.

16న హాజరు కండి

ఈ కేసులో విచారణకు నిందితులు అందరూ డుమ్మా కొడుతున్నారు. మంగళవారం జరిగిన వాయిదాకు కేవలం మత్తయ్య మాత్రమే హాజరయ్యారు. దీంతో కోర్టు నిందితలందరూ విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని కోరుతూ తెలగుదేశం పార్టీలో ఉన్నప్పుడు నామినేటెడ్ ఎమ్మెల్సీగా ఉన్న స్టీఫెన్‌సన్‌కు డబ్బులు ఎర చూపారని తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆ కేసులో ఆయన చాలా రోజు పాటు జైల్లో ఉండి బెయిల్ తెచ్చుకున్నారు. అలా డబ్బులు ఎర చూపిన సమయంలో రూ. యాభై లక్షలు రేవంత్ దగ్గర బ్యాగులో ఉన్నాయి. దీంతో నగదు అక్రమ చెలామణి చేశారని ఏసీబీ ఈడీకి కేసు రిఫర్ చేసింది. ఈ అంశంపై ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఏసీబీ నోదు చేసిన కేసులో విచారణ జరుగుతోంది. రేవంత్ రెడ్డి సీఎం అయినందున ఆ కేసును ఇతర రాష్ట్రాలకు బదిలీ చేయాలని బీఆర్ఎస్ నేత జగదీష్ రెడ్డి వేసిన పిటిషన్ ను ఇటీవల సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే ఈ కేసు దర్యాప్తు, విచారణ విషయంలో రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేసింది. ఇదే కేసులలో ఈడీ దాఖలు చేసిన కేసులో విచారణ నెమ్మదిగా సాగుతోంది. కోర్టుకు నిందితులు సరిగ్గా హాజరు కావడం లేదు. ఈ కేసులో మధ్యవర్తిగా వ్యవహరించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న క్రైస్తవ మత ప్రచారకర్త జెరూసలేం మత్తయ్య మాత్రం అటు ఏసీబీ కేసులోనూ.. ఇటు ఈడీ కేసులోనూ రెగ్యులర్ కోర్టుకు హాజరవుతున్నారు. ఇతరులు ఎవరూ హాజరు కాకుండా..హాజరు మినహాయింపు పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో కోర్టు వచ్చే నెల పదహారో తేదీన నిందితులు అందరూ కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది.

మహిళలకు నెలసరి సెలవులు తప్పనిసరి

గళం విప్పారు. అప్పుడే మహిళలు జీతంలో కోత పడుతుందని ఆలోచించకుండా సెలవు తీసుకోగలుగుతారని వెల్లడించారు. అమెరికాలో న్యూయార్క్ నగరంలో 79వ సర్వసభ్య ప్రతినిధి సభలో 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో ఆమె మాటాడారు. నెలసరి విషయంలో సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు ఆమె కృషి చేస్తున్నారు. రెండోసారి ఐరాస సదస్సుకు హాజరైనందుకు గర్వంగా ఉంది. నెలసరి రోజుల్లో వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నదే నా ప్రధాన లక్ష్యం. ఆ రోజుల్లో ఒకటి నుంచి రెండు రోజులు సెలవులు ఇవ్వాలి. జీతం ఇవ్వకపోతే.. ఏ మహిళ కూడా ఆ సెలవు తీసుకోదు. కెన్యాలో జరిగిన ఐరాస సదస్సులో తొలిసారి ఈ విషయం గురించి ప్రస్తావించానని ప్రియదర్శిని తెలిపారు. కెన్యా సదస్సు అనంతరం ఒడిశా ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకుందని ఆమె తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి పెయిడ్ పీరియడ్ లీవ్ ఇన్షియేటివ్‌ను అమలుచేసింది. అలాగే కర్ణాటక ప్రభుత్వం ఏడాదికి ఆ తరహాలో ఆరు సెలవులు ప్రకటించింది. కర్ణాటక ప్రభుత్వం చర్యను అభినందించిన ఆమె.. ఆ సెలవుల సంఖ్యను 12కు పెంచాలని కోరారు. తన పోరాటం వెనక వ్యక్తిగతంగా ఎదుర్కొన్న అనుభవాలు కారణమని ఆమె తెలిపారు. ఆ సమయంలో తాను సెలవు కోరినందుకు తన మేనేజర్ నుంచి అవమానం ఎదుర్కొన్నానని, ఆ తర్వాత తాను ఉద్యోగానికి రాజీనామా చేశానని వెల్లడించారు. ఆమె ప్రయత్నాలు నెలసరి ఆరోగ్యం గురించి చర్చించేలా, ఆ దిశగా నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తున్నాయి. ఇదిలాఉంటే.. స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఒడిశా ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పిన సంగతి తెలిసిందే. ఉద్యోగినుల కోసం ఒక రోజు నెలసరి సెలవు పాలసీని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఇది వర్తిస్తుందని వెల్లడించింది. ఈ పాలసీ తక్షణమే అమల్లోకి వస్తుందని అప్పట్లో ప్రభుత్వం పేర్కొంది. మహిళా ఉద్యోగులు ప్రతినెలా తమ రుతుక్రమంలో తొలి లేదా రెండో రోజు ఈ సెలవును తీసుకునేలా దీన్ని రూపొందించినట్లు తెలిపింది..

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు కట్టుబడి ఉన్నాం

సమావేశం వంటి పలు అంశాలపై చర్చించాము. అలాగే మన సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు స్పష్టమైన మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు' అని జెలెన్‌స్కీ తెలిపారు. గత నెలలో ఉక్రెయిన్‌లో పర్యటన సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ పర్యటన సందర్భంగా రష్యా- ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కార మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు భారత్ మద్దతుగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. ఇదిలాఉండగా.. మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో పాటు ఆర్మేనియా ప్రధాని పాషిన్‌యాన్ తదితర నేతలతో ద్వైపాక్షిక భేటీలు నిర్వహించారు. అమెరికా పర్యటనను ముగించుకున్న ప్రధాని మోదీ మంగళవారం భారత్‌కు బయలుదేరారు.

హైడ్రాకు చట్టంలేదు.. చుట్టరికమే

వేదశ్రీకి తన పుస్తకాలు తీసుకునే సమయం కూడా ఇవ్వలేదు.. 50 ఏళ్ళ కస్తూరి బాయి తన జీవనాధారమైన చెప్పుల దుకాణం కోల్పోయింది.. 72 గంటల క్రితం కొన్న ఇల్లు నేల మట్టమైంది.. వారం ముందు గృహప్రవేశం చేసుకున్న ఇల్లు, అన్ని కాగితాలు ఉన్నా .. పేక మేడలా కూల్చివేయబడింది.. తిరుపతి రెడ్డి గారు.. క్షణం కూడా సమయం ఇచ్చే ప్రసక్తే లేదన్న హైడ్రా.. మీ విషయంలో నోరు మెదపలేదు.. వాల్టా అనుకుంటా.. ఏకంగా మీకు 30 రోజుల టైం ఇచ్చింది.. కోర్టులో స్టే సంపాదించుకున్నారు.. ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల రావణకాష్ఠంలో మట్టి కూడా అంటనిది బహుశా మీకు మాత్రమేనా.. బుల్‌డోజర్ల కింద నలిగిపోతున్న సామాన్యులకు ఆ కిటుకేదో చెప్పండని అన్నారు. అలాగే మంత్రి శ్రీధర్ బాబుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇంటింటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన సన్నాసి వెధవ ఎవడు..? అని శ్రీధర్ బాబును కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. చెరువు నిండితే కప్పలన్నీ వస్తాయని సామెత ఉండేది.. మనం ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నాం.. అధికారంలో లేం.. మీ ఎమ్మెల్యే జంపు కొట్టిండు. కానీ ఇవాళ 150 మందితో సమావేశం అనుకుంటే.. వెయ్యి మందికిపైగా వచ్చారంటే శేరిలింగంపల్లి పోరాట స్ఫూర్తికి వందనం చేస్తున్నాను అని కేటీఆర్ తెలిపారు. త్వరలోనే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నిక వస్తుంది. బరాబర్ మళ్లీ ప్రజలు బుద్ధి చెబుతారు. అరికెపూడి గాంధీకి పార్టీ ఏం అన్యాయం చేసింది. ఎందుకు పోయావంటే సమాధానం లేదు. మంత్రి శ్రీధర్ బాబు అతి తెలివిగా మాట్లాడుతుండు. ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్లాడుకొని మమ్మల్ని అంటున్నరని అంటుండు. నేను ఒక్కటే అడుగుతున్నా శ్రీధర్ బాబును.. అతి తెలివి ప్రదర్శిస్తున్న మంత్రి గారూ.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే మావోడు కాదు.. మీ వోడు అంటున్నవ్..మరి ఆయనకు కండువా కప్పిన సన్నాసి వెధవ ఎవరు..? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కడియం శ్రీహరి, సీనియర్ నేత కే కేశవరావు ఇంటికి వెళ్లి కాళ్లు మొక్కి కండువాలు కప్పిన దౌర్భాగ్యుడు, సన్నాసి వెధవ ఎవడు..? అని అన్నారు

అక్టోబరు 15 నుంచి ఇందిరమ్మ ఇళ్లు

ఇల్లెందు నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడారు. పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను అర్హులకు అందించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్టోబరు 2 నుంచి అర్హులకు రేషన్ కార్డులు, హెల్త్‌కార్డులు పంపిణీ ప్రక్రియ చేయనున్నట్లు తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గంలో వర్షాలకు దెబ్బతిన్న రహదారుల వివరాలను అధికారులు ఇంకా ఇవ్వలేదని ఆగ్రహించారు. వెంటనే వర్షాలకు దెబ్బతిన్న రహదారుల వివరాలను, వాటి ప్రతిపాదనలు వెంటనే పంపాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అటవీశాఖ అభ్యంతరాలతో అసంపూర్తిగా ఉన్న రహదారులను గుర్తించి ఆయా జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకెళ్లాలని అటవీశాఖ అధికారులు మంత్రి సూచనలు చేశారు. ఏజెన్సీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, టీజీఐడీసీ ఛైర్మన్ ముప్పా విజయబాబు, భద్రాద్రి, మహబూబాబాద్? జిల్లా కలెక్టర్లు జితేశ్? వి పాటిల్?, అద్వైత్?కుమార్? సింగ్? తదితరులు పాల్గొన్నారు. ఒక్కో ఏడాదికి 4.50 లక్షల ఇళ్లు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన ఐదేళ్లలో 22.50 లక్షల ఇళ్లు నిర్మించేందుకు అవకాశం ఉంది. కానీ వచ్చిన అర్జీలే 82.82 లక్షలుగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వడపోత సవాల్?గా మారింది. ఈ క్రమంలో అధికారులు జాగ్రత్త పడ్డారు. ప్రభుత్వం సూచనల మేరకు ముందడుగు వేయాలని భావించారు. ప్రభుత్వం పేదల సొంత ఇంటి కలను నెరవేర్చాలని ఇందిరమ్మ హౌసింగ్‌స్కీమ్‌ను ప్రారం భించింది.

ప్రజా అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలి

ప్రజల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ కైకొండాయగూడెంలో టి.యు.ఎఫ్.ఐ.డి.సి నిధులు 195.00 లక్షలతో, 59వ డివిజన్ దానవాయిగూడెంలో 200.00 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ... ప్రజల అభివృద్ధి, సంక్షేమం దిశగా ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పని చేస్తుందని అన్నారు. అభివృద్ధిలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ లో రెండు కోట్ల నిధులతో 12 సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్లలో కోటి 30 లక్షలకు డ్రైయిన్, కొన్ని రోడ్ల పనులు చేపట్టామని, అవి నేడు చివరి దశకు చేరుకున్నాయని మంత్రి అన్నారు. స్మశాన వాటిక నిర్మాణానికి నిధులను కూడా మంజూరు చేసుకున్నామని, టెండర్ పూర్తి చేశామని, త్వరలో ఆ పనులు పూర్తవుతాయని, వాటితో పాటు కేఆర్ ఫంక్షన్ హాల్ నుంచి స్కూల్ వరకు లింక్ రోడ్డు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో హెజ్‌బొల్లా కమాండర్ హతం

ఇజ్రాయెల్ రక్షణశాఖ వెల్లడించింది. భవిష్యత్‌లోనూ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇవాళ దాడులు జరిగిన దహియే సుబుర్బ్ ప్రాంతం హెజ్‌బొల్లాకు కంచుకోట. అది నిర్వహించే క్షిపణి దాడులకు వ్యూహమంతా ఇక్కడే సిద్ధమవుతుంది. ఈ ప్రాంతానికి క్షిపణుల కర్మాగారంగా పేరుంది. " హెజ్‌బొల్లాను అంతం చేసేంత వరకు మా దాడులు ఆగవు. వారిని ఊపిరి సలపకుండా చేస్తాం. రానున్న రోజుల్లో అన్ని వైపుల నుంచి దాడులను మరింత ఉధృత

కోటపాటి సేవలు అందరికీ ఆదర్శం

- మెగా రక్తదాన శిబిరంలో పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : రైతు నాయకుడు,గల్ఫ్ కార్మిక నాయకుడు కోటపాటి తన జన్మదిన వేడుకను మెగా రక్తదాన శిబిరంతో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పాల్గొని కోటపాటి నరసింహం నాయుడు ఆర్మూర్ ప్రాంత రైతులకు,గల్ఫ్ కార్మికులకు లభించిన ఆణిముత్యంగా అభివర్ణించారు. 20 సంవత్సరాలుగా కోటపాటి చేస్తున్న నిస్వార్థంగా చేస్తున్న సేవలను, రక్తదాన శిబిరాల ఏర్పాటుతో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయడమే కాక సామాజిక సేవ చేయడం అభినందనీయమని అన్నారు. సీనియర్ నాయకులు భూపతి రెడ్డి మాట్లాడుతూ నరసింహం నాయుడు తనకు 45 సంవత్సరాలుగా తెలుసునని చిన్నప్పటినుండి ఏబీవీపీ,ఆర్ఎస్ఎస్ లలో శిక్షణ పొంది సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. మరెన్నో జన్మదిన వేడుకలను సేవ కార్యక్రమాలతో జరుపుతూ నిండు నూరేళ్లు ఆయుఆరో గ్యాలతో సుఖంగా ఉండాలని దీవించారు. న్యాయవాదులు యం.కే నరేందర్, వి.బాలయ్య, గణేష్, నాగరాజ్, జిజి రాం, ఎల్ఐసి భాస్కర్, కే.రమేష్, అంకరి గారి శంకర్, యస్.రుక్మాజి, బద్దం లింగారెడ్డి,గోవింద్ పెట్ ఆనంద్ లు పాల్గొన్నారు.

పినపాక తాసిల్దార్ సస్పెన్షన్

పినపాక, సెప్టెంబర్ 24(జనం సాక్షి): పినపాక తాసిల్దార్ సూర్యనారాయణ పై జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సస్పెన్షన్ వేటు వేశారు.మండలంలోని పలు గ్రామాలలో కోర్టు వివాదంలో ఉన్న భూములను, వారసత్వ భూములను అక్రమంగా మరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో పలువురు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ తక్షణమే విచారణలో రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలడంతో బాధ్యుడైన తహసీల్దార్ సూర్య నారాయణ పైన సస్పెన్షన్ వేటు పడింది. జిల్లా కలెక్టర్ అనుమతులు లేకుండా హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ

- నిర్ధారణ చేయాల్సిన కుటుంబాలు 21,876
- ఇప్పటి వరకు సర్వే పూర్తయినవి 14,278
- రుణమాఫీ కానీ రైతుల ఆందోళన

కామారెడ్డిబ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : రుణమాఫీ అర్హత ఉన్నప్పటికిని రేషన్ కార్డులు లేకపోవడంతో జిల్లాలో పలువురికి రుణమాఫీ కాలేదు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కుటుంబా నిర్ధారణ సర్వేను కొనసాగిస్తున్నారు. జిల్లాలో నిర్ధారణ చేయాల్సిన 21,876 మందికి గాను ఇప్పటి వరకు 14,278 మంది మాత్రమే సర్వే పూర్తయింది. రెండు నెలలుగా సర్వేను కొనసాగిస్తున్నారు. ఇందులో తలెత్తుతున్న సమస్యల కారణంగా పక్రియ నత్తనడకన కొనసాగుతుంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కారిస్తూ ప్రభుత్వం తాజాగా రుణమాఫీ పోర్టల్‌లో మరో మూడు కొత్త అచ్చికాలను కేటాయించింది.ఈ నేపథ్యంలో అధికారులకు సర్వే చేయడానికి మరింత సమయం పడుతుంది.ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం కుటుంబంలోని సభ్యులందరి ఆధార్ సంఖ్యను నమోదు చేయాల్సి ఉంది. ఈ విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఉదహరణకు ఒక కుటుంబంలోని ఒక వ్యక్తి ఆధార్ కార్డులో వినియోగంలోకి రాకముందే మరణించి ఉంటే ఆ వ్యక్తి ఆధార్ సంఖ్యను పేర్కొనవల్సి ఉంటుంది. కుటుంబ సభ్యులందరి ఆధార్‌లు అందుబాటులో లేకపోవడం జిల్లాలో పలువురి రైతులకు సమస్యగా మారింది.అవివివాహులు ఒంటరి వ్యక్తుల కుటుంబ నిర్ధారణకు రుణమాఫీ పోర్టల్‌లో ప్రత్యేకంగా అచ్చికం లేదు.కొందరు రైతులకు రాష్ట్రంలో వ్యవసాయ భూములు ఉండటంతో బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. వీరికి నివాస ప్రాంతంలోనే ఆధార్‌కార్డులు ఉన్నాయి. ఈ రైతుల కుటుంబ నిర్ధారణకోసం ఇతర రాష్ట్రాలకు చెందిన ఆధార్ సంఖ్యలను పోర్టల్‌లో నమోదు చేయడం ఇబ్బందింగా మారింది. ఇలాంటి సమస్యలను వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. వీరి పరిష్కార మార్గాలు చూపుతు రుణమాఫీ పోర్టల్‌లో మూడు కొంత ఐచ్చికలను ప్రవేశపెట్టింది. దీంతో రుణమాఫీ సర్వే నత్తనడకన కొనసాగుతుంది.

ఆందోళనలో అన్నదాతలు:

కుటుంబ నిర్ధారణ,రేషన్‌కార్డు,ఆధార్‌కార్డుల నెంబర్ల పేరుతో కొనసాగుతున్న సర్వే పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు.గత రెండు నెలలుగా సర్వేల పేరిట కాలయాపన చేయడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.ఒక వైపు పంట రుణం మాఫీ కాక,రైతుబంధు రాక రైతులు పంటల సాగుకు పెట్టుబడులు పెట్టి అప్పుల పాలవుతున్నారు.అధిక వడ్డికి అప్పులు తీసుకవచ్చి పంటలు పండిస్తే ఒక వైపు గిట్టుబాటు ధర లేకపోవడం,ప్రభుత్వ రుణమాఫీ కాకపోవడం,రైతుబంధు ఇవ్వకపోవడంతో వర్షకాలం పంటలు పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం వెంటనే అర్హులైన రైతులకు రుణమాఫీ పథకం అమలు అయ్యే విధంగా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కొరవడిన స్పష్టత:

నిర్ధారణకోసం ప్రస్తుతం కుటుంబంలో జీవించి ఉన్న వ్యక్తులకు చెందిన ఆధార్ సంఖ్యలను నమోదు చేసిన సరిపోతుంది.ఒంటరి మహిళలు,అవివాత యువకులకు పట్టాదారు పాస్‌పుస్తకం ఉంటే ప్రత్యేకంగా కుటుంబాలుగా పరిగణిస్తూ వారి ఆధార్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంది.పోరుగు రాష్ట్రాలకు చెందిన ఆధార్‌కార్డులను సైతం పరిగణలోకి తీసుకునేలా పోర్టల్‌లో మార్పులు చేశారు.రుణమాఫీలో సాంకేతిక సమస్యలను ఏ విధంగా పరిష్కారనే విషయంలో వ్యవసాయశాఖతో పాటు బ్యాంకుల వద్ద స్పష్టత కొరబడింది.ఆధార్‌కు అనుగుణంగా బ్యాంక్ ఖాతాలలో పేర్లు మార్పిడి చేసుకునేందుకు అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు ప్రకటించిన కార్యారూపం దాల్చడం లేదు.ఇదే విధంగా ఆధార్ మిస్ మ్యాచ్ రెండు లక్షలకు పైగా రుణం తీసుకున్న వారి విషయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు.వీటికి తోడు ఇతర సాంకేతిక సమస్యల కారాణంగా పలువురు అర్హులైన రైతులు మాఫీకి దూరంగా ఉన్నారు.జిల్లాలోని రెండు వాణిజ్య బ్యాంకుల్లో అధికార యంత్రాంగం చేసిన తప్పిదాలతో సుమారు 3 వేలకు పైగా రైతులు రుణమాఫీకి అర్హత సాధించలేకపోయారు.ప్రభుత్వం సర్వేలను వెంటనే పూర్తి చేసి రైతులకు రుణమాఫీ అందే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కొరుతున్నారు.

ప్రకియ కొనసాగుతుంది

జిల్లాలో రుణమాఫీ నిమిత్తం కుటుంబ నిర్ధారణ ప్రకియ కొనసాగుతుంది.ఇటీవలనే ప్రభుత్వం పోర్టల్‌లో మూడు కొత్త అచ్చికలను ఇచ్చారన్నారు.దీంతో ప్రకియ వేగవంతం చేస్తున్నాం.కుటుంబ నిర్ధారణ జాబితాలో పేర్లు ఉన్న రైతులు నమోదు ప్రక్రియకు వ్యవసాయశాఖ అధికారులకు సహకరించాలన్నారు.జిల్లాలో సర్వే కొనసాగుతుంది.త్వరలోనే ప్రభుత్వానికి పూర్తి చేసి నివేదిక అందజేస్తామన్నారు.

- జిల్లా వ్యవసాయ అధికారి,తిరుమల ప్రసాద్

వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కేటాయించండి

జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ఇందిరా భవన్ లో కలిసి వినతి పత్రం అందజేశారు. రాయికల్ మండలం అల్లీపూర్ రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సభ్యులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లిపూర్ పరిసర గ్రామాల రైతులు నాబార్డ్ వారి సౌజన్యంతో అల్లిపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ స్థాపించడం జరిగిందనీ, ఇప్పటివరకు 500 మంది రైతులను సభ్యులుగా చేర్చుకోవడం జరిగిందనీ, కంపెనీ ఎరువులు విత్తనాలు లైసెన్సులు పొంది తక్కువ ధరకు విత్తనాలు ఎరువులు రైతులకు అందజేస్తున్నాం అని రైతులకు మరింత సౌకర్యం గాను మరియు లాభదాయకంగానూ ఉండుటకు ధాన్యం కొనుగోలు అమ్మకం నిర్వహించుటకు అల్లీపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మాకు కేటాయించాలని ఈ సంఘ బలోపేతానికి సహకరించగలరని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే , సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, ఎంఎల్సి అల్లిపూర్ రైతు మిత్ర ఫార్మార్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారి అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ అత్తినేని శంకర్, డైరెక్టర్లు కొండపలుకుల రత్నాకర్ రావు, పుప్పాల రాజారెడ్డి, అంబారి వెంకటేష్, అత్తినేని రాజన్న, ఓరుగంటి రాజలింగం, దూలూరి సాయి, మెక్కొండ రాంరెడ్డి, బొజ్జ దేవేందర్ రావు, తిరుమల శంకర్, సీఈఓ కే.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నితిన్ గడ్కరీని కలిసిన ఎమ్మెల్యే

చెన్నూర్, సెప్టెంబర్ 24 (జనం సాక్షి) : నియోజకవర్గానికి సంబంధించిన పలు జాతీయ రహదారుల అభివృద్ధి పనులపై జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కారీతో లోక్సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ తో పాటు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని భీమారం మండలంలోని జోడు వాగు వద్ద రోడ్డు మరమ్మతులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఒక కోటి 80 లక్షలు నిధులు మంజూరు చేశారని, అలాగే నేషనల్ హైవే 63 పై జోడు వాగు పై కొత్త రోడ్డు విస్తరణకు 100 కోట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీ మంజూరు చేయడం జరిగిందని అన్నారు. సానుకూలంగా స్పందించి రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రిని సన్మానించి అభినందనలు తెలిపారు.

అసత్య ప్రచారాల్ని ప్రజలు నమ్మొద్దు

- విలేకరులు నిజాన్ని తెలుసుకుని వార్త రాయాలి : డాక్టర్లు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జనం సాక్షి) : తాము ఎంతో కష్టపడి మెడిసిన్ చదివి ప్రజలకు సేవ చేసేందుకే ప్రజల్లోకి వచ్చామని ఐఎంఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు డాక్టర్లు పేర్కొన్నారు. ఈనెల 22 న అపెక్స్ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది వైద్యం చేయించుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేసి, వేసిన కుట్లు తొలగించి కొట్టి బయటకు పంపించారని కొన్ని పత్రికల్లో రాశారని అందుకు తాము ఎంతో మానసిక వేదన గురి అయ్యామని ఆసుపత్రి డాక్టర్ నవీన్ అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ మాట్లాడుతూ ఆ వార్తల్లో ఎంత మాత్రం నిజం లేదని, ఈనెల 22 న శనివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎం శ్రీనివాస్ అనే వ్యక్తి అతని మిత్రులు ఎక్కువ మోతాదులో మద్యం సేవించి ద్విచక్ర వాహనం పై నుండి పడి తీవ్ర రక్తస్రావం జరగగా, చికిత్స కొరకు తమ అపెక్స్ ఆసుపత్రికి వచ్చారని, వారు ఆసుపత్రికి రావడంతోనే డ్యూటీ డాక్టర్ తో వైద్య సదుపాయం కల్పించి, వారికి అంటిన మొత్తం రక్తాన్ని శుభ్రపరచి ప్రథమ చికిత్స అందించి కట్టు కట్టడం జరిగిందని, కుట్లు వేసుకోవడానికి పేషెంట్ సహకరించకుండా డాక్టర్ని, నర్స్ తో పాటు స్టాఫ్ తో అసభ్యకరంగా ప్రవర్తించి, నానా బూతులు తిడుతూ, అసభ్య పదజాలం వాడుతూ ఆసుపత్రి నుండి బయటకు వెళ్లి మరొక ఆసుపత్రి కి వెళ్ళారని, అక్కడ అలాగే అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆసుపత్రి సిబ్బంది బయటకు పంపించడంతో తిరిగి మరల అపెక్స్ ఆసుపత్రి పైకి వచ్చి డోర్ మూసివేసి కుర్చీలను ఎత్తివేస్తూ హాస్పిటల్స్ సిబ్బందినీ అసభ్యకరంగా తిడుతూ, దాడి చేశారన్నారు. తాము శ్రీనివాస్ అనే పేషెంట్ కు ఎలాంటి కుట్లు వేయలేదు, తీయలేదని డబ్బులు కూడా ఎలాంటి ఇబ్బంది పెట్టలేదన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై, శ్రీనివాస్ వారిపై, అతని మిత్రుల పైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. నిజాన్ని తెలుసుకుని రాయాలి వార్తలు రాసే ముందు జర్నలిస్టు మిత్రులు ఎవరు చెప్తే వారిది నమ్మి వార్తలు రాయకూడదని, నిజాలు తెలుసుకొని రాయాలని ఈ సందర్భంగా విలేకరులను కోరారు. విలేకరులు అంటే మాకు మంచి అభిప్రాయం ఉందని ఇకముందు ఏ విషయమైనా నిజాన్ని తెలుసుకుని రాయాలన్నారు. ఈ సమావేశంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రమణ, జిల్లా కార్యదర్శి డాక్టర్ అరవింద్ గౌడ్, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ వెంకటేశ్వర గౌడ్, డాక్టర్ పుట్ట మల్లికార్జున్, డాక్టర్ వెంకట్ రాథోడ్ పాల్గొన్నారు.

26న పాడిరైతుల సమస్యలపై ధర్నాను జయప్రదం చేయండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : తెలంగాణ పాలఉత్పత్తిదారుల సంఘం, టి.జి విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్రంలో పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకోసం తెలంగాణ పాలఉత్పత్తిదారుల సంఘం, టి.జి విజయ డెయిరీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లోని ధర్నాచౌక్ వద్ద జరుగు పాడిరైతుల ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయం(ఆర్ టి సి క్రాస్ రోడ్)లో ధర్నా పోస్టర్లను ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్‌లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ... పాడిరైతులకు 5బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. రైతాంగంలో తీవ్రమైన అసంతృప్తికి లోనవుతున్నారని అన్నారు. పాడిరైతులకు బిల్లులను 15రోజులకొకసారి ఖాతాలలో జమచేయాలని అన్నారు. లీటరుకు 5రూపాయల ప్రోత్సాహకం ఎన్నికల హామీని అమలు చేయాలని అన్నారు. పాడి సంరక్షణ మందులు గడ్డి విత్తనాలు 50% సబ్సిడీ పై ఇవ్వాలని అన్నారు. పాల టెస్టర్‌లు, చాప్ కట్టర్లు, మిల్క్ అనల్కెజర్‌లు సరఫరా చేయాలని కోరారు. పశుపోషణ పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని అన్నారు. రైతుల ఇంటి వద్దకి పశువైద్య సౌకర్యం మొబైల్ వ్యాన్‌ల ద్వారా అందించాలన్నారు. పాడి రైతుల పిల్లల చదువులకు స్కాలర్ షిప్ లు ఇవ్వాలని అన్నారు. పశు సంవర్ధక శాఖలో కాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 50కోట్లు విడుదల చేసినం మిగిలిన డబ్బులు ఖాతాలలో జమ చేస్తామని అంటున్నారు. 150కోట్ల రూపాయలకు కేవలం 50కోట్ల రూపాయలు విడుదల చేయడం వల్ల రైతాంగం తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

జర్నలిస్టుల గుడిసెలు తొలగించడం సరైంది కాదు

- గుడిసెలు వేసుకున్న జర్నలిస్టులకు వెంటనే పట్టాలివ్వాలి
- రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షులు బేతి సతీష్
- పాలంపేటలో రహదారి పై జర్నలిస్టుల ధర్నా
- సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎంఆర్ఓ,ఎస్ఐ హమీ

ములుగు బ్యూరో, వెంకటాపూర్(రామప్ప),సెప్టెంబర్24(జనం సాక్షి): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి గా ఉండే జర్నలిస్టుల గుడిసెలను రెవెన్యూ అధికారులు తొలగించడం సరైంది కాదని రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షులు బేతి సతీష్ అన్నారు. వెంకటాపూర్ మండల జర్నలిస్టులు మండలం పాలంపేట గ్రామంలోని ప్రభుత్వ భూమిలో గత పది నెలల క్రితం గుడిసెలు వేసుకున్నారు.ఇదే అంశం పై పలుమార్లు మంత్రి సీతక్క తో సహా కలెక్టర్, ఎంఆర్ఓ కి వినతి పత్రం అందించడం జరిగింది.జర్నలిస్టుల వినతకి స్పందించిన మంత్రి సీతక్క పలుమార్లు జిల్లా కలెక్టర్ కి దృష్టికి తీసుకెళ్ళింది.కాగా, మంగళవారం వెంకటాపూర్ రెవెన్యూ అధికారులు పాలంపేట కు చేరుకొని జర్నలిస్టులు వేసుకున్న గుడిసెలను తొలగించడం ప్రారంభించారు.ఈ విషయం తెలుసుకున్న వెంకటాపూర్ జర్నలిస్టులు వెంటనే పాలంపేట కు చేరుకొని గుడిసెల తొలగింపు కార్యక్రమంను అడ్డుకోవడం జరిగింది. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు గుడిసెలను తొలగించడం ఆపలేదు. దీంతో జర్నలిస్టులు పాలంపేట రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా కి దిగారు.ఈ క్రమంలో రహదారి పై పెద్ద సంఖ్య లో రాకపోకలు నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న వెంకటాపూర్ ఎంఆర్ఓ సదానందం,ఎస్ఐ జక్కుల సతీష్ పాలంపేట చేరుకొని ఉన్నత అధికారులతో మాట్లాడాలి జర్నలిస్టుల సమస్య పరిష్కారం కొరకు కృషి చేస్తామని హమీ ఇచ్చారు.దీంతో జర్నలిస్టులు ధర్నా కార్యక్రమం ను విరమించారు. ఈ సందర్భంగా రామప్ప జర్నలిస్టు సొసైటీ అధ్యక్షులు బేతి సతీష్ మాట్లాడారు జర్నలిస్టుల సమస్య పరిష్కారం కొరకు అధికారులు కృషి చేయాలని కోరారు.పాలంపేట లో జర్నలిస్టులు గుడిసెలు వేసుకున్న స్థలాలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని వేడుకుంటున్నారు.ఈ కార్యక్రమం లో జర్నలిస్ట్ లు దేశిని మహేందర్,గొరంటాల విజయ్, తీగల యుగంధర్,రంగిశెట్టి రాజేందర్, కేతిరి బిక్షపతి, అలుగొండ రమేష్,మునిగాల రాజు, బానోత్ యోగి,దేశిని వినీల్, ఆకుల రామకృష్ణ, ఎలగందుల శంకర్,దండపేల్లి సారంగం,గట్టు ప్రశాంత్,బిరేల్లి రమేష్,పిల్లలమర్రి శివ,రామ్, తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో 187 కేజీల గంజాయి పట్టివేత

కొత్తగూడ సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మాచర్ల గ్రామం నుండి హైదరాబాద్ తరలిస్తున్నారని ముందస్తు సమాచారం తో పోలీసులు మచ్చర్లగ్రామం వద్ద వాహనాలలు తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లల్లో 187 కిలోల గంజాయి సుమారు 47 లక్షల 76 వేల రూపాయల విలువ ఉంటుందని నలుగురు పైన కేసు నమోదు చేసినట్లు డిఎస్పి తిరుపతి తెలిపారు.ఈ తనిఖీలో స్థానిక గూడూరు సీఐ బాబురావు,స్థానిక ఎస్ ఐ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులు త్వరిత గతిన

కాటారం, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే, విద్యుత్తు, అటవీ సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ తో కలిసి చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూసేకరణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం భూ సేకరణ పనులు త్వరిత గతిన చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ ను ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కింద మందిరం, ఎర్ర, వీరాపూర్, కొత్త చెరువులకు నీటి సరఫరా జరుగుతుందని అన్నారు. చెరువుల అభివృద్ధి కోసం భూసేకరణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మొదటి దశ పంప్ హౌస్ లో విద్యుత్ సరఫరా పనులనుపూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. భూసేకరణ జరుపుతున్న మండలాల లో సర్వేయర్లను నియమించాలని తెలిపారు. ఇప్పటికే పంట కాలువల నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయని త్వరలో ట్రయల్ రన్ నిర్వహణ కోసం ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అనంతరం తిమ్మన కుంటలో కేటాయించిన మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. 5.20 ఎకరాలు క్రీడా ప్రాంగణ కోసం కేటాయించగా కొంత భాగం ఆక్రమణకు గురైందని, సర్వే చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చిన్న కాళేశ్వరం ఈ ఈ యాదగిరి, భూ సేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్ వేంకటేశ్వర్లు, తహశీల్దార్ నాగరాజు, క్రీడల అధికారి జయపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 సెప్టెంబర్ 2024

ఎన్‌కౌంటర్ల యోగి రాజ్యం

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

భారత్‌లో ఎక్కువ శాతం జరుగుతున్న ఎన్కౌంటర్లు అన్నీ ఫేక్ వే ఉంటున్నాయి. యూపీ లాంటి రాష్ట్రాల్లో నైతే కులం, మతం చూసి చంపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చంపుతామని చెప్పి మరీ చంపుతున్నారు. రాత్రికి, రాత్రి ఇండ్ల నుంచి ఎత్తుకుని పోయి ఘోరంగా యువకులను, నక్సల్స్ పేరిట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాల్చి చంపి, ఎన్కౌంటర్ అని ప్రకటించిన సందర్భాలు చూసాము. దేశంలోని పలు రాష్ట్రాల్లో ముఖ్యంగా ఒడిశా, చెత్తిస్ గడ్ లో ఇలాంటి పరిస్థితి ఉన్నది. దేశంలో యూపీలో ఇప్పుడు ఉత్తరప్రదేశ్ లోని సీఎం యోగి ఆదిత్యనాద్ రాజ్యం ఎన్కౌంటర్ల పరంపర కొనసాగుతున్నది. 2017 నుంచి ఇప్పటిదాకా యూపీలో 10,713 ఎన్కౌంటర్లు జరిగాయి. ఇందులో ఒక మీరట్ లోనే 3152 ఎన్కౌంటర్లు జరిగినట్లు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం 183 మంది ఊపిరి కోల్పోగా 5,046 మంది గాయపడ్డారు. 23,300 మంది అరెస్ట్ అయ్యారు. ఉత్తర్ ప్రదేశ్ లో ఇటీవల జరిగిన ఒక దుకాణంలో దోపిడీ కేసులో మంగేష్ యాదవ్ అనే వ్యక్తిని పోలీస్ లు ఇంటి నుంచి పట్టుకెళ్లి కాల్చి చంపారు అంటున్నారు.

మంగేష్‌ను పట్టుకెళ్లి కాల్చి చంపారు

కుటుంబ సభ్యులు, ఎన్కౌంటర్ కు రెండు రోజులు ముందు ఇంటి నుంచి తీసుకొని వెళ్లినట్లు మంగేష్ సోదరి చెబుతున్నది. అయితే ఇందులో, ఈ దోపిడీ ఘటనలో మాస్టర్ మైండ్ గా పేర్కొంటున్న, దాదాపు 36 పోలీస్ కేసులు ఉన్న పాత నేరస్తుడు విపిన్ సింగ్ ను మాత్రం పోలీస్ లు పిలిచి సరండర్ చేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెల 5న, 7న కూడ మాజీ యూపీ సీఎం, సమాజ్ వాది పార్టీ నేత మాత్రం మంగేష్ ను కులం యాదవ్ అని చూసి ఎన్కౌంటర్ పేరిట కాల్చి చంపారు అంటున్నారు. యాదవులను భయపెట్టడం జరుగుతున్నది అని, తమ వాళ్ళను ఎంత పెద్ద నేరం అయినా కాపాడుకుంటారని సమాజ్ వాది పార్టీ నేతలు సీఎం మీద ఆరోపణ చేస్తున్నారు.

పోలీస్ ల మీద మంగేష్ యాదవ్ తండ్రి పిర్యాదు చేశారు. బుల్డోజర్ తో ఎలాగైతే కులం, మతం చూసి కూల్చే పని చేసే వారో, ఎన్కౌంటర్లు కూడ అలాగే చేస్తున్నారనే ఆరోపణలు యోగి సర్కార్ మీద వెల్లువెత్తుతున్నాయి. భాజపా అమృత్ కాలం ఇదీ అంటూ ఆరోపిస్తున్నారు.

అసెంబ్లీలోనూ యోగిది అదే వరుస

గతంలో ఒకసారి ఒక ఒక యువతి పట్ల కొందరు అశ్లీల మాటలతో ఇబ్బంది పెట్టిన సంఘటనలో 16 మంది ఉంటే అందులో పవన్ యాదవ్, అర్భాజ్ పేర్లను మాత్రమే సీఎం యోగి ఆదిత్యనాద్ అసెంబ్లీలో ఎత్తుతూ వీరిని శిక్షించడం కోసం బుల్లెట్ ట్రైన్ తయారు అవుతుంది అంటాడు. అప్పుడు పవన్ యాదవ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ ను కలిసి తాను అక్కడ చాయ్ తాగుతూ నిలబడినందుకు తనని కేసులో పెట్టారని, పేర్కొంటూ, సీసీ ఫుటెజ్ చూడాలని కూడ కోరాడు. అలా కూడ యాదవ్ పేరు ఉందని పవన్ మీద కేసు పెట్టి ఇతరుల పేర్లు చెప్పకుండా, రెండు పేర్లనే సీఎం ప్రస్థావించారని అఖిలేష్ అన్నారు. ఇప్పుడు ఇలా! నిజానికి ఫెక్ ఎన్కౌంటర్లు చేసే పోలీస్ లు జీవితాంతం రాజకీయ నీడలోనే ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. గతంలో ఇలాగే ఒక ఎన్కౌంటర్ లో ఖలిస్థానీయుల పేరిట కొందరిని ఫెక్ ఎన్కౌంటర్ లో చంపిన 43 మంది పోలీసులకు 2022 మేలో 7 ఏండ్ల పాటు శిక్ష పడిన దాఖలాలు ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ లో ఒక రేప్ కేసులో నలుగురిని ఎన్కౌంటర్ చేసిన పది మంది పోలీస్ ల పై కూడ కేసు అయ్యింది. గతంలో ఫేక్ ఎన్కౌంటర్ చేసిన వారికి ఉరి శిక్ష వేయాలని సుప్రీం కోర్ట్ వ్యాఖ్యనించిన విషయం గుర్తుండి ఉంటుంది.

అమెరికాలో ఒకసారి

అమెరికాలో ఒక నల్ల జాతి దుకాణ దారుడు జోర్జ్ ఫ్లాయిడ్ ను నకిలీ నోటు ఇచ్చాడని పోలీస్ అధికారి ఒకరు అతనిని కింద పడేసి మోకాలితో గొంతు మీద 9 నిముషాలు ఒత్తి ప్రాణం తీసిన సంఘటనలో అమెరికా పౌర సమాజం తీవ్రంగా స్పందించి ఆందోళనకు దిగితే పోలీస్ లు క్షమాపణ చెప్పే పరిస్థితి, నలుగురు పోలీస్ లను ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేసే పరిస్థితి వచ్చింది. అతన్ని చంపిన పోలీస్ అధికారికి ఏడాది లోపు విచారణ జరిపి 22 ఏండ్ల జైలు శిక్ష వేశారు. నిజానికి యూనిఫారమ్ మీద పోలీస్ లు చేసే ప్రతీ హత్యకు స్వీయరక్షణ పేరు పెట్టడం షరా మాములు అయిపోయింది. ఎన్నో లాకప్ హత్యల నుంచి కూడ ఆత్మహత్య, అనారోగ్యం పేరు చెప్పి తప్పించుకోవడం జరిగింది. అయితే వారి అంతరాత్మకు మాత్రం వారు చేసిన హత్యను, తాను చేయలేదు, అని మాత్రం కన్వేన్స్ చేయలేరు కదా! ఎన్కౌంటర్లలో హిందీ రాష్ట్రాల్లో బుల్డోజర్ రాజకీయాల మాదిరి, కులం, మతం చోటు చేసుకోవడం ఆందోళనకారం, అదొక భయానక రాజనీతి గా, ఇది నిజమే అయితే దేశానికీ చాలా ప్రమాదకరమైన ఒక హెచ్చరిక గా పేర్కొనవచ్చు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా ఇందులో ఇండిపెండెంట్ గా న్యాయంవైపు నిలబడి ఉద్యోగం చేసే పోలీస్ లు ఆలోచించాలి. తాము ఎటువైపు అనేది స్పష్టంగా నిర్ణయించుకోవాలి. ఫేక్ ఎన్కౌంటర్ల రాజకీయం ఎంతకాలము నిలువదు. ఎన్కౌంటర్ల ద్వారా లా అండ్ ఆర్డర్ అనేది ఆర్డర్ లోనికి రాదు. నేరం చేసేవారిలో మార్పు కోసం కృషి జరగాలి. ప్రతీ విషయంలోనూ తమ పబ్బం గడుపుకోవడం కోసం కులం, మతం అనే రాజకీయ పార్టీ అయినా, నాయకులు అయినా, మన లౌకిక రాజ్యంలో ఎంతకాలము మనగలరు. క్రైమ్ పెరుగుతున్నది. కాల్చి చంపడం, ఎన్కౌంటర్లే కాదు మహిళల మీద దాష్టికాలు పెరిగాయి. అటు మణిపూర్ లో హింసాత్మాక ఘటనలు తగ్గలేదు. ప్రజాస్వామ్యం గురించి విదేశాల్లోకి వెళ్లి మాట్లాడే మన పీఎం దేశంలోని అశాంతి కరమైన, సామాన్యునికి రక్షణ లేని పరిస్థితి మీద పట్టిలేకుండా ఉంటున్నారు.

సెప్సిస్ ఒక అత్యవసర పరిస్థితి

సెప్సిస్, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం



1.పరిచయం : సెప్సిస్ అనేది ఒక ఇన్ఫెక్షన్‌కు శరీరం యొక్క తీవ్ర ప్రతిస్పందన వలన కలిగే ప్రాణాంతక పరిస్థితి. సకాలంలో చికిత్స లేకుండా, ఇది కణజాల నష్టం, అవయవ వైఫల్యం మరియు మరణానికి కూడా దారితీస్తుంది. సెప్సిస్ గురించి అవగాహన పెంపొందించడం ముందస్తుగా గుర్తించడాన్ని మెరుగుపరచడానికి మరియు ప్రాణాలను రక్షించడానికి చాలా కీలకం.

2.సెప్సిస్ అంటే ఏమిటి?

శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థ సంక్రమణకు అతిగా స్పందించినప్పుడు, శరీరమంతా మంటను కలిగించే రసాయనాలను రక్తప్రవాహంలోకి విడుదల చేసినప్పుడు సెప్సిస్ సంభవిస్తుంది. సెప్సిస్‌కు దారితీసే సాధారణ ఇన్‌ఫెక్షన్‌లలో న్యుమోనియా, యూరినరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్లు, చర్మవ్యాధులు మరియు పొత్తికడుపులో ఇన్‌ఫెక్షన్లు ఉంటాయి.

3.సెప్సిస్ యొక్క లక్షణాలు : సెప్సిస్ వివిధ లక్షణాల ద్వారా వ్యక్తమవుతుంది, వీటిలో: అధిక లేదా తక్కువ శరీర ఉష్ణోగ్రత వేగవంతమైన హృదయ స్పందన రేటు గందరగోళం లేదా దిక్కుతోచని స్థితి, ఊపిరి ఆడకపోవడం, విపరీతమైన నొప్పి లేదా అసౌకర్యం. చమట లేదా చెమటతో కూడిన చర్మం

4.సెప్సిస్ యొక్క కారణాలు : బ్యాక్టీరియా, వైరల్ లేదా ఫంగల్ ఏదైనా ఇన్ఫెక్షన్ సెప్సిస్‌కు దారితీయవచ్చు. అత్యంత సాధారణ మూలాలు: ఊపిరితిత్తుల అంటువ్యాధులు (న్యుమోనియా వంటివి) యూరినరీ ఇన్ఫెక్షన్లు, చర్మంఇన్ఫెక్షన్లు, జీర్ణశయాంతర అంటువ్యాధులు

5.ఎవరు ప్రమాదంలో ఉన్నారు? : నవజాత శిశువులు, వృద్ధులు మరియు దీర్ఘకాలిక పరిస్థితులతో బాధపడుతున్న వ్యక్తులు (మధుమేహం, మూత్రపిండాల వ్యాధి లేదా క్యాన్సర్ వంటివి) సెప్సిస్ అభివృద్ధి చెందే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

బలహీనమైన రోగనిరోధక వ్యవస్థలు లేదా శస్త్రచికిత్స నుండి కోలుకుంటున్న వారు కూడా ఎక్కువ అవకాశం కలిగి ఉంటారు.

6.సెప్సిస్ అవగాహన ఎందుకు ముఖ్యం : ముందస్తుగా గుర్తించడం కీలకం. ఎంత త్వరగా సెప్సిస్ గుర్తించబడితే, త్వరితగతిన చికిత్స ప్రారంభించవచ్చు, సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ప్రజల అవగాహన ప్రజలకు ముందుగానే సంకేతాలను గుర్తించడంలో సహాయపడుతుంది మరియు వైద్య సహాయం పొందడం ద్వారా ప్రాణాలను కాపాడుతుంది. ఆరోగ్య నిపుణులు. సంరక్షకులు అంటువ్యాధులను నివారించడంలో. సెప్సిస్ ఫలితాలను మెరుగుపరచడంలో మరింత అప్రమత్తంగా ఉండవచ్చు.

అనుపమ బి
నర్స్ ఎడ్యుకేటర్

నివారణ-చికిత్స

7.నివారణ: టీకాలు వేయడం, మంచి పరిశుభ్రత పద్ధతులు (చేతులు కడుక్కోవడం వంటివి) మరియు ఇన్ఫెక్షన్‌లకు సత్వర చికిత్స చేయడం సెప్సిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

8.చికిత్స: సెప్సిస్‌కు యాంటీబయాటిక్స్, ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ మరియు కొన్నిసార్లు శస్త్రచికిత్స ద్వారా ఇన్‌ఫెక్షన్ సోర్స్‌ను తొలగించడం జరుగుతుంది. తీవ్రమైన సందర్భాల్లో, ఇంటెన్సివ్ కేర్ మరియు అవయవ మద్దతు అవసరం.

9. ముగింపు : సెప్సిస్ అనేది మెడికల్ ఎమర్జెన్సీ, అయితే పెరిగిన అవగాహన, ముందస్తుగా గుర్తించడం మరియు నివారణ వ్యూహాలతో అనేక మంది ప్రాణాలను రక్షించవచ్చు. ఎక్కువ మంది వ్యక్తులు సంకేతాలను గుర్తించి సత్వర చికిత్సలు పొందేలా చూసేందుకు సెప్సిస్ గురించి జ్ఞానాన్ని వ్యాప్తి చేయడం చాలా ముఖ్యం.

బెయిల్ అనేది నియమం, జైలు మినహాయింపు

అయితే, ఉమర్ ఖలీద్ వంటి ముస్లిం పేర్లు ఉన్న వారికి వర్తించదు!

ఇటీవల 13 ఆగస్టు 2024 నాటికి, భారత సుప్రీంకోర్టు ధర్మాసనం తన తీర్పులో మనీ-లాండరింగ్ వంటి కేసులతో పాటు అనేక నేరాలకు కూడా సంబంధం లేకుండా "బెయిల్ అనేది నియమం, జైలు ఒక మినహాయింపు" అనే చట్టపరమైన సూత్రం వర్తిస్తుందని పేర్కొన్నది."ఉపా" వంటి ప్రత్యేక చట్టాల కింద అర్హత ఉన్న కేసుల్లో కోర్టులు బెయిల్ నిరాకరించడం ప్రారంభిస్తే అది ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. దీనిపై సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా ఉంది: స్వేచ్ఛ అనేది నియమం మరియు స్వేచ్ఛ లేకుండా చేయడం (deprivation-లేమి) అనేది మినహాయింపుగా ఉంటుంది.

వాస్తవానికి, ఒక కోణంలో, పై సుప్రీమ్ కోర్టు తీర్పులో ఏమీ బహిర్గతం కాదు. ఎందుకంటే, పైన పేర్కొన్న సుప్రీమ్ కోర్టు తీర్పు లేనప్పటికీ, హత్య మరియు అత్యాచారం వంటి క్రూరమైన నేరాలలో నిందితులు కూడా వివిధ భారతీయ న్యాయస్థానాల నుండి క్రమం తప్పకుండా బెయిల్ పొందుతున్నారనేది వాస్తవం. అమానవీయ అఘాయిత్యాలకు పాల్పడిన చాలా మంది బెయిల్ కింద జైలు నుండి బయటకు వస్తున్నారు. అయితే వారు నిందితులుగా ఉన్న కేసుల అధికారిక విచారణ ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, చాలా తరచుగా, ముస్లిం పేర్లతో ఉన్నవారు ఈ నిబంధనకు అర్హులు కాకుండా ఉన్న పరిస్థితి.

అందుకే సెప్టెంబరు 2020 నుండి 4 సంవత్సరాల ముందస్తు విచారణలో ఉన్న జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ కి చెందిన 36 ఏళ్ల ఉమర్ ఖలీద్ అనే రీసెర్చ్ స్కాలర్ విషయంలో కోర్టు తీర్పు అంతర్లీనంగా ఉన్న ఉన్నతమైన ఆదర్శాలు అన్వయించబడవు. వాస్తవానికి, ఖలీద్ ది సుప్రీం కోర్టు తీర్పు కేవలం ఉపన్యాసంగా మారిన పరీక్ష కేసు. లేకుంటే, 2020లో ముస్లిం వ్యతిరేక పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ)కి వ్యతిరేకంగా శాంతియుత నిరసనలో పాల్గొన్న ఖలీద్ మాత్రమే 'నేరం' చేసినా, మరియు పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ రెండూ గణనీయమైన సాక్ష్యాలను అందించడంలో విఫలమైన చోట, గరిష్ట భద్రతలో మగ్గిపోవడాన్ని సుప్రీంకోర్టు ఖండించలేదు. తీహార్ జైలులో జైలు, బహుళ కోర్టులతో పాటు, ఖలీద్ అత్యున్నత న్యాయస్థానం ముందు చేసిన పిటిషన్ 14 సార్లు వాయిదా పడింది.

ఉమర్ ఖలీద్ విషయంలో, భారత న్యాయస్థానాలు పాలక పాలన యొక్క రాజకీయ ప్రాధాన్యతలపై రాజ్యాంగ హక్కుల యొక్క ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించడంలో విఫలమయ్యాయి. ఖలీద్ కేసు అత్యున్నత న్యాయస్థానంలో కూడా విచారణకు వచ్చినప్పుడల్లా, ప్రాసిక్యూషన్ అభ్యర్థన లేదా న్యాయవాదులు గైర్హాజరు కావడం, ముఖ్యంగా సీనియర్ లాయర్లు అందుబాటులో లేకపోవడం, సమయాభావం, ఇతర నాసిరకం సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది.

నిస్సందేహంగా, ఫాసిస్ట్ పాలన నిజంగా సైద్ధాంతికంగా దృఢమైన ఖలీద్‌కు భయపడుతోందనడంలో సందేహం లేదు: "సైద్ధాంతికంగా, నేను రాడికల్ డెమోక్రాట్ అని మీరు అనవచ్చు. నేను ప్రజాస్వామ్యాన్ని నమ్ముతాను మరియు మీ ఓటు వేసే వరకు పరిమితం కాని ప్రజాస్వామ్యాన్ని నేను నమ్ముతాను... తప్పక ప్రజాస్వామ్య పనితీరుతో మీ సమస్యలు మరియు ఆందోళనలను మీరు వినిపించే విధంగా రోజువారీ జీవితంలో ఆచరణలోకి రండి." ఇంతలో, ముస్లిం వ్యతిరేక పౌరసత్వ సవరణ చట్టం(సి ఏ ఏ)కి వ్యతిరేకంగా ఫిబ్రవరి 2020లో జరిగిన ఈశాన్య ఢిల్లీ నిరసనల్లో ఖలీద్‌ను ఢిల్లీ పోలీసులు ఇప్పటికీ కీలక కుట్రదారుగా పేర్కొంటున్నారు.

వాస్తవానికి, జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుండి అత్యంత రాజకీయంగా ఎదిగిన, చైతన్యయుతమైన విద్యార్థి కార్యకర్తలలో ఒకరిగా, 2013లో అఫ్జల్ గురు ఉరిపై జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ లో నిరసనను నిర్వహించినందుకు మరో నలుగురితో సహా ఖలీద్ దేశద్రోహ నేరం మోపబడినప్పటి నుండి 2016 నుండి వార్తల్లో నిలిచాడు. పార్లమెంటు దాడిలో అఫ్జల్ గురు ప్రమేయానికి సంబంధించి ఎటువంటి భౌతిక సాక్ష్యాధారాలు లేనప్పటికీ, సర్వోన్నత న్యాయస్థానం అప్రసిద్ధ ప్రకటనతో అతనికి మరణశిక్ష విధించింది: "భారీ ప్రాణనష్టానికి దారితీసిన ఈ సంఘటన యావత్ దేశాన్ని మరియు సామూహిక మనస్సాక్షిని కదిలించింది. నేరస్థుడికి ఉరిశిక్ష విధిస్తేనే సమాజం సంతృప్తి చెందుతుంది. అఫ్జల్ కుటుంబానికి కూడా ఈ నిర్ణయం గురించి మరియు దాని తొందరపాటు అమలు గురించి తెలియజేయలేదు, లేదా అతని బంధువులు ఉరిశిక్షకు ముందు అతన్ని కలిసే అవకాశం ఇవ్వలేదు.

పార్లమెంటు దాడి వెనుక అసలు సూత్రధారులు ఎవరూ గుర్తించబడలేదుబీ దర్యాప్తు చేయబడలేదు, "సమాజం యొక్క సామూహిక మనస్సాక్షి"ని సంతృప్తిపరిచినందుకు ఒక వ్యక్తిని మరణశిక్ష విధించడం "న్యాయపరమైన హత్య" తప్ప మరొకటి కాదు. ఈ విధంగా, ఈ "న్యాయపరమైన హత్య"కు వ్యతిరేకంగా నిర్వహించబడిన ఒక కార్యక్రమానికి సంబంధించి ఖలీద్‌ను 9 ఫిబ్రవరి 2016న అరెస్టు చేశారు. ఇతర కారణాల వల్ల కూడా ఖలీద్ కాషాయ దళాలకు కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ఉదాహరణకు, బెంగళూరులోని జర్నలిస్టు గౌరీ లంకేష్ ఇంట్లోకి చొరబడి 5 సెప్టెంబర్ 2017న కాల్చి చంపబడింది. జర్నలిస్టు గౌరీ లంకేష్ హత్యకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలలో అతను ముందున్నాడు. హంతకుల తూటాలు తన ఆలోచనలను నిశ్శబ్దం చేయవని ప్రకటించిన ఖలీద్ ఇలా అన్నారు: "హిందుత్వ ఫాసిస్ట్ శక్తులను తీవ్రంగా విమర్శించిన గౌరీ లంకేష్ హత్య పట్ల ఆగ్రహం మరియు దిగ్భ్రాంతి కలిగించింది. నాకు, ఆమె కేవలం జర్నలిస్టు మాత్రమే కాదు. ఆమె జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జెఎన్‌యు) ఉద్యమానికి బలమైన మద్దతుదారు.

ఖచ్చితంగా చెప్పాలంటే, సుప్రీంకోర్టు బెయిల్‌ని నియమంగా మరియు జైలు మినహాయింపుగా ప్రకటించినప్పుడు, భారతదేశంలో, ఫాసిస్ట్ పాలనలో రాజకీయ/కార్యనిర్వాహక పరిశీలనల ద్వారా చివరికి న్యాయపరమైన నిర్ణయాలను ప్రభావితం చేసే మరియు తారుమారు చేసే పరిస్థితిలో మనం జీవిస్తున్నాము. తమ తీర్పుల్లో రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని ఉటంకిస్తూ ముస్లింల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను 'పాకిస్థాన్'గా పేర్కొనడం ఇప్పుడు వార్త కాదు. ముస్లింలను కొట్టడం, మసీదులను కూల్చివేయడం, వారి నివాసాలను బుల్‌డోజర్ లతో ధ్వంసం చేయడం ఆనవాయితీ. ముస్లింలకు పౌరులుగా, ముఖ్యంగా భారతదేశంలోని అన్ని బిజెపి పాలిత రాష్ట్రాల్లో వేగంగా ఈ పనులు చేస్తున్నారు. అందువల్ల, ఉమర్ ఖలీద్ విచారణ లేదా బెయిల్ లేకుండా జైలులో మగ్గడం ఈ విస్తృత హిందూత్వ ఎజెండాలో ఒక భాగం. వారి ఎజెండాలో ముస్లింలు మొదటి శత్రువు. శత్రువు నెం. 1.

ఉమర్ ఖలీద్‌కు సంఘీభావంగా!

పిజె జేమ్స్
ప్రధాన కార్యదర్శి
సిపిఐ(ఎం.ఎల్)
రెడ్ స్టార్.

తెలుగు సేచ్ఛానుసరణ : మన్నవ హరి ప్రసాద్,
పొలిట్ బ్యూరో సభ్యుడు సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్.
82477 28296.
email: mannavahariprasad@gmail.com

వెంకన్న సేవకు వెంకటరమణ!

మాజీ సీజేఐకి టీటీడీ ధర్మపీఠం?

వెంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమో దేవో
నభూతో నభవిష్యతి

అంతటి తిరుమలేశుడి చెంతన అపచారాల కథనాలు సగటు భక్తులను చింతింపజేస్తున్నాయి. ఆ ఏడుకొండలవాడి దర్శనం ఎంతలా పరవశింపజేస్తుందో, శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం అంతలా మధురానుభూతిని పంచుతుంది. అటువంటి లడ్డూ నేతిలో కల్తీ గురించి సాక్షాత్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించిన దరిమిలా భక్తకోటి కలవరపడింది. ప్రపంచ ప్రఖ్యాత తిరుమల తిరుపతి దేవస్థానాల భాగ్యం సొంతమైన ఆంధ్రప్రదేశ్ లో కడపటి ప్రభుత్వం, పాలకుడు అనుసరించిన తీరులోని సత్యాసత్యాలు, వాదోపవాదాలు ఎలా ఉన్నప్పటికీ.. పూర్వరంగం స్థితిగతుల మేరకు బాలాజీ భక్తులు నొచ్చుకుంటున్నది నిజం! స్వతహాగా సప్తగిరీశుడి ఆరాధకుడైన ఏపీ ప్రభుత్వాధిపతిగా చంద్రబాబు వచ్చీరాగానే తిరుమల ఆలయ వ్యవహారాలు చక్కబెట్టడం మీదే ధ్యాస పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి శ్యామలరావును ఈవోగా నియమించారు. పరమపవిత్రమైన స్వామి వారి లడ్డూ ముడిసరుకు వినియోగంలోని అవకతవకలను బహిర్గతం చేశారు. ప్రస్తుతానికి ధర్మకర్తల మండలి లేదు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అన్నీ తానై చూస్తున్నారు. రాష్ట్రంలో పాలక పక్షం మారిన క్రమంలో టీటీడీ చైర్మన్ పదవికి భూమన కరుణాకరరెడ్డి రాజీనామా ఇచ్చారు.

చంద్రబాబు మదిలో ఏముంది?

తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్రత, కలియుగ భగవానుడి సేవలో తరించే భక్తులకు సౌకర్యాల పరంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తాపత్రయం శంకించలేనిది. తెలంగాణ, ఏపీ, తమిళనాడు సహా దేశ, విదేశాల నుంచి తిరుమల కొండకు ఆధ్యాత్మిక, తీర్థ యాత్రికులు నిరంతరం తరలివస్తుంటారు. కాబట్టి తన పాలనలో తిరుమల తిరుపతి కోవెలలు చంద్రబాబుకు గరిష్ట ప్రాధాన్యం. అందుకే తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) ట్రస్టు బోర్డు నియామకం ముఖ్యమంత్రి ముందున్న తదుపరి కర్తవ్యం. బోర్డు చైర్మన్, మెంబర్ పదవుల కోసం ఎందరో ఇప్పటికే తనను రకరకాల మార్గాలలో సంప్రదిస్తున్నారు. ముఖ్యమంత్రి మాత్రం టీటీడీ చైర్మన్ పోస్టుకు ఎంపికలో గతానికి, రొటీన్ కు భిన్నంగా సంచలనాత్మక నిర్ణయం తీసుకుంటారని వినవస్తోంది. ముఖ్యంగా చైర్మన్ పదవిలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు వంటి మూస ధోరణులకు స్వస్తి పలుకుతారని తెలుస్తోంది. తన పార్టీకి, కూటమి ప్రభుత్వానికి లాభనష్టాలతో నిమిత్తం లేకుండా..స్వామివారి భక్తకోటి యోజనాలే పరమావధిగా సరికొత్త అధ్యాయానికి నాంది చెబుతారని అంటున్నారు.

భారత న్యాయ పీఠం నుంచి టీటీడీ ధర్మ పీఠం దిశగా..

టీటీడీ చైర్మన్ పోస్టు కోసం హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ప్రముఖ టీవీ న్యూస్ ఛానెల్ ఛైర్మన్ తపిస్తున్నారు. అవునన్నా, కాదన్నా..తన మాధ్యమం ద్వారా టీడీపీ/కూటమి సర్కారు ఏపీలో ఏర్పడేందుకు బాగానే కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. గత, వర్తమాన పరిణామాలు, స్థితిగతుల నేపథ్యంలో చంద్రబాబు మాత్రం విశిష్ట వ్యక్తిత్వం వైపు చూస్తున్నారట. ఆయనే జస్టిస్ నూతలపాటి వెంకటరమణ! తాజా మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి. వెంకన్న సేవలో కడపటి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా (సీజేఐ) వెంకటరమణ నియామకానికి చంద్రబాబు నాయుడు చురుకుగా యోచిస్తున్నారని వినికిడి. తెలుగు వారిలో మొట్టమొదటి సీజేఐ దివంగత జస్టిస్ కోకా సుబ్బారావు (1966-67) కాగా, అర్ధ శతాబ్దం తర్వాత రెండో తెలుగు సీజేఐగా వినుతికెక్కిన ఏపీలోని కృష్ణా జిల్లా పొన్నవరానికి చెందిన జస్టిస్ నూతలపాటి వెంకట రమణ(67)! జస్టిస్ ఎన్వీ రమణ వాస్తవికవాది. చాలా ప్రాక్టికల్ మైండ్. ప్రతి సమస్యకూ పరిష్కారం కనుగొనే శ్రద్ధాసక్తులు సొంతం. తన ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూనే అందరినీ సమానంగా చూసే విశాల హృదయులు. అందరి మనోభావాలు, భావోద్వేగాలు తనవిగా భావించి స్పందించడం తనకు అబ్బిన సహజ లక్షణం. ఎంచుకున్న మార్గంలో అవరోధాలు ఎదురైనా అధిగమించడం మరో ప్రత్యేకత. తాను ఏ హోదాలో ఉన్నప్పటికీ తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుంటారు. ఆలయాలను సందర్శిస్తారు. సగటు భక్తుల స్థానంలో నిలబడి ఆలోచిస్తారు. పాడి ఆవులు అంటే తనకు సంతోషం. గోమాతను ప్రేమగా నిమురు తారు. పాడిపంటలన్నా, వ్యవసాయదారులన్నా ఎంతో అభిమానం. ప్రపంచ వ్యాప్తంగా భక్తులు, ఆరాధకులు కలిగిన దేవదేవుడు శ్రీనివాసుని సన్నిధిలో ధర్మకర్తల మండలి పీఠాన్ని(ఛైర్మన్) భారతదేశ అత్యున్నత న్యాయ పీఠం అధిరోహించిన జస్టిస్ ఎన్వీ రమణకే అప్పగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారట. ప్రస్తుత పరిస్థితుల్లో తానే సరైన వారనే నిశ్చయానికి వస్తున్నారని తెలుస్తుంది. ఇదే వాస్తవమైతే.. 48వ సీజేఐ టీటీడీ 54వ ఛైర్మన్ అవుతారు!

ఇల్లెందుల దుర్గాప్రసాద్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు
హైదరాబాద్
9440850384

స్పర్శ

స్పర్శకి పులకించని రక్తం
రక్తమే కాదు
స్పర్శకి పులకించని దేహం దేహమే
కాదు
అది గాలిస్పర్శ గానీ నీటిస్పర్శ గానీ
మంటస్పర్శ గానీ మాటస్పర్శ గానీ
ఏ స్పర్శనైనా గానీ
గాలికి పులకించాలి
దురాన్నుంచి గాలి మోసుకొస్తున్న
ధూళికి దుఃఖానికి పులకించాలి
దుఃఖలవెనుక అనంతంగా పరుచుకున్న
గాథలకి పులకించాలి బాధలకి
పులకరించాలి
నీటికి పులకించాలి
మబ్బుముత్యాలకు మట్టి
పులకరించినట్టు
మొలకలై పూలై పరిమళాలలై
మంటకి పులకించాలి
నాలుకలు చాచే జ్వాలలకి కవోష్ణ
రుధిరధారలకి పులకించాలి
మాటకి పులకించాలి మాటకి ప్రాణం
పెట్టాలి
గాలికి నీటికి పులకించని దేహాలు వద్దు
మంటకి మాటకి పులకించని
దేశాలు రద్దు

కోటం చంద్రశేఖర్
9492043348

రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- కొన్ని రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయండి
- కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం అందజేసిన తెలంగాణ స్పీకర్

వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24 (జనం సాక్షి): కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీని అధికార నివాసంలోని ఢిల్లీలో మంగళవారం నాడు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇరువురు నేతలు చర్చించిన అనంతరం నియోజకవర్గంలోని అత్యంత ముఖ్యమైన మూడు రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని కోరిన స్పీకర్ ప్రసాద్ కుమార్ కేంద్ర మంత్రిని కోరారు.అదేవిధంగా నియోజకవర్గంలోని 7 రోడ్లకు సి ఆర్ ఐ ఎఫ్ స్కీం పరిధిలో నిధులను మంజూరు చేసి నిధులను విడుదల చేయాలని కోరిన సభాపతి ప్రసాద్ కుమార్ కోరారు.చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వరరెడ్డి, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి, తెలంగాణ లెజిస్లేటివ్ సెక్రటరీ డా వి నరసింహా చార్యులు, స్పీకర్ ఓఎస్‌డి. వెంకటేశం, నాయకులు మాణిక్ రెడ్డిలు సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసారు. జాతీయ రహదారులుగా అప్ గ్రేడ్ చేయాలని కోరినవి.. కోకాపేట ఓఆర్ఆర్ జంక్షన్-శంకరపల్లి-మోమిన్ పేట- మర్పల్లి-బుదేర 80 కిలోమీటర్ల రోడ్డు..తాండూరు-పెద్దముల్-కోటపల్లి-మోమిన్ పేట-సదాశివపేట 63.20 కిలోమీటర్ల రోడ్డు.వికారాబాద్-మోమిన్ పేట 19.60 కిలోమీటర్ల రోడ్డు. సిఆర్ఐఎఫ్ పథకం క్రింద నిధులు మంజూరు చేయాలని కోరారు. వీటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలన్నారు. తాండూరు-దారూరు రోడ్డు కోసం 45 కోట్లు. కొత్తగడి - బంట్వారం రోడ్డు కోసం. 50 కోట్లు. కేసారం - తురమామిడి రోడ్డు కోసం 60 కోట్లు. వికారాబాద్ - ధారూర్ రైల్వే స్టేషన్ రోడ్డు కోసం55 కోట్లు.బషీరాబాద్ -మైలావర్ రోడ్డు కోసం 35 కోట్లు. మారేపల్లి-మదనాంతపూర్ రోడ్డు కోసం40 కోట్లు. పిడబ్ల్యుడి రోడ్డు నుండి బంట్వారం (వయా రాంపల్లి రోడ్డు అభివృద్ధి కోసం 30 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు.

దేశంలోనే ఆదర్శ గ్రామం మాప్లీనాంగ్

జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ ఉప్పలపాటి శ్రీకాంత్

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : భారతదేశంలోనే కాకుండా ఆసియా ఖండంలోనే అత్యంత పరిశుభ్రత కలిగిన నగరంగా మాప్లీ నాంగ్ గ్రామం నిలవడం హర్షించదగ్గ విషయమని, ఆ గ్రామం భారతదేశానికి ఎంతో ఆదర్శమని జిహెచ్ఎంసి స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు జిహెచ్ఎంసి అధికారిక అధ్యయన పర్యటనలో భాగంగా మేఘాలయ రాష్ట్ర రాజధాని షిల్లాంగ్ మున్సిపల్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ మరియు వ్యర్థాల సేకరణ విషయంలో అవలంభిస్తున్న విధివిధానాలను హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస రావు, దర్ల వెంకటేష్ గౌడ్, మంజుల రఘునాథ్ రెడ్డి, మాధవరం రోజాదేవి రంగారావుతో కలిసి పరిశీలించిన అనంతరం మంగళవారం మియాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. మేఘాలయ రాష్ట్ర రాజధాని షిల్లాంగ్‌లో స్వచ్ఛ గ్రామంగా పేరొందిన మాప్లీనాంగ్‌లో పారిశుద్ధ్య తీరుతెన్నులను తెలుసుకోవడానికి అక్కడికి వెళ్లడం జరిగిందని, ఆసియాలోనే అత్యంత పరిశుభ్ర నగరంగా గుర్తింపు పొందిన మాప్లీనాంగ్ లో గ్రామస్తులు పరిశుభ్రత కోసం అనుసరిస్తున్న విధి విధానాల గురించి వారిని అడిగి తెలుసుకోవడం జరిగిందని ఆయన వివరించారు. మేఘాలయ, షిల్లాంగ్ మున్సిపల్ బోర్డు పరిధిలోని ప్రాంతాలలో పారిశుధ్యం మరియు వ్యర్థాల నిర్వహణలో అవలంభిస్తున్న విధి విధానాలను, పట్టణ అభివృద్ధి పనులు, పురపాలక సేవలపై అమలవుతున్న ఉత్తమ పద్ధతులను సేకరించి, విజయవంతమైన పారిశుధ్య విధానాలను పరిశీలించి హైదరాబాద్ మహా నగరంలో అమలు పరిచేందుకు తమవంతుగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

అంకిత భావంతో పనిచేయాలి

- విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లాకు మంచి పేరు తీసుకరావాలి
- ఎస్పీ చెన్నూరి రూపేష్

సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 24(జనంసాక్షి) అంకిత భావంతో ట్రైనీ ఎస్ఐలు పనిచేయాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ సూచించారు. సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిన ట్రైనీ ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేశారు. క్రమశిక్షణకు మారుపేరు పోలీసు డిపార్ట్మెంట్, అలాంటి శాఖలో నియమితులైన మీరందరూ క్రమశిక్షణతో మెలగాలని, విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసి జిల్లాకే కాకుండా తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎవ్వరితో దురుసుగా మాట్లాడకూడదని, ఎదుటివారి సమస్యను ఓపిగ్గా విని, వారిలో ధైర్యాన్ని నింపి తక్షణ పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. సమాజ సేవ చేయడానికి పోలీసు శాఖ మరింత ఉపయుక్తంగా ఉంటుంది అన్నారు. శిక్షణలో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ లలో విధులు నిర్వహిస్తూ, అన్నిరకాల డ్యూటీలను తెలుసుకోవాలని అన్నారు. డ్యూటీల గురించి మనకు తెలిసినప్పుడే, సిబ్బందితో డ్యూటీ చేయించగలమని, ప్రతి డ్యూటీ గురించి తెలుసుకోవాలని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపిన శాఖపరమైన చర్యలు తీసుకోవడానికి వెనకాడనన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులతో సత్సంబంధాలు కలిగి ఉండి, ప్రజల ధన, మాన ప్రాణ రక్షణతో పాటు శాంతి భద్రతల రక్షణలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ సంజీవ రావ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇ. కళ్యాణి, ఎస్.బి ఇన్స్పెక్టర్ విజయ కృష్ణ, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ రమేష్, కంట్రోల్ రూం ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రమేష్ ఆర్.ఐ.లు ట్రైనీ ఎస్ఐ ల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చినుకులు పడితే-చుక్కాపూర్ కారు మబ్బుల్లోనే

- కొనేండ్లుగా ఇదే తంతు
- సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు సబ్ స్టేషన్ ముందు నిరసన

తలకొండపల్లి సెప్టెంబర్24(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఉత్పత్తి పకడ్బందీగా రైతులకు, గ్రామాలకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్తును అమలుపరుస్తున్నామని ప్రకటిస్తున్నప్పటికీ అధికారుల అలసత్వంతో చినుకులు కురిస్తే చాలు చీకటిమయంలో చుక్కాపూర్ గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అధికారుల తీరుకు నిరసనగా మంగళవారం చుక్కాపూర్ సబ్ స్టేషన్ ముందు గ్రామ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చినుకు పడితే చాలు మా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామమంతా చీకట్లు అలుముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్ని ప్రభుత్వాలు మారిన మా గ్రామంలోని విద్యుత్ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదనీ దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారనీ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో సతమతమవుతున్నామని అధికారులు మాత్రం ఏనాడు కూడా పట్టించుకున్న పాపాన పోలేదనీ చుక్కాపూర్ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తేలికపాటి వర్షాలు పడ్డా,గాలి దుమారం వచ్చినా మా గ్రామమంతా తెల్లారే వరకు అంధకారంలో మగ్గాల్సిందేననీ, అసలే వర్షాకాలం ఆపైన కరెంటు కష్టాలతో దోమలు స్వైర విహారం చేస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సబ్ స్టేషన్ నుండి సఫరేటు బ్రేకర్‌ను ఎర్పాటు చేసి ఏజీఎల్ కలెక్షన్ తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గ్రామానికి రెండు 25 కేవీ విద్యుత్ బుడ్లను ఏర్పాటు చేసి గ్రామంలో విద్యుత్ సమస్యలు లేకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమస్య పట్ల విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలనీ, లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామనీ వారు పేర్కొన్నారువారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు దాసరి యాదయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు జక్కు శ్రీనివాస్ రెడ్డి, ఇటిక్యాల శేఖర్ రెడ్డి, ఏమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాలూరి నరసింహ, రామచంద్రయ్య, బాలయ్య, శేఖర్, దరువుల జంగయ్య, ఎండి తాహీర్, జక్కు కొండల్ రెడ్డి,కల్లు రాజేశ్వర్ రెడ్డి, కోడుగంటి నరసింహ, వెంకటయ్య, కడారి పర్వతాలు, యాదయ్య, కొప్పు మల్లేష్, వెంకటయ్య, రాత్లావత్ బాట నాయక్, బకా నాయక్, వాల్య నాయక్, రాము నాయక్, తోకల వెంకటయ్య, దాసరి గోపాల్, కాగుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తనపై కావాలని లేనిపోని దుష్ప్రచారం చేయడం సరికాదు

తాండూరుకు వచ్చాక అన్ని వివరాలు వెల్లడిస్తా..!

జిపిఏ హోల్డర్ అబ్దుల్ రజాక్

తాండూరు సెప్టెంబర్ 24(జనంసాక్షి) వివాదాస్పద స్థలం సర్వే నెంబర్ 51 పై తనకు పలువురు ఫోన్ చేస్తున్నారని తాను మక్కాలో ఉన్నానని..ఆ స్థల జిపిఏ హోల్డర్ అబ్దుల్ రజాక్ చరవాణిలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన చరవాణిలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్నానని, నాపై కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని ఇలా చేయడం సరికాదన్నారు. తాను నా బంధువులు, స్నేహితులు, సన్నిహితుల గురించి మక్కాలో ప్రార్థనలు చేస్తున్నానని వివరించారు.వీడియో కూడా షేర్ చేశానని తెలిపారు. నిజానిజాలు లాయర్లు తమకు వెల్లడించడం జరిగిందని, తాండూరు కి వచ్చిన తర్వాత మరోసారి విలేకరులతో సమావేశం నిర్వహించి అన్ని వివరాలను వివరిస్తానని ఈ సందర్భంగా అబ్దుల్ రజాక్ స్పష్టం చేశారు.

పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటుకు చర్యలు

- మెరుగైన వసతులు కల్పించాలి
- విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి
- విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డిప్రతినిధి, సెప్టెంబర్ 24(జనంసాక్షి) చలికాలంలో సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వారికి అవసరమైన బ్లాంకెట్లు, దుప్పట్లు కొనుగోలుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లాలోని వివిధ శాఖల సంక్షేమ అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు సంక్షేమ వసతి గృహాల ఆర్సీవోలు, విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో కావలసిన వసతులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు చలికాలంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు అవసరమైన దుప్పట్లు, బ్లాంకెట్లు కొనుగోలు కు వివిధ శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సంక్షేమ గురుకుల పాఠశాలలో అన్ని సౌకర్యాలతో సైన్స్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ల్యాబ్ ఉన్నచోట అవసరమైన వస్తువుల కొనుగోలుకు ప్రతిపాదన తయారు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన వసతుల కల్పనకు ఏమేమి, అవసరమో వాటన్నిటిని కొనుగోలుకు ఎంత వ్యయం అవుతుందో పాఠశాలల వారీగా ప్రతి పనులు పంపాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యార్థులకు సకాలంలో కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు, జిల్లా విద్యాధికారి తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్ చెరువును పరిరక్షించాలని హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) మౌలాలి డివిజన్ పరిధిలోని సాహెబ్ చెరువును పరిరక్షించాలని సామాజిక కార్యకర్త మీర్ హుస్సేన్ అలీ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసి వినతి పత్రాన్ని అందజేశారు. మౌలాలి డివిజన్ పరిధిలోని మౌలాలి గుట్ట కింద సర్వే నంబర్ 425లో విలేజ్ మ్యాప్ ప్రకారం సాహెబ్ చెరువు ఉంది. కొందరు ఆక్రమణదారులు చెరువును పూడ్చి వేసి కబ్జా చేస్తున్నారని పలుమార్లు కలెక్టర్, ఆర్డిఓ, తహసిల్దార్, మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కరించకపోవడంతో లోకాయుక్తలో ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతోపాటు సాహెబ్ చెరువును పరిరక్షించాలని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు పత్రాలు,చెరువు విలేజ్ మ్యాప్ తదితర ధ్రువ పత్రాలను అందజేశామని తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేయండి

- అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలి
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి): ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేయాలంటే అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఇందుకుగాను అన్ని శాఖల అధికారులు సమన్వయం చాలా అవసరమని చెప్పారు అత్యవసర పరిస్థితుల్లో అధికారులు సెలవు పై వెళ్ళినప్పుడు తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలన్నారు. 26వ తారీఖున ఇన్చార్జి మంత్రివర్యులు సమావేశం ఉన్నందున అభివృద్ధి సంక్షేమ పథకాల సమగ్ర సమాచారాన్ని తయారు చేసుకుని వివరించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన చేపట్టాలన్నారు అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలన చేసి నివేదికల సమర్పించాలన్నారు సివిల్ రైట్స్ డే, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలు అన్ని గ్రామపంచాయతీలో అవగాహన కల్పించాలన్నారు జిల్లాలో కుల బహిష్కరణలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల లో సీసీటీవీ కెమెరాల అమర్చాలని చెప్పారు. ఈ ఆఫీస్ ద్వారా చేపట్టే ప్రతి ఫైలు ఎప్పటికీ భద్రంగా ఉంటుందని మాన్యువల్ ఫైల్స్ ఇకనుండి చూడడం జరగదని అన్నారు జిల్లాను టూరిజం స్పాట్‌గా రూపొందించే విధంగా టూరిజం ప్రాంతాలను గుర్తించి లిస్టు రూపొందించి డాక్యుమెంటేషన్ రూపంలో భద్రపరిచేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సంబంధిత అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ఇంటింటి పరిశీలనను ఈనెల 28లోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి) ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన కార్యక్రమాన్ని ఈనెల 28లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణకు ముందస్తుగా చేపట్టే ప్రీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలన, పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పై హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే విషయంపై అధికారులతో సమీక్షించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఫారం 6,7,8 లను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం పక్కగా నిర్వహించాలని ఈ నెల 28 లోగా ఈ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, తదితర అంశాలపై సమీక్షించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రీ రివిజన్ లో భాగంగా చేపట్టిన ఇంటింటి పరిశీలన కార్యక్రమం త్వరగా పూర్తి చేయాలని, ఫారం 6, 7, 8లను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల ప్రింటింగ్ కై ఇప్పటివరకు మూడు జిల్లాల నుండి మాత్రమే అప్డేట్ వివరాలు వచ్చాయని, మిగతా జిల్లాలు తక్షణమే సెప్టెంబర్ 24 వరకు అప్డేట్ వివరాలు పంపించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ లో భాగంగా బిఎల్వోలు నూటికి నూరు శాతం పోలింగ్ కేంద్రాలను, పోలింగ్ కేంద్రాల లొకేషన్లను పరిశీలించి ఫోటోలతో సహా అప్లోడ్ చేయాలని తెలిపారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 30న పబ్లిక్ నోటీసు జారీ చేయడం జరుగుతుందని, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈఆర్ఓ ల నియామకంపై సవరించిన ప్రతిపాదనలు పంపాల్సి ఉంటే తక్షణమే పంపించాలని జిల్లా కలెక్టర్లను కోరారు.

ప్రొబేషనరీ శిక్షణలో ఉన్న ఎస్ఐలు బాధ్యతగా విధులు నిర్వహించాలి

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) ప్రొబేషనరీ శిక్షణలో పోలీస్ స్టేషన్ ఫంక్షనింగ్ విధులపై, ఇతర విదులపై అవగాహన పెంచుకొని బాధ్యతగా విధులు నిర్వహించాలని జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రోబెషనరీ ఎస్సైలకు సూచించారు. శిక్షణను పూర్తి చేసుకొని జిల్లాలో 9 నెలల పాటు ప్రొబేషనరీ ఎస్సైగా శిక్షణ పొందేందుకు జిల్లాకు వచ్చిన 8 మంది సివిల్ ఎస్సైలు మంగళవారము జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ని కలసి రిపోర్ట్ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నలుగురు అధికారులకు గ్రేహౌండ్స్ శిక్షణకు, మరో నలుగురు అధికారులను పోలీస్ స్టేషన్ లకు కేటాయించడం తరవాత పోలీస్ స్టేషన్ లో శిక్షణ పూర్తి అయిన వారికి గ్రేహౌండ్స్ శిక్షణకు, గ్రేహౌండ్స్ శిక్షణ పూర్తి అయిన వారికి పోలీస్ స్టేషన్ లకు కేటాయించడం జరుగుతుందని అన్నారు. పోలీస్ స్టేషన్ లలో కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌గా, స్టేషన్ రైటర్స్‌గా, ఎస్‌హెచ్‌ఓగా ,వివిధ విభాగాలలో కూడా విధులు నిర్వహించవలసి ఉంటుందని పోలీస్ స్టేషన్ ఫంక్షనింగ్ పై పూర్తి అవగాహన పెంచుకోవాలని, బాధ్యతాతో విధులు నిర్వహించాలని అన్నారు. డయల్-100 కాల్స్ కు ఇన్ టైం లో రెస్పాండ్ కావడం, ఎన్ బి డబ్ల్యు ఎస్ సర్వ్ చేయడం, కోర్టు డ్యూటీ, రిసెప్షన్ ఫంక్షనింగ్ పై మరింత అవగాహన అవసరమని సమాజంలో ఎప్పటికప్పుడు కొత్త పోకడలతో జరుగుతున్న నేరాల పట్ల అవగాహన పెంచుకొని చేదించాలని సూచించారు. జిల్లాకు వచ్చిన ప్రొబెషనరీ ఎస్సైలు ఎం. తేజస్విని, బి. తారక, ఎస్. సతీశ్ కుమార్ రెడ్డి, ఏ. కిరణ్ కుమార్, ఎస్. తరుణ్ కుమార్ రెడ్డి, ఏ. వెంకటేష్ గౌడ్, బి. స్వాతీ, ఎన్. కుమార్‌లు జోగులాంబ గద్వాల జిల్లాకు కొత్తగా వచ్చిన ప్రొబేషనరీ ఎస్సైలు అని ఎస్పీ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 సెప్టెంబర్ 2024

ఒక సమస్యకు పరిష్కారం..!
కొత్త సమస్యకు పునాది

సంగారెడ్డి, సెప్టెంబర్ 24(జనం సాక్షి)

సంగారెడ్డి పట్టణం, రాజంపేట, ఎర్రకుంట ప్రాంతం లో గతవారం రోజుల క్రితం కురిసిన వరుస వర్షాల కారణంగా 'ఎఫ్ టిఎల్' పరిధిలో వున్నా ఇండ్లు పూర్తిగా నీటిమయం కాబడ్డాయి. స్థానిక ప్రజలు, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల అందరికి ఈ విషయం తెలిసినదే. ఆ క్రమంలో కాలనీ వాసులకు ఆ ఎర్రకుంట చెరువులో 'నిండిన వర్షం నీటిని' కిందకు వదలడానికి రాజంపేట నుండి మల్కాపూర్ చౌరాస్తా కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కాల్వర్టు పైప్ లైన్ తొలగించారు, తద్వారా తాత్కాలిక ఉపశమనం ఏర్పాటు చేశారు. తొలగించిన అట్టి 'కల్వర్టు పైప్ లైన్'ను పునర్నిర్మాణము చేయుట ఆలస్యం చేసి, ఇప్పుడు పూర్తిగా మరిచిపోయారు. స్థానిక రాజంపేట, ఇందిరకాలని నుండి తోడేల్ గూడెం, రామ్ చెంద్ర రెడ్డి నగర్ కాలనీ, గీత నగర్, సాయి నగర్, మల్కాపూర్ చౌరాస్తా వైపు వెళ్ళే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, రోడ్డు మొత్తం గుంతలు పడి ట్రాఫిక్ అంతరాయాలు తలెత్తుతున్నాయని, వాహన దారులకు ప్రమాదాలకు గురిఅవుతున్నారని స్థానిక ప్రజలు 'ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి వారిని ఆశ్రయించి ఆవేదన వ్యక్తం చేసారు. తద్వారా ఒక సమస్యకు పరిష్కారం చూపి, క్రొత్త సమస్య సృష్టించడం మీకు తగునా..? అని ప్రజలు బహిరంగానే 'ప్రభుత్వ అధికారులను' ప్రశ్నిస్తున్నారు. వెంటనే సంబందిత మున్సిపల్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో కాల్వర్టు నిర్మాణం చేపట్టి స్థానికులకు రాకపోకలకు ఇబ్బందిగా లేకుండా మరియు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని కోరుతూ స్థానికులతో కలిసి ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర డిమాండ్ చేశారు. ఇట్టి కార్యక్రమంలో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో క్రీడలకు మహర్దశ..!

- ఔత్సాహిక క్రీడాకారులకు ప్రయోజనం
- ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికో స్పోర్ట్స్ స్కూల్
- ఉమ్మడి జిల్లాలో రెండు ఏర్పాటు చేసే అవకాశం

వనపర్తి, సెప్టెంబర్24(జనంసాక్షి):

క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని ప్రతి లోక్ సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతోం ది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో క్రీడావర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు స్పోర్ట్స్ స్కూల్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న క్రీడాకారుల ఆశలు త్వరలోనే నెరవేరే అవకాశం ఉంది. స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నతనంలోనే విద్యార్థులకు నచ్చిన క్రీడలో శిక్షణ ఇచ్చి, వారి ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ వర్సిటీలో వసతి కల్పించనున్నారు. రాష్ట్రంలో హైద రాబాద్ (హకీంపేట), కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలలు ఉండగా..4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదట జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ నిర్వ హిస్తున్నారు. రాష్ట్రస్థాయి సెలక్షన్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఆయా క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ లోక్ సభ నియోజకవర్గాల పరిధిలో రెండు స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. స్పోర్ట్స్ స్కూళ్ల ఏర్పాటుతో మహబూబ్ నగర్ తో పాటు వనపర్తి, జోగులాంబ- గద్వాల, నాగర్ కర్నూలు , నారాయణ పేట జిల్లాల్లో క్రీడాభివృద్ధికి మరింత అవకాశం ఉంటుంది. ఇటీవల రాష్ట్రంలోని మూడు స్పోర్ట్స్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. రాష్ట్రంలోని ప్రతి

లోక్ సభ నియోజకవర్గంలో స్పోర్ట్ స్కూల్ ఏర్పాటుతో చాలా మంది చిన్నారులకు క్రీడల్లో శిక్షణకు అవకాశం లభిస్తుంది.

మెరుగైన వసతులు

లోక్ సభ పరిధిలో ఏర్పాటయ్యే స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నారులకు మెరుగైన క్రీడా వసతులు అందుబా టులోకి వస్తాయి. అధునాతన భవనాలతో పాటు ఫుట్ బాల్ ,హాకీ మైదానాలు, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీ ఇతర క్రీడల కోర్టులను ఏర్పాటు చేస్తారు. మొదట్లో జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయిలో ఎంపికలు నిర్వహించి, అందులో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు 4వ తరగ తిలో ప్రవేశం కల్పిస్తారు. స్కూల్లో చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ ఉంటుంది. మొదట చిన్నారులకు ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల్లో పరీక్షించి, వారు ఏ క్రీడలో రాణించే అవకాశం ఉందో, అందులో నిష్ణాతులైన కోచ్ లతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థులకు ఆహార పరంగా ప్రత్యేకమైన మెనూ అమలు చేస్తారు. డైటీషియన్ పర్యవేక్షణలో ప్రత్యేక భోజనం అందజేస్తారు. క్రీడా విద్యార్థులకు పోషక పదార్థాల అవసరం మేరకు మెనూ నిర్ణయించి, అందుకు అనుగుణంగా భోజన సౌకర్యం కల్పిస్తారు.

విద్యకు సమాంతరంగా క్రీడలను ప్రోత్సహించాలి

విద్యకు సమాంతరంగా క్రీడలను కూడా పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహిస్తే బాల బాలికల ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి సులభతరం అవుతుంది. అభిరుచి ఉన్న క్రీడాంశాలను ప్రాక్టీస్ చేయడం వల్ల వారిలో శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందుతుంది. తద్వారా పాఠ్యాంశాల పట్ల ఆసక్తి పెరుగుతుందని, క్రమశిక్షణతో పాటు పోటీతత్వం కూడా అలవడుతుందని, మానసికాభివృద్ధి నిపుణులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కాని గత కొన్నేళ్ళుగా ప్రభుత్వాలు క్రీడలను పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు కొనసాగుతున్నాయి. కేవలం ర్యాంకులు, మార్కులను సాధించి తమ విద్యా సంస్థలకు పేరు తెచ్చుకోవాలని విద్యను వ్యాపారంగా మార్చిన ప్రైవేటు యాజమాన్యాలు విద్యార్థులకు తలకు మించిన భారాన్ని మోపుతున్నరే తప్పా క్రీడలను నేర్పడం లేదన్న ఆరోపణలు ఎదురవు తున్నాయి. అందుకే ప్రభుత్వ రంగంలోనే క్రీడా పాఠశాలలను నిర్వహించాలని వివిధ క్రీడాభివృద్ధి సంఘాలు కోరుతున్నాయి.

క్రీడా నైపుణ్యాలను వెలికి తీయవచ్చు

సుధీర్ కుమార్ రెడ్డి డీవైఎస్ ఓ, వనపర్తి

స్పోర్ట్స్ స్కూళ్లతో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యా లను వెలికితీయ వచ్చు. ప్రస్తుతం ఆయా క్రీడల్లో అంతర్జా తీయ, జాతీయస్థాయిల్లో రాణిస్తున్న క్రీడా కారుల్లో చాలా మం ది స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే ఉన్నారు. స్పోర్ట్స్ స్కూళ్ల తో చాలా మంది చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుంది.

తరగతి గదుల్లో రొటేషన్ పద్ధతిని పాటించాలి

జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో వెనక బెంచీ లో ఉన్న విద్యార్థులను ముందు బెంచిలోకి, ముందు బెంచీలో ఉన్న విద్యార్థులను వెనక బెంచీలో కూర్చోబెట్టే (రొటేషన్) విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళ వారం జిల్లాలోని దామరగిద్ద మండలం కాన్ కూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి గదిలోకి వెళ్లిన కలెక్టర్ అక్కడ కొనసాగుతున్న డిజిటల్ ఆంగ్ల బోధనను పర్యవే క్షించారు.ఆ గదిలో ఉపాధ్యాయురాలు బోధిస్తున్న మాయాబజార్ పాఠ్యాంశంపై విద్యార్థులకు కలిగిన అవగాహన గురించి ఆరా తీశారు. ఎన్ని లెసన్స్ ఉన్నాయని? ఇప్పుడు ఎన్నో లెసన్ నడుస్తో ందని, ఇంతవరకు ఎన్ని పరీక్షలు జరిగాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గదిలో వెనక బెంచీలో ఉన్న రాధిక అనే విద్యార్థిని కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకపో వడంతో నేరుగా వెనక బెంచీ లోకి వెళ్ళిన కలెక్టర్

అక్కడున్న విద్యార్థులు అందరితో ఆంగ్ల పాఠ్యాం శాన్ని చదివించారు. వెనక బెంచీలో ఉన్న విద్యార్థులను ముందు బెంచిలో కూర్చోబెట్టాలని, ముందున్నవారిని వెనక బెంచీలో కూర్చోబెట్టాల ని, ఇలా ప్రతి తరగతి గదిలో రోజూ విద్యార్థుల సీట్లను మార్చాలని కలెక్టర్ తెలిపారు. గత సంవత్సరం పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం 84 శాతం ఉందని ఈసారి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, 9 ప్లస్ జిపిఏ కచ్చితంగా రావా లని, కనీసం నలుగురు విద్యార్థులైన 10 జిపిఏ సాధించాలని కలెక్టర్ చెప్పారు. డిసెంబర్ వరకు సిలబస్ పూర్తి అవుతుందని, అప్పటినుంచి రివిజన్ చేయాలన్నారు. విద్యార్థులు డైరీ మెయి ంటెన్ చేయాలని, ఏ రోజు ఏం చదివాం అనేది డైరీలో పొందుపరచాలని ఆమె సూచించారు. అనంతరం హెచ్ఎం గదిలోకి వెళ్లి ఉపాధ్యా యుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను కలెక్టర్ పరిశీలించారు. తరగతుల వారీగా విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, గైర్హాజరు అయ్యే విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడి వారిని పాఠశాలకు రప్పించే విధంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాల విజిట్ రిజిస్టర్ ఖాళీగా ఉండడం పై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. డిఇఓకు ఫోన్ చేసి విద్యా సంవత్సరం ప్రారంభమై మూ డు నెలలు దాటినా ఒక్కసారి కూడా కాన్ కుర్తి పాఠశాలను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నిం చారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకాన్ని వెంటనే చేపట్టాలని డీఈఓను ఆమె ఆదేశించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు 50 శాతం నిధులను ముందే విడుదల చేసినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. 25 శాతమే నిధులు విడుదల అయ్యాయని ఏఈ చెప్పడంతో కలెక్టర్ పి ఆర్ ఈ ఈ హీర్యా నాయక్‌కు ఫోన్ చేసి ఏ.ఈ. ధర్మరాజు నిర్లక్ష్య వైఖరి పై శాఖ పరమైన చర్య తీసుకోవాలని ఈఈని ఆదేశించారు. లేనిపక్షంలో నేనే చర్య తీసుకుంటానని కలెక్టర్ స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):

పోలీసులు నేత నియంత్రణపై దృష్టి సారించాలనీ జిల్లా ఎస్పి యోగేష్ గౌతం పోలీ సులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూజిల్లాలో శాంతి భద్రత లకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణపై దృష్టి సాధించాలని అన్నారు. జిల్లాలో గణేష్ నవ రాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబి పండుగల సందర్భంగా ఎంతో బాగా విధులు నిర్వర్తిం చిన, జిల్లా కేంద్రంలో జెండాల విషయంలో అనుకొని సంఘటన జరగడం పోలీసులు వెంటనే సమస్యను పరిష్కరించడం పోలీస్ అధికారులు సిబ్బందికి ఈ సందర్భంగా ఎస్పి అభినందించారు. భవిష్యత్తులో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోనే విధంగా ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కోరారు. రానున్న రోజుల్లో జిల్లాలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి దాని ప్రకారం పని చేయాలని తెలిపారు. జిల్లా పరిధిలో పెండింగ్ కేసులను న్యాయ అధికారాలతో కలిసి క్లియర్ చేయాలని సూచిం చారు. ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి "క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్" ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా బాధ్యతగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసి బాధితు లకు న్యాయం చేయాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ఉన్నందున పెద్ద మొత్తంలో కేసులు పరిష్కారం అయ్యే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పిలు ఎన్ లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, చంద్రశేఖర్, దస్రు నాయక్, రాజేందర్ రెడ్డి, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాముడు, రాజు, రామ్ లాల్, రమేష్, మురళి, కుర్మయ్య, ఆచారి, అశోక్ బాబు, కృష్ణం రాజు, నవీద్, సునిత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలి..!

హుస్నాబాద్ (జనంసాక్షి):

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద వినాయక నిమర్జనం జరిగిన ప్రదేశంలో పురపాలక సంఘము ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్, చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న పట్టణ ప్రజలుతో కలిసి చెరువులో ఉన్న చెత్తను, పరిసర ప్రాంతాలను శు భ్రపరచడం, చెత్తను ట్రాక్టర్‌లో వేసి డంపు యార్డ్‌కి తరలించడం జరిగింది. మంత్రివర్యులు గారు మాట్లాడుతూ ఇంటి చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గాంధీజీ యొక్క ఆశయాలను కొనసాగిస్తూ స్వచ్ఛత కార్యక్రమాల్లో పట్టణ ప్రజలందరూ చురుగ్గా పాల్గొని హుస్నాబాద్ పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈ కార్యక్ర మానికి ముందు మినీ స్టేడియంలో క్రీడాకారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, వైస్ చైర్ పర్సన్ అనిత, కౌన్సిలర్లు నళిని దేవి, లావణ్య సది, పద్మ, మ్యాదర బోయిన శ్రీనివాస్, సరోజన, వల్లపు రాజు, ప్రజా ప్రతినిధులు, మునిసిపల్ అధికారులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..!

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు సెప్టెంబర్24(జనంసాక్షి)

పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు అమలు చేస్తామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటుచేసిన రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల సంఘానికి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర వహించారనీ అన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీల అమలుకు కృషి చేస్తానని తెలిపారు.ముఖ్యంగా ఐదు వేల రూపాయల గౌరవ వేతనం, క్వింటాలకు 300 రూపాయల కమిషన్ అందించాలను కోరుతూ త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల డీలర్ల సంఘం అధ్యక్షులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. హామీల అమలు అనంతరం రాష్ట్ర రాజధాని హైదరాబాదులో రెండు లక్షల మందితో విజయోత్సవ ర్యాలీ ఏర్పాటు చేస్తానని తెలిపారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాజు మాట్లాడుతూ రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జులు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జాతీయ అధ్యక్షులు కృష్ణమూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వంభర్, వివిధ జిల్లాల నుండి సుమారు పదివేల మంది రేషన్ డీలర్లు హాజరయ్యారు.

కాపలాదారుడుగా ఉంటా..!

- పెబ్బేరు మార్కెట్ యార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందాం
- పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు సెప్టెంబర్ 24 (జనం సాక్షి)

తనపై ఇంత అభిమానం చూపి వనపర్తి ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కాపలాదారుడుగా ఉండి పనిచేస్తానని వనపర్తి ఎమ్మెల్యే శ్రీ తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై అధ్యక్ష ఉపాధ్యక్షులతో పాటు డైరెక్టర్లు అందరినీ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పెబ్బేరు పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యేకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజాప్రతినిధులు దప్పు వాయిద్యాల మధ్యన బాణాసంచా కాల్చుతూ ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెబ్బేరు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లవేళలా కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులు ఉపాధ్యక్షులు డైరెక్టర్లు అందరూ మార్కెట్ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.కబ్జాకు గురైన పెబ్బేరు సంత స్థలానికి తాను కావలదారుడుగా ఉండి 30 ఎకరాల 22 కుంటలకు దగ్గరుండి కంపౌండ్ వాల్ ఏర్పాటు చేయిస్తారని ఆయన అన్నారు.రైతు రుణమాఫీ పై మాట్లాడి నైతిక హక్కు పార్టీ నాయకులకు లేదని లక్ష రుణమాఫీ చేస్తామని విడతల వారీగా అన్నదాతలను ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన ఏకైక ప్రభుత్వం ప్రభుత్వమని ఎమ్మెల్యే విమర్శించారు.రైతు భీమా, రైతు భరోసా పథకాలను పక్కాగా అమలు చేసి రైతు శ్రేయస్సు ప్రభుత్వ శ్రేయస్సుగా నిలిపేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అప్పుడు గెలుపొందిన పార్టీకి 69 వేల కోట్లు అప్పు చూయిస్తే కేవలం 10 సంవత్సరాలలో పార్టీ ఆరు లక్షల 80 వేల కోట్ల రూపాయలను అప్పుగా చూపించి రాష్ట్రాన్ని దివాలా తీయించిన ఏకైక పార్టీ అని పేర్కొన్నారు. రానున్న గాంధీ జయంతి నుంచి రాష్ట్రంలోని ప్రజలందరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పెబ్బేర్ మార్కెట్ చైర్మన్ గౌని ప్రమోదిని పాండేశ్వర్ రెడ్డి వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మున్సిపల్ చైర్మన్ కరుణ శ్రీ సాయినాథ్, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, శ్రీరంగాపురం సింగిల్ విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, పట్టణ అధ్యక్షులు కార్పాకుల వెంకట రాములు, డైరెక్టర్లు మోతె రాములు, రామన్ గౌడ్, నరసింహా నాయుడు చంద్రకళ కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్, సాగర్, రంజిత్ కుమార్, సురేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ,అభివృద్ధి మోడీకే సాధ్యం

బిజెపిలో చేరి పటిష్టం చేయండి

రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు కొండయ్య

మాగనూర్ సెప్టెంబర్ 24 (జనం సాక్షి):

దేశ రక్షణ, అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీ కే సాధ్యమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి వివిధ వర్గాలు, మేధావులు బిజెపిలో చేరి మరింత వెన్నుదన్నుగా నిలవాలని కోరారు. మంగళవారం మా గనుర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని 62,63 బూత్‌లలో బిజెపి సభ్యత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి దేశ పరిస్థితుల దృష్ట్యా దేశ రక్షణ మన సనాతన ధర్మ రక్షణ ఎంతో అవసరం అన్నారు. దేశాన్ని విదేశాల్లో అప్రతిష్ట పాలు చేసేలా దేశంలో అంతర్గంగా దెబ్బతీసేలా విపక్షాలు, కుహనా లౌకిక వాదులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిస్థితిలో ప్రధాని నరేంద్ర మోడీ మొక్కవోని దీక్షతో దేశ పురోగభివృద్ధికి, ధర్మ రక్షణ కోసం పని చేస్తున్నారని అన్నారు. అలాంటి బిజెపికి అలాంటి ప్రధానికి దేశం కోసం మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పార్టీలో చేరి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు జి.నారాయణ, బిజెపి సీనియర్ నాయకులు జయనంద్ రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ తిమ్మప్ప, అంజప్పగౌడ్, లోకపాల్లి హన్మంతు, డాక్టర్ కృష్ణయ్య కాళప్ప, సిద్ధప్ప గౌడ ,బూత్ కమిటీ అధ్యక్షులు,నాయకులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు

ఆకస్మికంగా ఆసుపత్రి తనిఖీ చేసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):

మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఒక్కో నెలలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, ఎంత మంది గర్భిణీలను ప్రసవాల కొరకు జిల్లా ఆసుపత్రికి పంపిస్తున్నారని తెలుసుకున్నారు. ఉద్యోగులకు సమయానికి ఆసుపత్రిలో ఉంటున్నారా, 24 గంటలు ప్రజలకు సేవలను అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. సమయానికి ఆసుపత్రికి రాని ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉద్యోగుల హాజరును పరిశీలించారు. ఒక ఉద్యోగి పనివేళలు ముగిసినా ఇంకో ఉద్యోగి వచ్చి విధుల్లో చేరేవరకు విధులోంచి వెళ్లొద్దని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేగా ఆసుపత్రి అభివృద్ధికి నావంతు కృషి తప్పకుండా ఉంటుందని అన్నారు. పని చేస్తున్న

ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, రోగులకు చికిత్స అందించడంలో ఎలాంటి జ్యాపం జరగకూడదని సూచించారు. ఆసుపత్రికి ఇంకా కావాల్సిన పరికరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, ముఖ్య నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతమవుతూ
సక్రమంగా చదువు ఎలా..?

సిద్దిపేట టౌన్ సెప్టెంబర్ 24 (జనం సాక్షి)

భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర బాయ్స్ ఎడ్యుకేషన్‌లో నెలకొన్న సమస్య లను పరిష్కరించాలని కోరుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి మరియు సిద్దిపేట జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ 3000 మంది విద్యార్థులు ఐదవ తరగతి నుండి పీజీ వరకు వివిధ తరగతులు అభ్యసిస్తున్నారు. ఇందులో దాదాపు 1000 మంది విద్యార్థులు హాస్టల్లో ఉంటున్నారు. వీరందరి

ఆశ నిరాశల మధ్య ఊగిసలాడే.. తంగలన్

మానవ మనుగడ అంతా నియంత్రణ కోసం పోరాటమే అనిపిస్తుంది. తంగలన్ తమిళుడా? ద్రావిడుడా, శతాబ్దాల క్రితం వంచించబడ్డ దళితుడా, ఆఫ్రికన్ సోదరుడా, రెడ్ ఇండియన్ నాయకుడా, అండమాన్‌లో అంతరించిపోయిన జాతుల ఏకైక నీడా? తంగలన్ ఇవేవి కాదు. జాతి చరిత్రను ఈడ్చుకుపోయి, కులం చెట్టున వేలాడదీసినప్పుడు ఊపిరికై తన్నుకులాడిన సమయాలలో పెనుగులాట తంగలన్.

ఆ పెనుగులాటలో బ్రతుకు మీద ఆశ తంగలన్. ఆశ నిరాశల మధ్య ఊగిసలాడే ప్రయాణంలో నమ్మిన హేతువు తంగలన్. ఆ హేతువును ఆధారంగా చేసుకుని, ప్రస్తుతానికి తలవం చకుండా భవిష్యత్తు కొరకు ఊపిరి బిగపట్టి, ప్రాణాలు ఒత్తిపెట్టి, నొప్పిని ఆయుధంగా మార్చి మరికాస్త ముందుకు సాగి తనవారికి, తన తరవాత తరాలకు అమూల్యనిధిని అందించాలని తపనపడినవాడు తంగలన్. మరి ఆరతి? తంగలన్‌కు ప్రతిధ్వని. ప్రతి నాయకురాలైన నాయకురాలు. ఆమె ప్రకృతి. ఆరతి రక్తం చిందిస్తే తప్ప భూమి బంగారం కాదు. ఆ రక్తపు బంగారమే కదా అణిచివేసేవారికి కావలసింది. ఏ నిధి అయినా అలా సాక్షాత్కరించిందే. రక్తం చిందించనిదే నిధి దొరకదు! ఆ చిందించే రక్తం, ఎవ్వరిది? నిధి చుట్టూ ఉన్న మాయలు, మంత్రాలు, దెయ్యాలూ, భూతాలూ, పిశాచాలు–వీరంతా ఎవరు? తమ ఉనికిని, నిలువనిచ్చే భూమిని, నీడనిచ్చే ఆకాశాన్ని కాపాడుకోవడం కోసం ఎవరు ఎవరితో యుద్ధం చేశారు? ఆరతి తంగలన్ ఒకే దేహంలో ఢీపడే రెండు హేతువులు. వారి పోరాటం, వ్యక్తిలోని రెండు భిన్న అస్తిత్వాల మధ్య పోరాటం. ఆరతి తంగలన్‌లోని మరో తంగలన్ కదా? ఎంత శక్తిమంతుడ్కెన మగవాడు అయినా భూమి ముందు, మహిళల ముందు పిల్లవాడే. ఆ మాటను పదేపదే చెప్పారు. మహిళను భూమికి ప్రతీకలుగా నిలబెట్టారు. అది గలగలా పారే గంగమ్మాయినా, దడదడలాడే ఆరతి అయినా. 'భూమాత ఇచ్చిందే తీసుకోవాల, మనం కావలనుకుంటే దొరకదు, తాను కావాల నుకుంటేనే ఇస్తది,' అన్న మూలవాసి గొంతుక తంగలన్. చిన్న చిన్న బంగారపు పూసలతో తృప్తి పడిన తంగలన్, ఆశ పడి తననే తాను నాశనం చేసుకున్నాడు. తంగలన్ ఒక మనిషి కాదు. నాగరికత మొదల్కెనప్పటి నుండి వేనవేల కోట్ల మానవుల ఆశ, దురాశలు మధ్య కొట్టుమిట్టాడిన స్వార్థం. ఎదుగుదల మీద ఉన్న అపోహ.

చిన్నగా మొదల్కెనా కథల్లోని కథ, అసలు కథలో జమీందారు దోపిడితో తంగలన్ కుటుంబం ఉలిక్కిపడిరది. మళ్ళీ నిరాశ నుండి ఆశ. గొర్రె కసాయిని నమ్మడం అంటాం. పేదవాడు ధనవంతుడిని, నిస్సహాయుడు ఆశచూపిన వారిని నమ్మకపోతే ఇక మిగిలినది ఏమిటి? వైష్ణవమతం తీసుకున్న దళితులే, తీసుకోకపోయినా



దళితులే. ఈ అపోహలతో అబద్ధపు జంధ్యాలతో తాత్కాలిక ఉపసమానాలు అక్కడిక్కడే పైన కింది బేరీజులు! కులం దెబ్బకు, జామీను నికృష్ట చర్యలకు మనసు బద్దల్కెన తంగలన్, దొరల వెంట పోకుంటే, మరి కొన్ని రోజులలో బతికిన శవమై తేలేవాడు. కానీ తంగలన్‌లో ఆశాగ్ని రగులుతూనే ఉంది. అది మిణుకుమిణుకు మని, కొన్ని సందర్భాలలో ఖణఖణమని, మారొకసారి భగ్గున రేగే మంటలా ఎగిసి ప్రజ్వలిత తేజంతో వెలుగుతూనే ఉంది. అశోక మాట్లాడే మాటలు మనలో ఖ్ఖీకరించే లోగొంతుక కాదా? గంగమ్మలను, ఆరతిని ఆవాహన చేసుకున్న దేహాలు భూమిపుత్రులవి కాదా? నొక్కి పడేసే ఆ గొంతుకలన్నీ ఒక్కొక్కసారి మీద కొచ్చి ఉరమవా? ప్రకృతి ఒక్కసారి వళ్ళు విరుచుకుని అత్యాశాపరుల కోరికలను క్షణంలో ముగించదా? ఎన్నిసార్లు జరిగినా సిగ్గుందా మనిషి జాతికి? ఆశ ముందుకు సాగిస్తూనే ఉంటుంది. దురాశ మోసగిస్తూనే ఉంటుంది. అది జామీను అయినా దొర అయినా. దొరకు, జామీనుకు దోపిడీ వచ్చు. అందకుంటే కాళ్ళు పట్టుకోవడం, అందకుంటే పీకలు కోయడం వచ్చిన దూర్మార్గపు నమూనాలు వీరు. ఒకరు భూస్వాములు, కులాధిపత్య పైత్యకారులు, మరొకరు రాజ్యాధి కారులు, ఐశ్వర్యం కొరకు మానవజాతులను ఒకరిపైకి ఉసిగొల్పే నక్కలు, రాబందులు. దీనికి తక్కువగాని పెట్టుబడిదారి విధానాలు. స్వంత పిల్లలనే కోల్పోయే ఆశ నిరాశలు. జీవితాన్ని నిలబెట్టే కూలదోసే సాధనాలు. మధ్యన నలిగిపోయే వారంతా భూమిపుత్రులే!!

కరువు–కడుపు, రోగం–రొష్టు, నిత్యం వెంటాడే భయం, ఆ వెనుకే ఆశ, దుర్మార్గాన్ని నమ్ముకోవడం తప్ప మరో మార్గం దొరకని నిస్సహాయత. ఆ నిస్సహాయత నుండి మండే వెలుగు. ఆ వెలుగు కొరకై బ్రతుకు. ఆ వెలుగు విప్లవమా? ఆ విప్లవం నిధి కొరకేనా? నిధి. నిధి అంటే ఏమిటి? ఎవరికి ఎలా చూస్తే అలా కనపడే దేముడిలానే, నిధి అర్థం భద్రజీవులకు, చీకటిలో చుక్కలకోసం తారాడే వారికి ఒకటే ఎలా అవుతుంది? దొరకు నిధి–నియాంత్రణకు దారి. రాజుకు సంపద, బ్రాహ్మణుడికి ఆధిపత్యం, భూమి పుత్రుడికి ఆలంబన, ఉనికి, ఆత్మ గౌరవం, అవకాశం, బ్రతికే హక్కు. తంగలన్ నిధి, దొర నిధి ఒకటే ఎలా అవుతుంది? తనలోని ఆరతిని ఎదుర్కొనడానికి తన మరో ఉనికిని రక్తార్పణం చేసినా మళ్ళీ మళ్ళీ ఎలా వెలిగింది? ఆరతి తనలోని ప్రశ్న. తన మరో ఉనికి. తన తోబుట్టువు. తన తల్లి భూదేవికి పుట్టిన తన చెల్లి. ఆత్మీయు రాలు. ఆత్మ. నిధి అంటే? కులం, రాచరికం, పెట్టుబడిదారీ దౌర్జన్యం, ఆనకట్టలు, రహదారులు, మహా దేవాలయాలు, రాజ్యాలు, యుద్ధాలు–ఇవన్ని చరిత్రలో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ నిధుల కొరకు సాగిన పోరాటాలు, హత్యలు, మానవ బలిదానాలు లెక్కలేవు, లెక్కలోకి రావు.

దొరికినట్టే దొరికి బంగారం మట్టిగా మారడం, ఆరతి మళ్ళీ మళ్ళీ రావడం. భూమిలో నుండి నాగుపాములు రావడం. ఆరతి ఆక్రందనలు, పిలుపు నిచ్చే పోలికేకలు – ఇవన్నీ ఆధిపత్యం కాంక్షించేవారి దురాగతాల పై ఆదివాసుల ప్రతిఘటన ప్రతీకలు. ఇదంతా నిర్మాణాత్మక హింసకు ఎదురెళ్ళడం వలనేనా? రాతిని కరగబెట్టి, తవ్వి కూలగొట్ట–శతాబ్దాల వ్యథను, క్షోభను భరిస్తూ ప్రాణాలు పోతున్న స్థితిలో చివరాఖరి శ్వాస వరకు పోరాడిన వారంతా ఎవరు? ఎన్నికోట్ల భూమిపుత్రుల వేదనను సమీకరిస్తే ఈ రాతిహృదయాలు ఇటువంటి హింసకు చెమర్చుతాయి?

ఆఖరున అరణ్య తన అసలు ఉనికి ఆరతిలోనే ఉంది అని తెలుసుకున్నాడు. ఇది పూర్తి పరిష్కారం కాదని తెలిసినా, ఆరతి అతని ఆక్రోశాన్ని అర్థం చేసుకుంది, అతను కోరుకున్న బంగారం వద్దకు చేర్చింది. ఆ బంగారాన్ని అందుకోవడానికి అతని సహచరులు, మహిళలు, పిల్లలు కూడా అతని వెంట వస్తారు. అది దొరలు, రాజులు కోరికలు తీర్చే బంగారమా? లేక సంస్కారం లేని నీచుల నుండి కాపాడుకునే ఆత్మగౌరవ సాధనమా? అవకాశాలా హక్కులా?

"రాజ్యాంగం!"

- ఆపర్ణ తోట, హైదరాబాద్

ప్రజా సేవల విభజన పద్ధతులపై అధ్యయనం

- షిల్లాంగ్ మున్సిపల్ బోర్డును సందర్శించిన డిప్యూటీ మేయర్
- అక్కడి పరిపాలనా పద్ధతులను మెరుగైన సేవల కోసం అనుసరిస్తామని వెల్లడి

షిల్లాంగ్ (జనంసాక్షి) : మేఘాలయలో అధ్యయన పర్యటనలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఇతర కార్పొరేటర్లు షిల్లాంగ్ మునిసిపల్ బోర్డును సందర్శించారు. అక్కడి పరిపాలన, సేవల గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. షిల్లాంగ్ మునిసిపల్ బోర్డు నగర శుభ్రత, వ్యర్థాల నిర్వహణ, నీటి సరఫరా, రహదారి అభివృద్ధి, మురుగజలాల నిర్వహణ, పచ్చదనం పెంపుదల, తక్కువ ఆదాయ గృహ నిర్మాణ వంటి పలు ముఖ్యమైన సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, షిల్లాంగ్ మున్సిపల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రఫుల్ల బోరో, ఇంజనీర్ సిబ్బంది ద్వారా వివిధ సేవల అమలు పద్ధతులు, ఆధునిక సాంకేతికత వినియోగం, ప్రజలతో మున్సిపల్ సంస్థల అనుసంధానం వంటి అంశాలపై వివరాలను సేకరించారు. అధ్యయన పర్యటన ద్వారా, మేఘాలయలోని వివిధ మునిసిపల్ సంస్థలు అనుసరిస్తున్న పాలన నమూనాలు, పట్టణ ప్రణాళికా వ్యూహాలు, ప్రజా సేవల విభజన పద్ధతులను నిశితంగా తెలుసుకున్నారు. అవి తమ సొంత నగర పాలనలో అమలు చేయడానికి తగిన మార్గదర్శకాలు అనుసరించడం ముఖ్య ఉద్దేశ్యంగా డిప్యూటీ మేయర్ తెలిపారు. ఈ పరస్పర చర్చలు, హైదరాబాద్ నగర మునిసిపల్ పాలనలో సేవా ప్రమాణాలను మెరుగుపరచడంలో, తద్వారా పౌరులకు మెరుగైన సేవలు అందించడంలో సహాయపడతాయని ఆశిస్తున్నామన్నారు.

మహిళ దారుణ హత్య...

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 24 (జనం సాక్షి) : ఓ మహిళను హత్య చేసి నగలు దోచుకెళ్లిన సంఘటన సోమవారం అర్ధరాత్రి దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది . ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం మల్లంపేట పరిధిలోని వంశీ రెసిడెన్షియల్ లో నివాసముండే బొద్దుల శారద 50 పాల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తుంది. శారదకు భర్త లేడు. కుమారుడు సాయి వినయ్ ఉన్నాడు. వినయ్ తల్లి శారదకు ఫోన్ చేయగా సమాధానం రాలేదు. వెంటనే వినయ్ స్నేహితుడు నరేష్ కి ఫోన్ చేసి శారద వద్దకు వెళ్లి చూడమని చెప్పగా వెంటనే వెళ్లి చూసిన నరేష్ శారద ఆపస్మా రాక స్థితిలో పడి ఉందని వినయ్ కి చెప్పాడు. దీంతో ఇంటికి వచ్చిన వినయ్ తల్లిని హత్య చేసిబంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భగత్ సింగ్ జయంతిని జయప్రదం చేయండి: ఉమా మహేష్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 23 (జనం సాక్షి) : స్వతంత్ర సమరయోధుడు విప్లవ నాయకుడు భగత్ సింగ్ జయంతిని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేశ్ పిలుపునిచ్చారు. ఈనెల 28వ తేదీన విప్లవ యోధుడు భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని జగద్గిరిగుట్ట సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సిపిఐ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ చిన్న వయసులోనే హిందుస్థాన్ సోషలిస్టు పార్టీని ఏర్పాటు చేసి స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శంగా చరిత్రలో నిలిచి పోయాడన్నారు. పోరాట యోధుని జయంతి, వర్ధంతి కార్యక్రమాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. సిపిఐ కార్యకర్తలు అభిమానులు భగత్ సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్, శ్రీనివాస్, సహదేవ రెడ్డి, రాములు, సామెల్, రవి పాల్గొన్నారు.

సంప్రదాయాలు కాపాడుతూ పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలి

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- ఘనంగా గ్రాండ్ గణేశా అవార్డ్స్ 2024
- అపర్ణా సిరీన్ పార్క్‌కు అత్యధిక అవార్డులు
- అపర్ణా సరోవర్, రెయిన్ ట్రీ పార్క్, మై హోమ్ జువెల్ కు అవార్డులు
- 63 గేటెడ్ కమ్యూనిటీస్ కు అవార్డులు

హైదరాబాద్, **(జనంసాక్షి) :**

పండుగ సంప్రదాయాలు కాపాడుతూ పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించడంలో రెసిడెన్షియల్ సొసైటీలు కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రతిష్టాత్మక గ్రాండ్ గణేశ అవార్డ్స్ 2024 రెడ్ హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో నిర్వహించారు. సంప్రదాయాలు, ఆధునికతతో గణేష్ ఉత్సవాలు నిర్వహించిన గేటెడ్ కమ్యూనిటీలలో ఉన్న వారికి ఈ అవార్డులు అందజేశారు. ఈ ఉత్సవాలను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖతో కలిసి లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ యువ (జిల్లా 320) నిర్వహించింది. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలో నివసించే కుటుంబాల మధ్య ఐక్యత, ఆప్యాయతలకు ఈ ఉత్సవాలు ఒక వేదిక అన్నారు. కాస్మోపాలిటన్

సిటీగా హైదరాబాద్ 'మినీ ఇండియా' లాంటిదన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు విలక్షణమైన రీతిలో వినాయకుడిని పూజిస్తారని తెలిపారు. వినూత్న అలంకరణలు, డీజేల వినియోగంతో వేడుకల్లో ఆధునికత కనిపిస్తుందన్నారు.

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ యువా అధ్యక్షుడు, ఈవెంట్ కన్వీనర్ లయన్ డాక్టర్ సౌరభ్ సురేఖ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలలో ఐక్యత, సంస్కృతికి నిదర్శనమన్నారు. గణేష్ ఉత్సవాలు సామూహిక శక్తికి ప్రతిరూపం అన్నారు. ఈ సంవత్సరం అవార్డు గ్రహీతలు సామూహిక సామాజిక స్ఫూర్తికి మచ్చతునక అన్నారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రగతి గ్రూప్ చైర్మన్ డాక్టర్ జీబీకే రావు, స్పిరిచ్యువల్ మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ అనంత లక్ష్మి, ప్రఖ్యాత న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అపర్ణా సిరీన్ పార్క్‌కు అత్యధిక అవార్డులు దక్కాయి. ఈ అవార్డులు 63 గేటెడ్ కమ్యూనిటీస్ పొందాయి. గ్రాండ్ గణేశ అవార్డ్స్ 2024 అవార్డులు గెలుచుకున్న గేటెడ్ కమ్యూనిటీలు ఇవే..

ఎస్ఏ పామ్ మెడోస్ (కొంపల్లి) అత్యంత సొగసైన ఆర్గనైజ్డ్ ఫెస్టివల్ (500 కుటుంబాల వరకు) విభాగంలో అవార్డు పొందింది.

ఎస్ఎంఆర్ వినయ్ ఐకోనియా (కొండాపూర్) మోస్ట్ అప్ కమింగ్ సొసైటీ విభాగంలో అవార్డు దక్కింది.

నయా దిశా సొసైటీ కేటగిరీలో, ది నైబర్‌హుడ్, (కొంపల్లి) అవార్డు దక్కించుకుంది.

దళిత యువకులపై ఎస్ఐ జులుం..!!

- విచారణ పేరుతో చిత్రవధ
- పోలీసుల దెబ్బలు తట్టుకోలేక స్టేషన్లో నుంచి పరారైన యువకుడు
- ఎస్సైపై చర్య తీసుకోవాలని బాధిత కుటుంబాలు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా

వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబరు 24(జనం సాక్షి): విచారణ పేరుతో ఇద్దరు దళిత యువకులను అదుపులోకి తీసుకొని పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. స్టేషన్ లో పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక ఒక యువకుడు పోలీస్ స్టేషన్ నుంచి పరారీ అయ్యాడు. ఈ విషయమై బాధిత కుటుంబాలు పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు దిగారు. వారికి మద్దతుగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆందోళనకు దిగడంతో ఉధృత పరిస్థితి నెలకొంది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో జరిగింది వివరాల్లోకి వెళితే. ఒక కేసుల విచారణ కోసం మర్పల్లి ఎస్సై సురేష్ కొందరు పోలీసులతో మంగళవారం తెల్లవారుజామున మర్పల్లి మండలం పట్లూరు గ్రామానికి చెందిన మర్పల్లి ప్రవీణ్ కుమార్ నవీన్ కుమారులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం పోలీసులు ఆ దళిత ఇద్దరి యువకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. పట్లూరు గ్రామ శివారులో ఒక గుర్తు తెలియని శవం దొరికింది. ఈ విషయమై మర్పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది క్రమంలో పట్లూరు గ్రామానికి చెందిన మర్పల్లి రాములు అనే మతికి స్థిమితం సరిగ్గా లేని ఆ వివాహిక వ్యక్తి గత వారం రోజుల క్రితం నుంచి కనిపించకుండా పోయాడు. ఈ విషయమై ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు వెతికిన ప్రయోజనం లేకపోయింది. పట్లూరు శివారులో గుర్తు తెలియని వ్యక్తి శవం లభించడంతో ఎవరు వ్యక్తులు మర్పల్లి రాములు మిస్సింగ్ విషయమై పోలీసులకు సమాచారం అందించారు . దీనితో ఇదే కేసు విషయమై అనుమానితులుగా ఇద్దరు దళితుల యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ పేరుతో కాళ్లపై చేతులపై తోలు బెల్టుతో కొట్టారు. పోలీసుల దెబ్బలకు తట్టుకోలేక మర్పల్లి ప్రవీణ్ కుమార్ పోలీసులను నెట్టివేసి స్టేషన్ నుంచి పరారీ అయ్యాడు. పోలీసులు వెంబడించి పట్టుకునే ప్రయత్నం చేసిన దొరకలేదు. స్టేషన్ లో ఉన్న మరో దళిత యువకుడు నవీన్ కుమారును పోలీసులు చేతులపై తోలు బెల్టుతో కొట్టి చిత్రవధ చేశారు. వాళ్ల కాళ్లు చేతులు పోలీసులు కొట్టిన దెబ్బలకు వాచిపోయి పోయాయి.అంతేకాకుండా ఇది కేసు విషయమై దళిత యువకుల తల్లిదండ్రులు మర్పల్లి మొగులయ్య శ్యామలమ్మలను పోలీసులు విచారణ పేరుతో స్టేషన్ కు పిలిపించి కూర్చో పెట్టారు. ఇలా పోలీసులు మానసికంగా వేధించారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ నుంచి పరారీ అయినా మర్పల్లి ప్రవీణ్ కుమార్ మీడియాకు పోలీసు ఉన్నతాధికారులకు బిఆర్ఎస్ పార్టీ నాయకులకు సమాచారం అందించారు. దీంతో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ దళిత యువకులపై పోలీసుల వైఖరిని ప్రశ్నించడానికి మర్పల్లి పోలీస్ స్టేషన్ కు రావడంతో పరిస్థితి ఉద్రుతంగా మారింది. పోలీసులు ఉద్దేశపూర్వకంగా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై వేధింపులకు పాల్పడుతున్నారని పోలీసులను ప్రశ్నించడంతో పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేయడంతో పరిస్థితి ఉధృతంగా మారింది. తమకు న్యాయం చేయాలంటూ దళిత కుటుంబాలు పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. పరిస్థితి చేయి జారిపోకుండా మోమిన్ పేట సిఐ నవీన్ కుమార్ నవాబుపేట మోమిన్ పేట ఎస్ఐలను కొందరు పోలీసులను మర్పల్లికి రప్పించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితులకు బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మద్దతు పలకడంతో వారంతా పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాంచి ఆందోళన చేయడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఈ విషయం తెలియగానే వికారాబాద్ డిఎస్పి హుటా హుటిన మర్పల్లి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ కేసు విషయమై మోమిన్ పేట సిఐ నవీన్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఒక కేసు విషయంలో ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని ప్రచారించామని పోలీసులు వారిని కొట్టలేదని తెలియజేశారు. ఇందులో నుంచి ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి పరారీ అయ్యాడని వివరించారు. ఇదే విషయమై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ బాధిత కుటుంబాలతో వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి కి మర్పల్లి ఎస్ఐ సురేష్ పనితీరుపై ఫిర్యాదు చేశారు. మర్పల్లి ఎస్సై సురేష్ అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులను కార్యకర్తలను వేధింపులకు గురి చేస్తూ అక్రమ కేసులు వేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపి దళిత యువకులను దండించిన ఎస్సై పై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

28న నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము : మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్
- ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిది, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :

నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచ్చేయుచున్న సందర్భంగా అప్రమత్తంగా ఉంటూ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత శాఖల అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో నిర్వహించిన సమీక్షా సమావేశానికి అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టరు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ.. ఈ నెల 28న నల్సార్ యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గౌరవ భారత రాష్ట్రపతి విచ్చేయున్న సందర్భాన్ని పురస్కరించుకొని, సంబంధిత శాఖల అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో జిల్లాలోని హకీంపేట్ ఎయిర్ ఫోర్ట్ కు ముందుగా చేరుకొంటారని, అక్కడ అవసరమైన ఏర్పాట్లను, నల్సార్ యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రతి విభాగానికి ఒక అధికారిని నియమిస్తూ, ఏర్పాట్లను పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కీసర ఆర్డిఓను సూచించారు. రోడ్లు మరమ్మత్తులు, రెడ్ కార్పెట్లు, నిరంతరాయ విద్యుత్తు, పుష్పలంకారణ, వైద్య శిబిరాలు, అంబులెన్సు, సీటింగ్, మోబైల్ టాయిలెట్స్, పాసులు వంటి ఏర్పాట్లను సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేస్తుకుంటూ, సకాలంలో పనులు పూర్తి చేయాలని, నల్సార్ యూనివర్సిటి అధికారులను సమన్వయం చేస్తుకుంటూ, ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పరిశీలిస్తూ పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టరు తెలిపారు. భారత రాష్ట్రపతి తిరిగి వెళ్ళే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు కలెక్టర్ గౌతమ్ చేశారు. ఈ సమావేశంలో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, అర్ అండ్ బి జిల్లా అధికారి శ్రీనివాసులు, పోలీసు, వైద్య, విద్యుత్తు, పర్యాటక శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 సెప్టెంబర్ 2024
తెలంగాణ

ఎడమ కాలువ గండ్లపాపం గత ప్రభుత్వం నిర్వాకమే

వరదలపై రాజకీయ బురద చల్లకండి

- నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసింది చాలక నిందలా
- ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది
- నేటి నుంచి సాగర్ నీటిని విడుదల చేస్తాం
- ఇది రైతు పక్షపాత ప్రభుత్వం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

కోదాడ,సెప్టెంబర్ 24,జనంసాక్షి: తాజాగా సంభవించిన వర్షపు బీభత్సానికి పడిన గండ్లు పూడ్చివేతకు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల పనులను మంగళవారం రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతీ రెడ్డి కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తో కలసి పరిశీలించారు.కోదాడ నియోజకవర్గ పరిధిలోని నడిగూడెం మండలం కాగితం రామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాలువ మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు.అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు.ఎడమ కాలువ గండ్ల పాపం గత ప్రభుత్వ నిర్వాకమేనని,పదేళ్ల గత ప్రభుత్వ పాలన నిర్లక్ష్యానికి నిదర్శనమే కాలువలకు,చేరువులకు గండ్లు అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

నీటిపారుదల శాఖను నిర్వీర్యం చేసింది కాక నిందలా

లోపభూయిష్టమైన నిర్వహణ ఫలితానికి తాజా ఘటన పరాకాష్ట అని,నీటిపారుదల శాఖాను నిర్వీర్యం చేసింది చాలక కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారా అని మంత్రి ఉత్తం ఫైర్ అయ్యారు.వరదలపై రాజకీయ బురద చల్లకండని,లష్కర్ లతో సహా ఇంజినీర్లు సిబ్బంది నియామకాలు జరిపితే ఇటువంటి సంఘటనలు జరిగి ఉండేది కాదని ఎద్దేవ చేశారు.మాది రైతుపక్షపాత ప్రభుత్వమని,ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి చేతుల మీదుగా లష్కర్ల నియామకం

బుధవారం ఉదయం నుండి సాగర్ నీటిని విడుదల చేస్తాం అని,మేము అధికారంలోకి రాగానే 700 మంది ఏ.ఈ.ఈ లను నియమించామని,ఈ నెల 26 న ఎర్రమంజిల్ కాలనీ లోని జలసౌదలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామకాపు పత్రాలు అందజేస్తామని అన్నారు.త్వరలో 1800 మంది లష్కరుల నియామకాలు జరుపుతామన్నారు. పదేళ్ల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే విపక్షం విమర్శలు చేస్తుందని,50 ఏండ్ల అనంతరం సంభవించిన విపత్తు అని విపక్షం తెలుసుకోలేకపోతుందని వారు అన్నారు.

క్షణాల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టాం

విపత్తు సంభవించిన గంటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర మంత్రివర్గం క్షేత్రస్థాయికి చేరుకున్నారని,క్షణాల్లో నష్ట నివారణ చర్యలు చేపట్టామని, పంట నష్టం జరగకుండా చర్యలకుపక్రమించామని మంత్రి ఉత్తం తెలిపారు.సూర్యాపేట జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పంటపొలాలలో చేరిన నీటిని తొలగించేందుకు ఆదేశాలు జారీ చేశామన్నారు.గండ్లు పడిన ప్రాంతాలను ఆఘమేఘాల మీద సందర్శించామని,షార్ట్ టెండర్లను పిలిచి పునరుద్ధరణ పనులు చేపట్టామని,ఇది రైతుపక్షపాత ప్రభుత్వమని, రైతాంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని ఈ సందర్భంగా వారి పేర్కొన్నారు.సంబంధిత అధికారులు, పలువురు నాయకులు ఉన్నారు.

నల్లగొండ జిల్లా ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ముందు

- పట్టణం గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసిల్దార్ కార్యాలయాల ఏర్పాటు
- ఎస్ డి ఎఫ్ నిధులతో పూర్తిస్థాయిలో ఆధునీకరణ : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 25,(జనంసాక్షి) : నల్లగొండ జిల్లా ధరణి దరఖాస్తుల పరిష్కరించడం లో ముందుందని రోడ్డు భవనాలు సినిమాట్రోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అదేవిధంగా నల్గొండ పట్టణం,గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసిల్దార్ కార్యాలయాల ఏర్పాటు అవసరమని మంత్రి చెప్పారు. ఇందుకుగాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలని ఆయన జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డిని ఆదేశించారు. మంగళవారం మంత్రి నల్గొండ తహసిల్దార్ కార్యాలయం లో కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష 116 రూపాయలుల చొప్పున 117 చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతి నిధులతో మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గానికి సంబంధించి ఇంకా 200 కల్యాణ లక్ష్మి చెక్కులు పెండింగ్ లో ఉన్నాయని,వెంటనే వాటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నల్గొండ జనాభా 2 రెండు లక్షలు దాటడం, ప్రస్తుత తహసిల్దార్ కార్యాలయం పై పని ఒత్తిడి, కనగల్,తిప్పర్తి మండలాల నుండి నల్గొండ తహసిల్ పరిధిలో గ్రామాలు కలవడం,నల్గొండ జిల్లా కేంద్రం కావటం, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని నల్గొండ పట్టణం,గ్రామీణ ప్రాంతాలకు వేరు వేరుగా తహసిల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.నల్గొండకు ప్రత్యేక తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆయన జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డిని ఫోన్ ద్వారా ఆదేశించారు. ప్రస్తుత తహసిల్దార్ కార్యాలయాన్ని 25 లక్షల రూపాయల ఎం ఎల్ ఏ ఎస్ డి ఎఫ్ నిధులతో పూర్తిస్థాయిలో ఆధునికరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా మీటింగ్ హాల్ మరమ్మతులు, పబ్లిక్ అడ్రస్ సిస్టం,టాయిలెట్స్ తో పాటు, అన్ని గదులను ఆధునికరించడం,ఏ సి సౌకర్యం, అవసరమైన సౌకర్యాలు అన్నింటిని కల్పించాలని,ఇందుకు అంచనాలను రూపొందించా లని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం బాగుందని,రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా ధరణి దరఖాస్తుల పరిష్కారంలో ముందు ఉందని తెలిపారు.ముఖ్యంగా గత ప్రభుత్వ హయాం నుండి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 27,000 దరఖాస్తులు పెండింగ్ లో ఉండగా,జిల్లా కలెక్టర్ చొరవతో వాటిని పరిష్కరించి ఆ సంఖ్యను 4000కు తీసుకురావడం జరిగిందని,ప్రతికించి నల్గొండ తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి 1400 దరఖాస్తులలో 1100 ఇదివరకే పరిష్కరించడం జరిగిందని, తక్కినవి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పని నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను ఇబ్బంది పెట్టకుండా చూసుకోవాలని, ఎవరైనా పేదవారికి ఇబ్బంది కలిగించినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన చెప్పారు. గతంలో ధరణిలో అనేక రకాల అక్రమాలు జరిగా యని, వీటిని దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం సాధ్యమైనంతవరకు సమస్యలు లేకుండా పరిష్కరిం చేందుకుగాను ధరణి స్థానంలో భూ మాతను తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా సమస్యలను సులభంగా పరిష్కరించేం దుకు అవకాశం ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఇన్చార్జ్ ఆర్డిఓ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, నల్గొండ తహసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి

భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, (జూలై 24) జనంసాక్షి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు.. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ న్యాయమూర్తితో పాటు పలువురు న్యాయవాదులు కోర్టు ఆవరణలో ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన మార్గం అందరికీ ఆదర్శప్రాయమని ఆయనను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమంను నిర్వహించుకోవడం మంచి పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, ఏపీపీలు పివిడి లక్ష్మి, ఎన్.లావణ్య, విశ్వశాంతి, నాగలక్ష్మి, లాడ్స్ ఊట్కూరు పురుషోత్తమ రావు, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ఏపూరి బాబురావు, కటికం పుల్లయ్య అనుబ్రోలు రాంప్రసాదరావు, పిట్టల రామారావు, మల్లెల ఉషారాణి, మెండు రాజమల్లు, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఉద్యోగులు రామిశెట్టి రమేష్, లగడపాటి సురేష్, మీనా కుమారి, ప్రమీల, కృష్ణకుమారి, యాధా రమణ, దీకొండ రవి, ఉష, సిస్టమ్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జాలి ఫోనిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి): జిల్లా కేంద్రం సమీపంలోని బీబీగూడెంలో శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహిస్తున్న జాలి ఫోనిక్స్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని, ఆంగ్ల భాషలు నేర్చుకోవడంలో విద్యార్థులకు ఉన్న భయాలను తొలగించాలని అన్నారు.శిక్షణలో నేర్చుకున్న మెలుకువలు తరగతి గదిలో అమలుపరచడం ద్వారా ఆంగ్ల పదజాలము, మాతృభాషలో దాని అర్థం, ఉచ్చారణ, ఫోనిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ విద్యార్థులకు పెంపొందించాలని సూచించారు.ఇది విద్యార్థుల అభ్యసనను మెరుగుపరుస్తుందని, భావి విద్యార్థులు భవిష్యత్తు అవసరాలను స్థానికంగా, దేశీయంగా, అంతర్జాతీయంగా అందించగల సమర్థులు కావాలని, ఆంగ్ల భాషలో ఉన్న విషయాన్ని తెలుగులో, తెలుగులో ఉన్న విషయాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేయగల సమర్థత రావాలని ఆకాంక్షించారు.తరగతి గది బోధనలు విప్లవాత్మకమైన మార్పులు జాలి ఫోనిక్ శిక్షణ ద్వారా వస్తుందని తెలిపారు.ఈ శిక్షణ విజ్ఞానంతో పాటు వినోదదాయకంగా ఉందనే అభిప్రాయాన్ని అందరూ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిఈఓ అశోక్, క్వాలిటీ కోఆర్డినేటర్ దేవరశెట్టి జనార్ధన్, కోర్సు కోఆర్డినేటర్ కె.గోపాలరావు, జాలి ఫోనిక్స్ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎస్వీ గోమతి, హర్ష బాన్సలి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

పాలేరు ఎడమ కాల్వ నీటి విడుదలను పర్యవేక్షించిన మంత్రి పొంగులేటి

కూసుమంచి, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ బాబు లతో కలిసి కూసుమంచి మండలం హట్యాతండాలో పాలేరు ఎడమ కాల్వ నీటి విడుదలను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 150 మీటర్ల క్రింద పెద్ద గండి పడిందని యుద్ధ ప్రాతిపదికన గండి పూడ్చామని, క్రింద ఉన్న యూటి వాల్ నీటిలో ఉండటం వల్ల డ్యామేజ్ కావడం, దీనిని అధికారులు గ్రహించలేని కారణంగా నీటి విడుదల చేస్తే యూటి కూలిపోవడం జరిగిందని అన్నారు. ఈ కారణాల వల్ల దిగువున ఉన్న రైతులకు సాగునీటి సరఫరా రెండు మూడు రోజులు ఆలస్యమైందని, యుద్ధ ప్రాతిపదికన గత 2 రోజుల నుంచి అధికార యంత్రాంగం ఇక్కడే ఉండి మరమ్మతు పనులు చేశారని మంత్రి తెలిపారు.వరదల వల్ల వచ్చిన ఉపద్రవంతో ఆశించిన దాని కంటే రెండు, మూడు రోజులు సాగునీరు అందించడం ఆలస్యమైందని, భవిష్యత్తులో ఇటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్, ఎస్ఇ నర్సింగ రావు, ఇఇ లు వెంకటేశ్వర రావు, అనన్య, ఖమ్మం ఆర్డీవో జి. గణేష్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, సూర్యనారాయణ రెడ్డి, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి, బజ్జురి వెంకటరెడ్డి, జూకూరి గోపాలరావు, కంచర్ల జీవన్ రెడ్డి, పెంద్ర అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితా ప్రత్యేక సవరణ

ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులను జాగ్రత్తగా నిర్వహించాలి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

నల్లగొండ బ్యూరో, సెప్టెంబర్ 25, (జనం సాక్షి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితాలో ఓటర్ల పేర్ల చేర్పులు,తొలగింపులను పూర్తి జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలన,పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పై హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్డీవోలతో ఇదే విషయంపై సమీక్ష నిర్వహించారు.ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ప్రకారం ఫారం-6,7,8 లను పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు.ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం పక్కగా నిర్వహించాలని, ప్రత్యేకించి ఓటరు జాబితాలో చనిపోయిన,శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు,అలాగే చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జాగ్రత్తగా పరిశీలించి చేయాలని ఆదేశించారు.ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. చనిపోయిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లతోలగింపు పకడ్బందీగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ,తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి పరిశీలన కార్యక్రమంతో పాటు, ఫారం 6,7,8 లను వెంటనే పరిష్కరించాలని చెప్పారు.ఫోటో ఓటరు గుర్తింపు కార్డుల ప్రింటింగ్ కై ఇప్పటివరకు మూడు జిల్లాల నుండి మాత్రమే అప్డేట్ వివరాలు వచ్చాయని,తక్కిన అన్ని జిల్లాలు తక్షణమే సెప్టెంబర్ 24 వరకు అప్డేట్ వివరాలు పంపించాలని కోరారు.పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ లో భాగంగా బిఎల్వోలు నూటికి నూరు శాతం పోలింగ్ కేంద్రాలను,పోలింగ్ కేంద్రాల లొకేషన్లను పరిశీలించి ఫోటో అప్లోడ్ చేయాలని తెలిపారు.పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 30న పబ్లిక్ నోటీసు జారీ చేయడం జరుగుతుందని,ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈఆర్ఓల నియామకంపై సవరించిన ప్రతిపాదనలు పంపాల్సి ఉంటే తక్షణమే పంపించాలని జిల్లా కలెక్టర్లతో కోరారు.ఫారం 6,7,8 లకు సంబంధించి నోటీస్ పీరియడ్ పూర్తయి ఉంటే తక్షణమే వాటిని పరిష్కరించాలని, ఓటరు జాబితా పై ఇంటింటి పరిశీలన తర్వాత కొత్త పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు తక్షణమే పంపించాలని ఆదేశించారు.హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అధికారులు పాల్గొనగా, జిల్లా నుండి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, నల్గొండ ఇన్చార్జి ఆర్డీవో శ్రీదేవి, చందూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం,తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి
- విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ బ్యూరో,సెప్టెంబర్ 25,(జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్య తో పాటు,నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ కోరారు.విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.రెసిడెన్షియల్ పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతి గృహాలు, అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న మధ్యాహ్న భోజనం విషయంలో పూర్తి నాణ్యత ఉండాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని బోయవాడ పట్టణ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి 6,7 వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. విద్యార్థులకు అందిస్తున్న చదువు, భోజనం,అల్పాహారం,ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.అల్పాహారాన్ని తక్కువగా ఇస్తున్నారని, దోమల సమస్య ఉందని, దుప్పట్ల కొరత ఉందని, ప్రత్యేకించి నోట్బుక్కులు, యూనిఫారమ్ కావాలని విద్యార్థులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఎట్టి పరిస్థితులలో మెనూ పాటించాలని,మెనూ ప్రకారం కాకుండా తగ్గించి భోజనం పెట్టినట్లయితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు .విద్యార్థులు కోరిన వాటన్నింటిని వారం పది రోజుల్లో ఏర్పాటు చేస్తామని,బాగా కష్టపడి చదువుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ పాఠశాల వంటగదిని తనిఖీ చేయడమే కాకుండా,మంగళవారం విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. కాగా ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారమే అల్పాహారం,భోజనం వడ్డించాలని, ఎక్కడ తగ్గించడానికి వీల్లేదని ,వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మార్పు రావాలని,లేనట్లయితే చర్యలు తీసుకుంటామన్నారు.తక్షణమే పాఠశాలకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, విద్యార్థులు దోమలబారిన పడకుండా తలుపులు, కిటికీలకు జాలీలు ఏర్పాటు చేయాలని,ఎలక్ట్రిక్ పనులను చేయించాలని, పాఠశాలలో తరగతి గదులు,టాయిలెట్స్ అన్నింటికీ మరమ్మతులు చేయించిన తర్వాత కలర్ వేయించాలని, తక్షణమే నోట్ బుక్స్, యూనిఫామ్ పంపిణీ చేయాల్సిందిగా డీఈఓ ను ఆదేశించారు. పాఠశాలలో అవసరమైన లైట్లును సైతం ఏర్పాటు చేయాలని,చిన్నచిన్న మరమ్మతులు వెంటనే చేపట్టాలని,ఇవన్నీ వారంలోపు పూర్తి కావాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాఠశాల ఆవరణలో ఉన్న టాయిలెట్స్,మొదటి అంతస్తులో ఉన్న హాల్ ను తనిఖీ చేసి వాటన్నింటినీ ఉపయోగం లోకి తీసుకురావాలని ఆదేశించారు.ఎంఈఓ అరుంధతి, ఇంచార్జ్ స్పెషల్ ఆఫీసర్ ప్రభాకర్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

మార్కెట్లోకి టాటా నెక్సాన్ ఐసీఎన్జీ..

● రూ.8.99 లక్షల నుంచి షురూ..!

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : కార్ల మార్కెట్లో తన వాటా పెంచుకునేందుకు టాటా మోటార్స్ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా తన పాపులర్ సబ్ కంపాక్ట్ ఎస్‌యూవీ నెక్సాన్ కారును ఐసీఎన్జీ వేరియంట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.8.99 లక్షల (ఎక్స్ షోరూమ్)తో ప్రారంభం అవుతుంది. ఈవీ వర్షన్, డార్క్ వేరియంట్లతోపాటు సీఎన్జీ వేరియంట్ నెక్సాన్ కారులో పలు అప్ డేట్స్ తీసుకొచ్చినట్లు తెలిపింది. లాంగ్ రేంజ్ తో టాటా నెక్సాన్‌లో అప్ డేట్స్, డార్క్ వేరియంట్ కొనసాగింపుగా రెడ్ డార్క్ ఎడిషన్ ఆవిష్కరించినట్లు టాటా మోటార్స్ వెల్లడించింది. టాటా నెక్సాన్ ఐసీఎన్జీ వేరియంట్ 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్ కలిగి ఉంటుంది. గరిష్టంగా 100 హెచ్పీ, 170 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్ ఆప్షన్ కలిగి ఉంటది. కిలో సీఎన్జీపై 24 కి.మీ మైలేజీ ఇస్తుంది.

డ్యుయల్ సిలిండర్ టెక్నాలజీతో వస్తున్న టాటా నెక్సాన్ ఐసీఎన్జీ కారులో 321 లీటర్ల బూట్ స్పేస్ ఉంటది. సేఫ్టీ కోసం సిక్స్ ఎయిర్ బ్యాగ్స్, ఈఎస్పీ ప్రామాణికంగా వస్తున్నాయి. లార్జ్ పనోరమిక్ సన్ రూఫ్, 10.25 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ విత్ నేవిగేషన్ డిస్ ప్లే ఉంటుంది. ఎనిమిది వేరియంట్లలో ఈ కారు వస్తుంది. సఫారీ, హారియర్ కార్ల మాదిరిగా టాటా నెక్సాన్ 2024 రెడ్ డార్క్ ఎడిషన్ కారు వచ్చింది. ఈవీ టాటా నెక్సాన్ ఈవీ కారు 45 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ కలిగి ఉంటుంది. సింగిల్ చార్జింగ్ తో 489 కి.మీ ప్రయాణిస్తుందని టాటా మోటార్స్ చెబుతున్నా.. రియల్ వరల్డ్ రేంజ్ 350-370 కి.మీ దూరం ప్రయాణిస్తుంది. దీని ధర రూ.13.99 లక్షలు (ఎక్స్ షోరూమ్) పలుకుతుంది.

సరికొత్త గరిష్టాలకు చేరి.. ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు..

ముంబై, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : భారత స్టాక్ మార్కెట్లు చరిత్రలో తొలిసారిగా కొత్త శిఖరాలను తాకాయి. ఇటీవల వరుసగా కొత్త రికార్డులను నెలకొల్పుతూ దూసుకెళ్తున్న స్టాక్ మార్కెట్లు మంగళవారం మరోసారి గత రికార్డులను తిరగరాస్తూ ఆల్‌టైమ్ హైకి చేరాయి. చివరకు మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒక్కసారిగా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించగా.. వరుస సెషన్‌లో మార్కెట్లు వరుస లాభాల్లో కొనసాగుతూ వస్తున్నాయి. ఇదే క్రమంలో ఇవాళ ఉదయం సెన్సెక్స్ 84,860.73 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. అయితే, మధ్యాహ్నం వరకు సూచీలు మరింత దిగజారాయి. ఆ తర్వాత కోలుకొని లాభాల్లోకి దూసుకెళ్లాయి.

చివరి సెషన్‌లో అమ్మకాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. ఇంట్రాడేలో 84,716.07 పాయింట్ల కనిష్ఠానికి పతనమైన సెన్సెక్స్.. 85,163.23 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది. చివరకు 14.57 పాయింట్లు పతనమై.. 84,914.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 1.35 పాయింట్లు పెరిగి.. 25,940.40 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నిఫ్టీ 26,011.55 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. ట్రేడింగ్‌లో దాదాపు 1871 షేర్లు పెరగ్గా.. మరో 1946 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో టాటా స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, పవర్ గ్రిడ్ కార్ప్, టెక్ మహీంద్రా, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడ్డాయి. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, హెచ్‌యూఎల్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, శ్రీరామ్ ఫైనాన్స్ నష్టపోయాయి. సెక్టోరల్‌లో మెటల్ ఇండెక్స్ 3శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 0.6 శాతం, పవర్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగాయి. మరోవైపు పీఎస్‌యూ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ, టెలికాం 0.5-1 శాతం దిగజారాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి.

నెక్ గుడ్ల ధరలు

	ఫామ్‌గేట్	డజన్
హైదరాబాద్	₹ 512	₹ 61
వరంగల్	₹ 512	₹61

బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹75,110 (24 క్యారెట్లు) | ₹68,850 (22 క్యారెట్లు)

చెన్నై

₹68,850 (22 క్యారెట్లు) | ₹75,110 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹97,500

ఇండియన్ బ్యాంక్స్‌కు డేంజర్ బెల్స్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ అతిపెద్ద సమస్యను ఎదుర్కొంటోంది. కొన్ని రోజుల కిందట ఇదే వ్యవహారంపై భారతీయ రిజర్వు బ్యాంక్ సైతం తన హెచ్చరికను ప్రకటించింది. ఇది చూస్తుంటే భారతీయ బ్యాంకులకు ప్రజలు దూరమౌతున్నారా అనే అనుమానం కలుగుతోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం మార్కెట్లో పెద్ద చర్చకుదారితీస్తోంది. చాలా మంది స్టాక్ మార్కెట్లు, ఐపీవోలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి అధిక రాబడులవైపు డబ్బును మళ్లిచటం ఈ పరిస్థితులకు దారితీసినట్లు ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి.

ఇటీవలి కాలంలో బ్యాంకుల్లో డిపాజిట్ల సంఖ్య తగ్గిపోతోంది. అలాగే బ్యాంకుల్లో డబ్బు జమ చేసే వేగం కూడా మందగిస్తోంది. ఈ వేగాన్ని పెంచేందుకు అవసరమైన మార్గదర్శకాలను కూడా సెంట్రల్ రిజర్వ్ బ్యాంక్ ఆర్బీఐ దేశంలోని బ్యాంకులకు అందించింది. ఇది సదరు బ్యాంకుల వ్యాపారాన్ని సజావుగా నడిపేందుకు ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో అప్రమత్తమైన భారతీయ బ్యాంకులు ఈ లోటును పూడ్చేందుకు నిధుల సమీకరణకు వెళుతున్నాయి. ప్రత్యామ్నాయంలో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.1.3 లక్షల కోట్ల వరకు సమీకరించవలసి వస్తుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ నివేదించింది.

ఐసీఆర్ఏ నివేదిక ప్రకారం దేశీయ బ్యాంకులు బాండ్ల జారీ మార్గంలో దాదాపు రూ.1.2 నుంచి రూ.1.3 లక్షల కోట్లను సమీకరిస్తాయని తెలుస్తోంది. వాస్తవానికి ఇదే ఇప్పటి వరకు అత్యధికం కావటం గమనార్హం. పాజిట్లు, క్రెడిట్ వృద్ధి మధ్య నిరంతర అంతరం ఉన్న సమయంలో బ్యాంకింగ్ కంపెనీలు ఈ మార్గాన్ని ఎంచుకుంటాయి. దాదాపు 85 శాతం బాండ్లను ప్రభుత్వ రంగ బ్యాంకులే జారీ చేయనున్నాయని నివేదిక పేర్కొంది. దీనికి ముందు 2023-24 ఆర్థిక సంవత్సరంలో బాండ్లను జారీ చేయడం ద్వారా బ్యాంకులు రూ.లక్ష కోట్లు సమీకరించాయి. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ. 1.1 లక్షల కోట్లు సేకరించాయి.

క్రెడిట్ వృద్ధి స్థిరంగా డిపాజిట్ వృద్ధిని మించిపోవడం వల్ల బ్యాంకులు ప్రత్యామ్నాయ వనరుల నుంచి నిధులను సేకరించాల్సిన అవసరం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ పేర్కొంది. బాండ్ల నుంచి నిధులను సేకరించడం వలన ప్రైవేట్ రంగ బ్యాంకులకు రుణ రహిత నిష్పత్తి మరింత దిగజారిపోతుందని ఇక్రా ఫైనాన్షియల్ సెక్టార్ రేటింగ్స్ హెడ్ సచిన్ సచ్‌దేవా పేర్కొన్నారు. అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న విస్తారమైన పరిధిని బట్టి ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బాండ్ల ద్వారా వృద్ధి చెందుతూనే ఉంటాయి. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జూన్ 30, 2024 నాటికి మౌలిక సదుపాయాల రంగానికి బ్యాంకుల అడ్వాన్స్ క్రెడిట్ రూ.13-14 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది.

ఓపెన్ ఏఐ ఎక్స్ ఖాతా హ్యాక్

● క్రిప్టో కరెన్సీ ప్రకటన దర్శనం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : 'చాట్ జీపీటీ' సృష్టికర్త ఓపెన్ ఏఐ సంస్థ ప్రస్తుతం హ్యాకర్ల సంబంధిత సమస్యలను ఎదుర్కొంటోంది. తాజాగా ఆ సంస్థకు చెందిన ఒక ఎక్స్ ఖాతా హ్యాక్‌కు గురైంది. అందులో హ్యాకర్లు క్రిప్టో కరెన్సీ ప్రకటన పోస్టు చేశారు. ఆ క్రిప్టో టోకెన్లు ఓపెన్ ఏఐకి చెందినవిగా పేర్కొన్నారు. ఎక్స్ ఖాతా హ్యాక్ గురించి సంస్థ అధికారికంగా ప్రకటిం చింది. **@OpenAI Newsroom**అనే ఖాతా సోమవారం ఉదయం హ్యాక్‌కు గురైనట్లు తమ సంస్థ గమనించిందని తెలిపింది. ఆ ఖాతా నుంచి సాయంత్రం 7 గంటల సమయంలో ఈ పోస్టులు వచ్చినట్లు వెల్లడించింది. ఇవి న్యూయార్క్ సహా కొన్నిచోట్ల కనిపిస్తున్నట్లు పేర్కొంది. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించింది. సంస్థలో కీలక ఉద్యోగి అయిన జేసన్ వీ ఎక్స్ ఖాతా కూడా ఆదివారం హ్యాక్‌కు గురైంది. ఆ ఖాతాను హ్యాక్ చేసిన హ్యాకర్లు క్రిప్టో పోస్టులు పెట్టారు. అంతేకాదు, ఈ ఏడాది జూన్‌లో ఓపెన్ ఏఐ చీఫ్ సైంటిస్ట్ జాకబ్ పచోకీ ఖాతా కూడా హ్యాక్ అయ్యింది. గత ఏడాది జూన్‌లో కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మారియా మురాటీస్ ఖాతా తాత్కాలికంగా గుర్తుతెలియని వ్యక్తులు ఉపయోగించారు.



సిద్ధరామయ్యకు చుక్కెదురు!

బెంగుళూరు, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు.. హైకోర్టులో చుక్కెదురైంది. ముడా స్కామ్‌లో సీఎంను విచారించాలని గవర్నర్ థావర్ చాంద్ గెహ్లోట్ చేసిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సిద్దరామయ్య కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ ఎం నాగప్రసన్న నేతృత్వంలోని బెంచ్ ఈ కేసులో తీర్పును ఇచ్చింది. గవర్నర్ గెహ్లోట్ వ్యక్తిగత నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నదని, ఆయన పూర్తిగా మెదడు పెట్టి ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ నాగప్రసన్న తెలిపారు. అందుకే సీఎంను ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ తీసుకున్న నిర్ణయంలో ఎటువంటి లోపం లేదని హైకోర్టు తెలిపింది. మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీలో సుమారు 14 సైట్లను అక్రమ రీతిలో సీఎం సిద్దరామయ్య భార్యకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసులో సీఎం సిద్దును విచారించాలని గవర్న్ గెహ్లోట్ ఆదేశాలిచ్చారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ప్రకారం, భారతీయ నాగరిక సురక్షా సంహితలోని సెక్షన్ 218 ప్రకారం.. సీఎంను విచారించే అవకాశాలు ఉన్నట్లు గవర్నర్ తన ఆదేశాల్లో తెలిపారు. సిద్దరామయ్య తరపున ప్రముఖ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ, ప్రొఫసర్ రవివర్మ కుమార్ వాదించారు. ఇక గవర్నర్ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అడ్వకేట్ జనరల్ శశి కిరణ్ షెట్టి తమ వాదనలు వినిపించారు.

శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఆరు కొత్త ఫ్లైట్స్

శంషాబాద్, సెప్టెంబరు 24 (జనంసాక్షి) : శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఆరు నగరాలకు ఇండిగో విమాన సేవలను జిఎంఆర్ సంస్థ ప్రకటించింది. దేశీయ విమాన కనెక్టివిటీని పెంచింది, విభిన్న సాంస్కృతిక గమ్యస్థానాలను అన్వేషించే ప్రయాణికులకు హైదరాబాద్ ను కేంద్రంగా మార్చింది. (అగర్తలా) సెప్టెంబర్ 23 నుంచి అగర్తలాకు వారానికి నాలుగు సార్లు విమానాలు నడపనున్నారు. ఈ విమానం 07:30 గంటలకు బయలుదేరి 10:20 గంటలకు చేరుకుంటుంది. (జమ్ము) సెప్టెంబర్ 24 నుంచి జమ్ముకు వారానికి మూడు సార్లు విమానాలు నడుస్తాయి. యాత్రికులు, పర్యాటకులు ఆధ్యాత్మిక వారసత్వాన్ని అన్వేషించడానికి వీలుగా విమానాలు 0705 గంటలకు బయలుదేరి 1010 గంటలకు చేరుతాయి. (ఆగ్రా) సెప్టెంబర్ 28 నుంచి ఆగ్రాకు వారానికి మూడు సార్లు విమానాలు నడుస్తాయి. విమానాలు శంషాబాద్ విమానాశ్రయం నుండి 1355 గంటలకు బయలుదేరి 1605 గంటలకు ఆగ్రాకు చేరుకుంటాయి, ఇది ప్రపంచ ప్రసిద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించడం ప్రయాణికులకు సులభం చేస్తుంది. (కాన్పూర్) కాన్పూర్ సెప్టెంబర్ 27 నుండి వారానికి నాలుగు సార్లు అనుసంధానించబడుతుంది. సర్వీసులు 0855 గంటలకు బయలుదేరి 1100 గంటలకు చేరుకోవడంతో, ఇది వ్యాపార, విశ్రాంతి ప్రయాణికులకు అవకాశాలను తెరుస్తుంది. (అయోధ్య) సెప్టెంబర్ 27 నుంచి అయోధ్యకు వారానికి నాలుగు సార్లు విమాన సర్వీసులు నడుస్తాయి. 1355 గంటలకు బయలుదేరి 1605 గంటలకు చేరుకునే ఈ విమానాలు భక్తులకు, చరిత్ర ఔత్సాహికులకు సేవలు అందిస్తాయి. (ప్రయాగ్ రాజ్) ప్రయాగ్ రాజ్ కు వారానికి మూడుసార్లు సెప్టెంబర్ 28 నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయి. విమానాలు 0855 గంటలకు బయలుదేరి 1050 గంటలకు చేరుతాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద మతపరమైన సమావేశాలలో ఒకదానికి ప్రవేశాన్ని అందిస్తుంది. కొత్త నెట్ వర్క్ గురించి జిహెచ్ ఐఎఎల్ సిఇఒ శ్రీ ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ, "ప్రయాణికులకు ప్రయాణ ఎంపికలను మెరుగుపరిచే కొత్త దేశీయ మార్గాలను ప్రవేశపెట్టడానికి మేము సంతోషిస్తున్నాము. కనెక్టివిటీని మెరుగుపరచడానికి, హైదరాబాద్‌కు అక్కడి నుండి అంతరాయం లేని ప్రయాణాన్ని సులభతరం చేయడానికి మా నిబద్ధతను ఈ విస్తరణ ప్రదర్శిస్తుంది. దేశీయ మార్గాలను పెంచడం ద్వారా, మేము ప్రయాణికులకు భారతదేశం యొక్క వైవిధ్యమైన ప్రకృతి దృశ్యాలు మరియు సంస్కృతులను అన్వేషించడం సులభతరం చేస్తున్నాము, ఒక కీలక విమానాశ్రయంగా మా స్థానాన్ని బలోపేతం చేస్తున్నాము మరియు ఈ నగరాల పెరుగుదలకు మద్దతు ఇస్తున్నాం. ఈ కొత్త విమానాలు భారతదేశంలోని ప్రధాన నగరాలకు కీలకమైన అనుసంధానంగా ఆర్జిఐఎ స్థానాన్ని బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉన్నాయి, ప్రయాణీకులందరికీ 75 కి పైగా దేశీయ, 18 అంతర్జాతీయ గమ్యస్థానాలకు అంతరాయం లేని మరియు సరళమైన ప్రయాణ అనుభవాలను సులభతరం చేస్తాయన్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో పోటీ వద్దు: రాకేశ్ శర్మ

బెంగుళూరు, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా రాకేశ్ శర్మ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. రష్యాకు చెందిన సోయేజ్ టీ11 వ్యోమనౌక ద్వారా ఆయన సాల్‌యుట్-7 స్పేస్ స్టేషన్‌కు వెళ్లారు. 1982 ఏప్రిల్‌లో ఆయన ఆ ట్రిప్ చేశారు. 8 రోజులు అంతరిక్షంలో ఉన్న రాకేశ్ శర్మ.. ఆ స్పేస్ నుంచి భారత్‌ను ఫోటో తీశాడు. భారరహిత స్థితిలో శరీరంపై ఎటువంటి ప్రభావం పడుతుందన్న కోణంలో యోగా ఎక్స్‌సైజుల ద్వారా స్టడీ కూడా చేశాడు. భారత వైమానిక దళానికి చెందిన రాకేశ్ శర్మతో పాటు మరో పైలెట్ రావిష్ మల్హోత్రా కూడా రష్యాలో శిక్షణకు ఎంపికయ్యారు. కానీ రాకేశ్ శర్మ మాత్రమే నింగిలోకి వెళ్లారు. ప్రస్తుతం తమిళనాడులోని కూనూరులో ఆయన నివాసం ఉంటున్నారు. ఇటీవల ఓ మీడియా సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. దాంట్లో అనేక అంశాలపై ఆయన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. శిక్షణ కోసం రష్యా వెళ్లిన సమయంలో.. ఆ దేశ భాష అర్థం కాలేదన్నారు. కానీ శిక్షణ కొనసాగుతున్నా కొద్దీ.. రష్యన్ భాషపై పట్టు వచ్చిందన్నారు. ఇక రష్యాలో ఉన్న అతిశీతల వాతావరణాన్ని తట్టుకోవడం కూడా కష్టమైందేనన్నారు. వింటర్ సీజన్‌లో మైనస్ 30 ఉష్ణోగ్రతలో గడపాల్సి వచ్చినట్లు చెప్పారు. సాల్‌యుట్-7 స్పేస్ స్టేషన్ 1971లో తొలిసారి లాంచ్ చేశారు. 1991 వరకు ఆ స్పేస్ స్టేషన్ ఉన్నది. 1982లో రాకేశ్ శర్మ ఆ స్టేషన్‌లో భూమి చుట్టూ రౌండేశారు.

అంతరిక్షంలోకి వెళ్లి.. కిందకు చూస్తూ.. భూమి మీద హద్దులు ఏమీ కనిపించవని రాకేశ్ శర్మ తన ఇంటర్వ్యూలో ఓ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు అంతరిక్ష పరిశోధనల్లో కలిసికట్టుగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. అన్ని దేశాలు కలిసి రోదసి పరిశోధనలు చేస్తే, భూమి మీద సమస్యలు ఉండవన్నారు. సంపద అందరికీ సమానంగా అందకపోవడం వల్లే భూమి మీద సమస్యలు వస్తున్నాయని, ఒకవేళ స్పేస్ ప్రోగ్రాముల్లో దేశాలు పోటీపడితే, ఇలాంటి సమస్యలు అంతరిక్షంలో కూడా వస్తాయన్నారు. హీలియంతో పాటు అరుదైన కొన్ని ఖనిజాలు భూమి మీద అంతరిస్తున్నాయని, వాటి కోసం అంతరిక్షంలోని ఆస్టరాయిడ్స్‌పై భవిష్యత్తులో మైనింగ్ జరిగే అవకాశాలు ఉన్నట్లు శర్మ అంచనా వేశారు. జాతీయ జెండాలను ధరించి అంతరిక్షానికి వెళ్తే, అప్పుడు సమస్యలు అక్కడ కూడా వస్తాయన్నారు. అందుకే స్పేస్ పరిశోధనల్లో కలిసికట్టుగా ఉండాలన్నారు. ఒకవేళ ప్రపంచ దేశాలన్నీ కలిసి అంతరిక్ష పరిశోధనలు చేపడితే, అక్కడ ఉన్న వనరుల్ని భూమికి తీసుకువస్తే, అప్పుడు భూమిపై సమస్యలు తొలిగిపోతాయన్నారు. లేదంటే భూమి మీద ఉన్న పరిస్థితులే అక్కడ కూడా తయారవుతాయన్నారు. శాటిలైట్ టెక్నాలజీలో ఇండియా మంచి స్థితిలో ఉన్నదని, అంతరిక్షంలో ఎక్కువ కాలం మనుషులు జీవించవచ్చు అన్న సమాచారం రష్యా వద్ద ఉన్నదని, అమెరికా వద్ద అత్యాధునిక టెక్నాలజీ ఉన్నదని రాకేశ్ శర్మ తెలిపారు. భారతీయుడిగానో, రష్యన్‌గానో, చైనీస్, అమెరికా పౌరుడిగానో స్పేస్‌లోకి వెళ్లవద్దు అని, భూమి నుంచి వెళ్లిన మనుషులుగా అంతరిక్షానికి వెళ్లాలని, అలాంటి మార్పు రావాలని, ఎందుకంటే భూమి నుంచి వేల కిలోమీటర్ల దూరం వెళ్లి అక్కడ నేను భారతీయుడిని, రష్యన్‌ను, చైనా, అమెరికా దేశస్థుడని చెప్పుకోలేమన్నారు. రాకేశ్ శర్మకు హీరో ఆఫ్ ద సోవియేట్ యూనియన్ అవార్డు దక్కింది. రష్యాకు చెందిన మిగ్-21, మిగ్-23, మిగ్-27 యుద్ధ విమానాలను నడిపినట్లు చెప్పారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధంలో 21 సార్లు మిగ్-21 యుద్ధ విమానాన్ని నడిపినట్లు వెల్లడించారు. మిగ్-21 విమానం నుంచి సురక్షితంగా బయటపడ్డానని, ఎందుకంటే దాంట్లో అన్నీ సేఫ్టీ ఫీచర్స్ ఉన్నట్లు చెప్పారు.

శ్రీలంక ప్రధాని పీఠంపై చాలా ఏళ్లకు మళ్లీ మహిళ

● నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం

కొలంబో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : శ్రీలంక ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. మంగళవారం ఆమె నూతన ప్రధానిగా ప్రమాణస్వీకారం చేశారు. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత శ్రీలంకలో ప్రధాని పదవి చేపట్టిన మరో మహిళ హరిణి. 54 ఏళ్ల హరిణి అమరసూర్యతో ఆ దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే మరో ఇద్దరు నేతలను క్యాబినెట్ మంత్రులుగా నియమించారు.

దాంతో శ్రీలంకలో దిసనాయకేతోపాటు మొత్తం నలుగురితో కూడిన క్యాబినెట్ కొలువుదీరింది. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన హరిణికి న్యాయ, విద్య, కార్మిక, పరిశ్రమలు, శాస్త్ర సాంకేతిక, ఆరోగ్యం, పెట్టుబడులు లాంటి కీలక శాఖలను కేటాయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి నిన్న రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

శ్రీలంకలో హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి ఆ దేశ మూడో మహిళా ప్రధానిగా చరిత్ర లిఖించారు. ఎన్‌పీపీకి చెందిన ఎంపీలు విజిత హెరాత్, లక్ష్మణ్ నిపుణ రచిచి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో దిసనాయకే సంచలన విజయం సాధించి శ్రీలంక నూతన అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. ప్రస్తుత పార్లమెంట్‌ను రెండు రోజుల్లో రద్దు చేస్తామని దిసనాయకే సోమవారం వెల్లడించారు. శ్రీలంకలో పార్లమెంట్ ముందస్తు ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశం ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25.09.2024

మున్సిపల్ కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి.

ఆర్మూర్(జనంసాక్షి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్క మున్సిపల్ కార్మికుడు తమ ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వినయ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్మికులతో కలిసి వినయ్ రెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపల్ సిబ్బంది ఆరోగ్యం బాగుంటేనే వారి పనితీరు సక్రమంగా నిర్వహిస్తారని వారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వన్నెల్ దేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, కమిషనర్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా, మాజి మున్సిపల్ చైర్మన్ పండిత్ పవన్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ సరెండర్..

ఇంచార్జ్ కమిషనర్‌గా సూపర్డెంట్‌కు బాధ్యతలు

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

మంథని, (జనంసాక్షి) : పెద్దపెల్లి జిల్లా మంథని పురపాలక కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామిని సీడీఎంఏ కార్యాలయానికి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ సరెండర్ చేశారు. ఇటీవల కాలంలో మంథనిలో గత కొంతకాలంగా జరుగుతున్న రాజకీయ, నాటకీయ పరిణామాల నేపథ్యంలో కమిషనర్ పై పాలకవర్గం సభ్యులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తుంది. కమిషనర్ ఒంటెద్దు పోకడలపై పాలకవర్గ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా.. కలెక్టర్ చర్యలు చేపట్టినట్లు తెలిసింది. ఇది ఇలా ఉంటే మంథని మున్సిపల్ కార్యాలయంలో సూపర్డెంట్ గా పనిచేస్తున్న మనోహర్ ను ఇన్చార్జి కమిషనర్ గా నియమిస్తూ కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఉత్తర్వులు జారీ చేశారు.

లాభాలవాటాపై ప్రభుత్వ వ్యతిరేక వైఖరి

టీబిజికెఎస్ ఆధ్వర్యంలో నిరసన

గోదావరిఖని, జనంసాక్షి:
సింగరేణి లాభాల వాటాపై రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక వైఖరికి నిరసనగా ఆర్ జీ.1 ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేయడం జరిగింది. టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కొమురయ్య, అధికార ప్రతినిధి రవి, జాయింట్ సెక్రటరీ సతీష్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రావు, రాజేశం, శ్రీనివాస్, జోసెఫ్, శేషగిరి, బొగ్గుల సాయి, లక్ష్మణ్, ఉప్పులేటి తిరు పతి, వెంకట్ రెడ్డి, మల్లేష్, అంజన్న, రహమాన్, రవి, సంపత్, శ్రీనివాస్, అభిషేక్, రాజు, మహేష్, ప్రసాద్, సత్యనారాయణ, సుధాకర్, రాములు, వెంకట్ స్వామి, కుమార్, కళాధర్ రెడ్డి, శ్రావణ్ కిరణ్ గోపి రాములు పాల్గొన్నారు.

ఇంజినీర్లు కావలెను

పంచాయతీరాజ్ శాఖలో వెక్కిరిస్తున్న ఖాళీల కొరత

- **జిల్లాలో 53 మందికి 13 మంది విధుల నిర్వహణ**
- **ఒక్కో అధికారికి మూడు మండలాల ఇంచార్జీల బాధ్యత**



కామారెడ్డిబ్యూరో(జనంసాక్షి): ప్రభుత్వం చేపట్టే డెవలఫ్‌మెంట్ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ రాజ్ శాఖలో ఇంజనీర్ల కొరత వేదిస్తుంది. కామారెడ్డి జిల్లాలో 53 మంది ఉండాల్సిన ఇంజనీర్లు కేవలం 13 మందితోనే నెట్టుకొస్తున్నారు. ఒక్కొ అధికారికి రెండు, మూడు మండలాలకు ఇంచార్జీగా వ్యవహరిస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో చేపడుతున్న ప్రగతి పనులపై పర్యవేక్షణ లోపిస్తుంది. ఫలితంగా డెవలఫ్‌మెంట్ పనులు మందకొడిగా జరుగుతున్నాయి. పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం సబ్ డివిజన్‌లను పెంచినప్పటికి అవసరమైన అధికారులను నియామించకపోవడంతో ఆ శాఖ వ్యవహరాలు పూర్తిగా గాడి తప్పుతున్నాయనే అభిప్రాయం వస్తుంది. త్వరలో డివిజన్ల వారిగా ఇంజనీరింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని పలువురు కొరుతున్నారు. జిల్లాలోని రెండు డివిజన్లలో ఖాళీలను అనుగుణంగా కేటాయింపులు తెవాల్సి ఉంది. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు శాఖకు చెందిన అధికారులు ఉన్నతాధికారుల తెలుపాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో ఖాళీలు:

జిల్లా వ్యాప్తంగా మొత్తం 53 మంది ఇంజనీరింగ్ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 13 మంది మాత్రమే ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీలలో జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఇంజనీర్లకు స్థానచలనం కదిలింది. వారి స్తానాల్లో ఇతరులను ఇంకా కేటాయించలేదు. జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ డివిజన్లు ఉన్నాయి. ఒక డివిజన్ పరిధిలో నాలుగేసి సబ్ డివిజన్లు ఉన్నాయి. ఈ సబ్ డివిజన్లకు డిఈలు ఉన్నప్పటికి కామారెడ్డి ఈఈ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆర్మూర్ డిఈకి ఇంచార్జీగా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లకు కార్యాలయంతో పాటు మూడు నుంచి 4 మండలాలకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు ఏ మండలానికి వెళ్లలేక కార్యాలయానికే పరిమితమవుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం రెండు పడక గదుల సర్వే, ఇతర పనులను పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించింది. దీంతో వారు శాఖపరమైన పనులు పక్కన పెడుతున్నారు. పురపాలక సంఘాల్లో చేపడుతున్న ప్రగతి పనుల పర్యవేక్షణ బాధ్యతలను సైతం పీఆర్ ఇంజనీర్లకే అప్పగిస్తుండటం మరింత ఇబ్బంది కారంగా మారింది. నిబంధనల ప్రకారం మున్సిపల్ శాఖకు చెందిన ఇంజనీర్ల ఆధ్వర్యంలోనే బల్దియా పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు విరుద్ధంగా జిల్లా లోని మూడు మున్సిపాలిటీలు, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపల్‌లో పిఆర్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించడంతో పాటు యంబిలు తయారు చేయడం, బిల్లులు చేయడం జరుగుతుంది. కామారెడ్డి డివిజన్‌లో 24 మంది ఇంజనీర్ల పోస్టులు మంజూరు కాగా కేవలం 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 16 ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. బాన్సువాడ డివిజన్‌లో 29 ఇంజనీరింగ్ పోస్టులు ఖాళీగా కాగా కేవలం 5 గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్రభుత్వానికి నివేదించాం:

– బావన్న, ఇంచార్జి ఈఈ పిఆర్, కామారెడ్డి:

జిల్లాలో ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పోస్టుల ఖాళీలను ప్రభుత్వానికి నివేదించాం. త్వరలోనే ఇంజనీర్లను కేటాయించే అవకాశం ఉందన్నారు. ఖాళీలు భర్తీ చేస్తామన్నారు. ప్రగతి పనులను ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించి పనులు చేస్తున్నామన్నారు.

మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి

స్వచ్ఛతా హి సేవా వారోత్సవాల్లో మేయర్ సునీల్ రావు

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) కరీంనగర్ నగరపాలక సంస్థ లోని మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని కార్మికులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని నగర మేయర్ సునీల్ రావు అన్నారు. స్వచ్ఛతా హి సేవా వారోత్సవాల్లో భాగంగా సఫాయి మిత్ర సురక్ష శివార్ కింద కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి మేయర్, కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లు ఆరోగ్య కార్డులు, బీమా పత్రాలు, రక్షణ సామగ్రి అందించారు. మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ... నగరపాలక సంస్థ తరఫున మున్సిపల్ కార్మికులకు బీమా ప్రీమియం చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సుమారు రూ. 4,80,000 కేటాయించామన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల్లో ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... పారిశుద్ధ్య కార్మికులు పనులకు వచ్చేటప్పుడు హెల్త్ కార్డులు వెంట తెచ్చుకోవాలని ప్రతి మంగళవారం, గురువారం ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కార్మికులకు సూచించారు. రోడ్లపై చెత్త వేయవద్దని తడి , పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని ఇంటి యజమానులకు చెప్పాలన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... కోవిడ్ కాలంలో పారిశుద్ధ్య కార్మికులు ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. కంటి పరీక్షతోపాటు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

ప్రాజెక్టు డిజైన్లు, డ్రాయింగ్‌లు తయారు చేసిందెవరు?

గ్యారెంటీలను ఏజెన్సీలకు ఇచ్చే ముందు అండర్ టేకింగ్ ఏజెన్సీల నుంచి ఏమైనా తీసుకున్నారా అని కమిషన్ ఇంజినీర్లను ప్రశ్నించింది. ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన సమావేశం మినిట్స్ అనుసరించకుండానే విడుదల చేసినట్టు వారు తెలిపారు. ఆనకట్టల వద్ద డ్యామేజ్‌కు గల కారణాలను కమిషన్ అడిగి తెలుసుకుంది. అనుకున్నదానికంటే ఎక్కువ వరద రావడం వల్లే సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్టు ఇంజినీర్లు తెలిపారు. 2022 జులైలో వచ్చిన భారీ వరదల కారణంగా సీసీ బ్లాక్‌లు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. డ్యామేజి జరిగిన వెంటనే ఏజెన్సీలకు లేఖలు రాసినట్లు కమిషన్‌కు వివరించారు. డిజైన్లు, డ్రాయింగ్‌లు ఎవరు తయారు చేశారని కమిషన్ ఛైర్మన్ పీసీ ఘోష్ ప్రశ్నించగా.. వ్యాప్కోస్ సంస్థ తయారు చేసిందని సమాధానమిచ్చారు. సీడీఓ సీఈ అనుమతితో అమలు చేసినట్టు తెలిపారు. నిర్మాణానికి ముందు సైట్లలో ఏమైనా పరీక్షలు నిర్వహించారా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఎన్ఐటీ వరంగల్ ఆధ్వర్యంలో పరీక్షలు జరిగినట్టు ఇంజినీర్లు వివరించారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

శ్రీలక్ష్మిహోమ్స్ కాలనీని సందర్శించిన సుడా చైర్మన్

మురికి కాలువ సమస్యను కోమటిరెడ్డి నరేందర్ రెడ్డికి వివరించిన కాలనీ వాసులు

త్వరితగతిన సమస్య పరిష్కరించాలని వినతి

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి):
మల్కాపూర్ గ్రామంలోని శ్రీలక్ష్మీ హోమ్స్ కాలనిలోని నూట ఇరవై ఇండ్లకు మురికి కాలువ సమస్య ఉందని వరద నీళ్ళు బయటకు వెళ్లక ఇబ్బందులు పడుతున్నామని సుడా చైర్మన్ ను సుడా కార్యాలయంలో కలిసి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం రోజు ఉదయం సుడా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. మల్కాపూర్ మెయిన్ రోడ్డులో మురికి కాలువలు లేకపోవడం వల్ల నీళ్ళు ఎక్కడికక్కడ నిలిచి పోతున్నాయని ఆ సమస్య పరిష్కరిస్తే మిగితా సమస్యలు పరిష్కారమవుతాయని సాధ్యమైనంత తొందరలో సమస్యలు పరిష్కరిస్తామని నరేందర్ రెడ్డి కాలని వాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుడా డిఈ రాజేంద్రప్రసాద్, ఏఈ రమేష్ , మల్కాపూర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, కాలనీ వాసులు బుర్ర శరత్ కుమార్, వాసంతి, శ్రీలత జితేందర్, రామకృష్ణ ,అనిల్ శ్రీనివాస్, శరత్ కుమార్, కాంతా రావు, ఊరడి లత, హస్తపురం తిరుమల, రజిత రెడ్డి, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అల్వాల భరత్, లింగంపల్లి లక్ష్మణ్, మల్లికార్జున్, పాల్గొన్నారు.

సారూ.. ఆదుకోరూ..!

- **కన్నతండ్రిని పట్టించుకోని కుమారులు**
- **విలువలు నశించిపోతున్న సమాజం**
- **అధికారులు ఆదుకోవాలని వృద్ధుడి వినతి**

శంకరపట్నం(జనంసాక్షి): కన్న కొడుకులు పట్టించుకోక గుడిసెలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న వృద్ధుడి కన్నీటిగాథ! వివరాల్లోకి వెళితే...కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన ఓ వృద్ధుని ఆవేదన వర్ణనాతీతం. వివరాల్లోకి వెళితే శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన బత్తిని రాజ మౌళికి(78) ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వారి అందరికీ వివాహాలు జరిపించాడు. ఆస్తులన్నీ వారికి అప్పగించాడు. విధి వక్రీకరించడంతో తన భార్య ప్రమీల ఐదు సంవత్సరాల క్రితం మరణించిందని దీనితో అప్పటినుండి తనకు కష్టాలు మొదలయ్యాయని కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తెలిపాడు. అప్పటినుండి తన జీవితం దుర్భరంగా మారిపోయిందని, ఇద్దరూ కొడుకులలో ఏ ఒక్క కొడుకు తనను పట్టించుకోవడం లేదని లక్షలాది రూపాయల ఆస్తులను సంపాదించిన తనకు బుక్కెడు బువ్వ పెట్టే వాళ్ళు కరువయ్యారని వాపోయాడు. అంతేకాకుండా తనకున్న పది గుంటలలో మూడున్నర గంటలు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ కింద పోయిందని కనీసం అట్టి డబ్బులతోనైనా తన జీవనాన్ని గడుపుకుందామంటే అధికారులతో కలసి తనకు రావాల్సిన డబ్బులు రాకుండా తన కుమారుడు బత్తిని నరేష్ తనని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపాడు. భూసేకరణ జరిగి దాదాపు మూడు సంవత్సరాలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ నేటి కూడా తనకు డబ్బులు ఇవ్వకుండా నా కొడుకులు చెబితే అధికారులు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వృద్ధుడు ఆందోళన వ్యక్తం చేశాడు. కొడుకులు బువ్వ పెట్టరు వచ్చే డబ్బులు రానివ్వరు మరి నేను ఎలా బతికేది ఇక నాకు చావే శరణ్యం అని తనకున్న మిగతా, పొలంలోనే పరదలు, చీరలతో చిన్న గుడిసె నిర్మించుకొని దానిలో జీవిస్తున్నాడు. గుడిసెలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భూమి డబ్బులు తనకు ఇప్పించాలని తన తదనంతరము తన ఆస్తి తన పిల్లలకే చెందుతుందని అప్పటివరకు తన జోలికి తన ఆస్తి జోలికి కుమారులు అడ్డు రాకుండా అధికారులు చొరవ చూపాలని ఆ వృద్ధుడు వేడుకుంటున్నాడు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

స్వచ్ఛత సేవా పక్షోత్సవాల్లో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): స్వచ్ఛత సేవా పక్షోత్సవాలలో విస్తృతంగా పాల్గొని పరిసరాలు పరిశుభ్రత, మొక్కల నాటి సంరక్షించడం చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం రాజంపేట మండల కేంద్రంలో జరిగిన పలు కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత సేవా హీ కార్యక్రమం క్రింద పల్లె ప్రకృతి వనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కస్తూర్బా బాలికల విద్యాలయం.లలో కలెక్టర్ మొక్కలు నాటారు. స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా కే.జి.బి.వి. లో విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను కలెక్టర్ తిలకించి విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేసారు. కలెక్టర్ మాటాడుతూ ప్రభుత్వం విద్యకోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం కిచెన్ గదులను తనిఖీ చేశారు. అనంతరం కే.జి.బి.వి. ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అం దించాలని, ఓ. పి. సేవలు విస్తృత పరచాలని అన్నారు. ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. పద్మ, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. చంద్ర శేఖర్, తహసీల్దార్ అనిల్ కుమార్, మండల విద్య అధికారి రామ స్వామి, కే.జి.బి.వి. అధ్యాపకులు, విద్యార్థులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన సిఎంఆర్ బియ్యం సరఫరా చేయాలి

సి.ఏం.ఆర్. బియ్యం త్వరితగతిన సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం రాజంపేటలోని శంకధార రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడుతూ, రైసెమిల్లు కు కేటాయించిన వరి ధాన్యం ను తొందరగా సి.ఏం.ఆర్. సరఫరా చేయాలని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్, రాజంపేట తహసీల్దార్ అనిల్ కుమార్, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఉన్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లలకు ఆరోగ్యం

పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు

నిజాంసాగర్ సెప్టెంబర్ 24(జనం సాక్షి) మహ్మద్ నగర్ మండల కేంద్రం లో మంగళవారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమంలోజుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్యఅతిథిగా హాజరై గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక ఆహార పదార్థాలను సమయానికి అందజేయాలని అంగన్వాడీ టీచర్లకు మరియు హెల్త్ వర్కర్లకు సూచించారు. పోషకార లోపాలను అదిగమించడానికి అంగన్వాడీ వర్కర్లు మహిళలలో అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా అంగన్వాడీ సెంటర్లలో సిబ్బంది కొరత , మౌలిక సదుపాయల సమస్యలు గురించి తన దృష్టికి వచ్చిందని..త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండల వైద్య అధికారి రోహిత్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడి సిబ్బంది పిల్లలకు అందించే పౌష్టికాహారం వల్ల పిల్లలు దృఢంగా మారుతారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహారం మరియు పోషకాహార లోపాలపై అవగహన కల్పించారు. పౌష్టిక ఆహారం లోపం వల్ల రక్త హీనత, జనన బరువు తగ్గుదల మొదలగు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయని చెప్పారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. పుట్టిన బిడ్డకు గంట లోపు ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే బిడ్డకు ఆహారంగా ఇవ్వాలని, తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ ఎదుగు దలకు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఉమ్మడి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్, రవీందర్ రెడ్డి మాజీ, జెడ్పిటిసి జయ ప్రదీప్, ప్రజా పండరి, ఆకాష్, మండల వైద్యాధికారి రోహిత్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాడుతాం

- **అందుకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు సిద్ధం**
- **బాధిత కుటుంబాలకు అండగా ఉంటా**
- **హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి**

జమ్మికుంట(జనంసాక్షి): హుజురాబాద్ నియోజకవర్గం లోని ప్రజలకు ఎలాంటి ఆపద ఎదురైన వారి సమస్యల కోసం ఏ పోరాటైనకైనా బీఆర్ఎస్ పార్టీతోపాటు తాను కూడా సిద్ధంగా ఉంటానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట అర్బన్, జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలలో వివిధ కారణాలు వల్ల అనారోగ్యంతో చికిత్స పొందిన బాదిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా బాధితులకు కొంత ఆర్థిక భరోసాగా ఉంటుందని బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యేగా తాను ఎప్పుడు అండగా ఉంటానని అన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎవరైనా ఎలాంటి రోగానికైనా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స అందించేలా ప్రభుత్వం మార్పులు చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలంతా ఎల్లప్పుడు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి స్వయంగా గడపగడపకు తిరుగుతూ చెక్కులు పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న సమయంలో హఠాత్తుగా వర్షం మొదలైంది. జోరుగా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్క చేయకుండా ప్రజలకు చెక్కులు పంపిణీ చేయాలనే దృఢ సంకల్పంతో వర్షంలోనే ఇంటింటికి తిరిగి చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం చెక్కుల విలువ జమ్మికుంట అర్బన్ లో 43 కుటుంబాలకు గాను.12,26,500 రూపాయలు , జమ్మికుంట రూరల్ లో 45 కుటుంబాలకు 10 లక్షల 70000 రూపాయల విలువైన చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, పిఏసిఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, జమ్మికుంట బిఆర్ఎస్ పార్టీ అర్బన్ ప్రెసిడెంట్ టంగుటూరి రాజ్ కుమార్, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు , మాజీ ఎంపిటిసిలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో ఉత్తమ సేవలు

- **రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్‌స్టేషన్ ఎంపిక**
- **రామగుండం కమిషనరేట్‌కు మూడు, గోదావరిఖనికి నాల్గవ స్థానం..**

గోదావరిఖని/పెద్దపల్లి (జనంసాక్షి) : రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలు అందించిన 10 పోలీస్ స్టేషన్‌లు ఎంపిక చేయగా అందులో మూడవ, ఐదవ స్థానం పొందిన రామగుండం పోలీస్ కమిషనరేట్‌లు దక్కించుకున్నాయి. రామగుండం పోలీస్ కమిషనరేట్ గోదావరఖని(1) టౌన్ పోలీస్ స్టేషన్ లో రిసెప్షన్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ వెంకట లక్ష్మి పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితుల తో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యను తెలుసుకొని పోలీస్ సమస్య చట్ట పరిధిలో సమస్య పరిష్కారం చేస్తారనే నమ్మకం, భరోసా కల్పించి సంబంధిత అధికారి కి వారిని కల్పించి మరి వారి పిటిషన్ ఆన్లైన్ చేసి వారికి రిసిప్ట్ ఇవ్వడం జరుగుతుంది దానిలో భాగంగా ఉత్తమ సేవలు అధించినందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా పిటిషన్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఐదు పోలీస్ స్టేషన్ లను ఎంపిక చేయగా అందులో నాలుగవ స్థానం పొందడం జరిగింది. అదేవిధంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ బెల్లంపల్లి 1 టౌన్ ఇన్స్పెక్టర్ దేవయ్య మరియు పెద్దపల్లి జోన్ ధర్మారం ఎస్ఐ శీలం లక్ష్మణ్ మరియు వారి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏదైనా సమస్యలతో పోలీస్ స్టేషన్ లకు వచ్చిన బాధితులతో మర్యాదగా ప్రవర్తించి వారి సమస్యలను విని చట్టపరిధిలో పరిస్కారించడం, వారికి పోలీస్ ఎల్లప్పుడూ ఉంటుందని నమ్మకం కలిగేలా చేయడం వలన ప్రజల ఆన్లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలు అందించడం లో 10 పోలీస్ స్టేషన్ లను ఎంపిక చేయగా బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ మూడవ స్థానం మరియు ధర్మారం పోలీస్ స్టేషన్ ఐదవ స్థానం పొందడం జరిగింది. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు సిబ్బందిని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజీ అభినందనలు శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

19 ఏండ్ల బాక్సర్ బ్రెయిన్ డెడ్

బాక్సింగ్‌నే కెరీర్‌గా, ప్రాణంగా భావించిన ఓ యువకుడి జీవితం విషాదంగా ముగిసింది. ఎన్నో ఆశలతో బాక్సింగ్ రింగ్‌లో అడుగుపెట్టిన అతడికి అదే ఆఖరి రోజు అయింది. ప్రత్యర్థులపై పంచ్‌లు కురిపించే క్రమంలో అతడు ఆ రింగ్‌లోనే కుప్పకూలాడు. అనంతరం ఆ బాక్సర్‌ను పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ డెడ్ అయినట్టు చెప్పారు. ఈ హృదయవిదారక ఘటన మన గుజరాత్‌లోనే జరిగింది.

అసలేం జరిగిందంటే.. 19 ఏండ్ల బాక్సర్ కరన్ పిపలియా గుజరాత్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొన్నాడు. పురుషుల 63కిలోల విభాగంలో పోటీ పడిన కరన్‌కు ఏమైందో తెలియదు ఉన్నట్టుండి రింగ్‌లనే కుప్పకూలాడు. దాంతో, కంగారు పడిన రిఫరీలు, నిర్వాహకులు మ్యాచ్‌ను ఆపేశారు. వెంటనే కరన్‌ను దవాఖానకు తరలించారు. అక్కడ అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే బ్రెయిన్ డెడ్ అయ్యాడని చెప్పారు.

కరన్ రింగ్‌లోనే కుప్పకూల డానికి కారణంగా మెదడుకు సంబంధించిన హీమోర్రేజ్ అనే సమస్య. దాంతో, ఓ ప్రైవేట్ దవాఖాన వైద్యులు అతడికి సర్జరీ కూడా చేశారు. అనంతరం సూరత్‌లోని సిమ్స్ అనే ఆస్పత్రికి తరలించారు. అయితే.. అప్పటికే కరన్ బ్రెయిన్ డెడ్ అయినట్టు డాక్టర్లు గుర్తించారు. ప్రస్తుతం అతడిని లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్ మీద పెట్టారు. తమ కొడుకు బతుకుతాడనే నమ్మకంతో అతడి తల్లిదండ్రులు కండ్లలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు.

నిర్ణేతలుగా అతివలే

ఈసారి మహిళల టీ20 వరల్డ్ కప్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి సరికొత్తగా నిర్వహించనుంది. అందులో భాగంగానే గత సీజన్లకు భిన్నంగా పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. మరో 9 రోజుల్లో యునెటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా క్రీడా పండుగ ఆరంభం కానుంది. ఇప్పటికే అధికారిక పాటను విడుదల చేసిన ఐసీసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళల వరల్డ్ కప్‌ను మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నందున ఆడవాళ్లనే అంపైర్లుగా ఎంపిక చేసింది. మెగా టోర్నీ మ్యాచ్‌ల బాధ్యతలను పూర్తిగా మహిళలకే అప్పగిస్తూ మంగళశారం ఐసీసీ సంచలన ప్రకటన చేసింది. పొట్టి వరల్డ్ కప్ కోసం ఐసీసీ 10మందితో కూడిన మహిళా అంపైర్లను ఎంపిక చేసింది.

మ్యాచ్ రిఫరీగా లక్ష్మీ

ముగ్గురు మ్యాచ్ రిఫరీలుగా కూడా ఆడవాళ్లనే తీసుకుంది. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనున్న వాళ్లలో క్లెయిర్ పొలొసాక్ అందరికంటే అనుభవజ్ఞురాలు. మరో విశేషం ఏంటంటే.. భారత్‌కు చెందిన జీఎస్ లక్ష్మీ మ్యాచ్ రిఫరీగా అవకాశం దక్కించుకుంది.

ఆస్ట్రేలియాకు చెందిన ఆమె గతంలో నాలుగు వరల్డ్ కప్ పోటీలకు అంపైర్‌గా వ్యవహరించారు. గత వరల్డ్ కప్‌లో టీవీ అంపైర్‌గా పనిచేసిన సూ రెడ్‌ఫెర్న్ మరోసారి అదే పాత్ర పోషించనుంది. ఇక.. జింబాబ్వేకు చెందిన సారాహ్ దంబనవన తొలిసారి మహిళల టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లకు అంపైరింగ్ చేయనుంది.



వరల్డ్ కప్ అంపైర్లు : రెన్ అగెన్‌బ్యాగ్, కిమ్ కాటన్, సారాహ్ దంబనవన, అన్నా హ్యారీస్, నిమలి పెరీరా, క్లెయిర్ పొలొసాక్, వ్రిందా రథీ, సూ రెడ్‌ఫెర్న్, ఎలోసీ షెరిడాన్, జాక్విలిన్ విలియమ్స్.

మ్యాచ్ రిఫరీలు : శాంద్రే ఫ్రిట్జ్, జీఎస్ లక్ష్మి, మిచెల్ పెరీరా.

ఇప్పుడే వీడ్కోలు పలకొద్దు : కపిల్

భారత జట్టుకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు గత పదేండ్లుకు పైగా సేవలందిస్తున్నారు. కెప్టెన్‌గా, ఆటగాడిగా తమదైన ముద్ర వేస్తూ జట్టు విజయాల్లో భాగమవుతున్నారు. టీమిండియాకు కుడి, ఎడమ భుజాలుగా నిలుస్తున్న ఈ ఇద్దరి కెరీర్ దగ్గర పడింది. టీ20 వరల్డ్ కప్ తర్వాత పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. కొత్తతరం దూసుకొస్తుండడంతో వన్డే, టెస్టులకు కూడా ఈ దిగ్గజ ఆటగాళ్లు త్వరలోనే గుడ్ బై చెప్పేసే అవకాశముంది. ఈ నేపథ్యంలో వరల్డ్ కప్ హీరో కపిల్ దేవ్ 'రోకో' భవితవ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'రోహిత్, కోహ్లీలు ఎప్పటివరకైతే ఫిట్‌గా ఉంటారో అప్పటివరకూ ఆడాలి. ఆటను ఆస్వాదిస్తున్నంత కాలం ఇద్దరూ క్రికెట్‌ను వీడొద్దు. రవి శాస్త్రి చిన్న వయసులోనే ఆటకు అల్విదా చెప్పాడు. అయితే.. సచిన్ టెండూల్కర్ సుదీర్ఘ కెరీర్‌ను ఎంజాయ్ చేశాడు. అయితే.. ఇప్పుడు రిటైర్మెంట్ అనేది వ్యక్తిగత నిర్ణయం అయింది. నా దృష్టిలో మాత్రం ఆటగాళ్లు ఫిట్‌గా ఉన్నంత కాలం ఆడొచ్చు' అని కపిల్ అభిప్రాయపడ్డాడు.

అంతేకాదు 26 ఏండ్ల నుంచి 34 ఏండ్ల మధ్య ప్రతి క్రికెటర్ అత్యద్భుతంగా సాగుతుంది. ఆ తర్వాత ఫిట్‌నెస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఎక్కువ రోజులు ఆడాలంటే ఫిట్‌గా ఉండడం తప్పనిసరి' అని కపిల్ వెల్లడించాడు. ప్రస్తుతం కోహ్లీకి 35 ఏండ్లుకాగా కెప్టెన్ హిట్‌మ్యాన్‌కు 37 ఏండ్లు. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో బోర్డర్ – వాస్కర్ ట్రోఫీ.. ఆపై ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, చాంపియన్స్ ట్రోఫీ విజయంపై ఈ ఇద్దరూ కన్నేశారు. రోహిత్, కోహ్లీలు ఇంకో మూడేండ్లు ఫిట్‌గా ఉంటే వన్డే వరల్డ్ కప్ ఆడే అవకాశముంది.

బరువు పెరగడం ఆమె తప్పే

దాన్ని కుట్రగా పేర్కొనడం సరికాదు.. వినేశ్‌పై యోగేశ్వర్ దత్ మండిపాటు

స్టార్ రెజ్లర్, కాంగ్రెస్ నేత వినేశ్ ఫొగాట్‌పై బీజేపీ నేత, రెజ్లర్ యోగేశ్వర్ దత్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఒలింపిక్స్‌లో బరువు పెరగడం ఆమె తప్పేనన్నారు. ఒక్క గ్రాము బరువు పెరిగినా అనర్హత వేటు పడుతుందని ఆమెకు తెలియదా..? అని ప్రశ్నించారు. దీన్ని కుట్రగా పేర్కొనడం సరికాదన్నారు. ఈ విషయంలో దేశ ప్రజలకు వినేశ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె స్థానంలో తాను ఉండి ఉంటే ఈపాటికి ఎప్పుడో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పేవాడినని అన్నారు. పంచాయత్ ఆజ్‌తక్ హర్యానా 2024 ఈవెంట్‌లో యోగేశ్వర్ మాట్లాడుతూ.. 'పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువు కారణంగా వినేశ్ ఫొగాట్‌పై అనర్హత వేటు పడింది. ఇందుకు దేశ ప్రజలకు వినేశ్ క్షమాపణలు చెప్పాలి. అలా కాకుండా ఈ ఘటనను ఆమె కుట్రగా అభివర్ణించారు. తన అనర్హత గురించి వినేశ్ కుట్ర సిద్ధాంతాలను వ్యాప్తి చేయడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కూడా నిందించారు. ఒలింపిక్స్‌లో బరువు పెరగడం ఆమె తప్పే. దీన్ని కుట్రగా పేర్కొనడం సరికాదు. ఒలింపిక్స్‌లో ఒక గ్రాము బరువు పెరిగినా అనర్హత వేటు పడుతుందని ఆమెకు తెలియదా..? ఆమె స్థానంలో నేను ఉండి ఉంటే ఈపాటికి ఎప్పుడో దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పేవాడిని. ఈ విషయంలో దేశ ప్రజలను వినేశ్ తప్పుదోవ పట్టించారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ప్రవర్తించారు' అని వినేశ్‌పై యోగేశ్వర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

భారత అమ్మాయిల బ్యాండ్

మహిళల టీ20 వరల్డ్ కప్ పోటీలకు ముందే ఐసీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. పురుషుల విభాగం మాదిరిగానే టోర్నీ విజేతలకు సమాన ప్రైజ్‌మనీ ఇస్తామని ప్రకటించింది. అంతేకాదు వరల్డ్ కప్ ప్రచారం కోసం అధికారిక పాటను కూడా విడుదల చేసింది. 'వాటెవర్ ఇట్ టేక్స్' అనే టైటిల్‌తో కూడిన ఈ పాట ఏదైనా చేసేద్దాం అనే అర్థంలో సాగుతుంది. ఈ పాటలో భారత అమ్మాయిలకు చెందిన విష్ బ్యాండ్ డ్యాన్స్ స్టెప్పులతో అలరించింది. అక్టోబర్ 3న యూఏఈ వేదికగా వరల్డ్ కప్ మొదలవ్వనుంది.

'పంత్ దూకుడుకు కళ్లెం వేస్తాం'

చెపాక్ స్టేడియంలో మెరుపు శతకం బాదిన రిషభ్ పంత్ ఆస్ట్రేలియా జట్టుకు హెచ్చరికలు పంపాడు. కారు యాక్సిడెంట్ అనంతరం తొలి టెస్టులోనే సెంచరీతో అదరగొట్టిన పంత్.. 'నేను మళ్లీ వస్తున్నా. కాచుకోండి' అంటూ కంగారూలకు సవాల్ విసిరాడు. బోర్డర్ – గవాస్కర్ ట్రోఫీకి ముందు డాషింగ్ బ్యాటర్ ఈ తరహాలో రెచ్చిపోవడం టీమిండియాకు శుభపరిణామం అంటున్నారు విశ్లేషకలు. దాంతో, ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ సైతం బోర్డర్ గవాస్కర్ ట్రోఫీపై స్పందించాడు.

ఈసారి పంత్‌ను నిశబ్దంగా ఉంచుతామని, అతడికి ఏ అవకాశం ఇవ్వమని కమిన్స్ అన్నాడు. 'మ్యాచ్‌ను మలుపుతిప్పగల ఆటగాళ్లు ప్రతి జట్టులో ఒకరో ఇద్దరు ఉంటారు. మా టీమ్‌లో ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్‌లు దూకుడుగా ఆడి మ్యాచ్‌ను లాగేసుకుంటారు. రిషభ్ పంత్ కూడా అలాంటి ప్లేయర్. అతడు ఆడే రివర్స్ స్లాప్ షాట్ చాలా ప్రత్యేకం. అతడు ఈ మధ్యగ గతరెండు సిరీస్‌లలో చాలా ప్రభావం చూపాడు. అయితే.. ఈసారి మేము అతడిని నిశబ్దంగా మారుస్తాం. అతడి దూకుడుకు కళ్లెం వేస్తాం' అని కమిన్స్ తెలిపాడు.

నేడు బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం..!

బీసీసీఐ కొత్త కార్యదర్శిపై చర్చ ఉంటుందా..?

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సమావేశం బుధవారం జరుగనున్నది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించనున్నారు. అపెక్స్ కౌన్సిల్ ఎజెండాలో జైషా స్థానంలో కొత్త కార్యదర్శి నియామకం అంశాన్ని చేర్చకపోవడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. బెంగళూరులో జరుగనున్న బోర్డు 93వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ముందు జరుగనున్న చివరి అపెక్స్ కౌన్సిల్ సమావేశం ఇదే. ఐసీసీ చైర్మన్‌గా జై షా ఎన్నికైన విషయం తెలిసిందే. ఈ ఏడాది డిసెంబర్ ఒకటిన ఆయన పదవి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎంజీఎంలో బీసీసీఐ కార్యదర్శిగా పూర్తిస్థాయి బాధ్యతల నుంచి జై షా బాధ్యతల నుంచి వైదొలగనప్పటికీ.. నామినేషన్ ప్రక్రియపై చర్చించే అంశాన్ని జెండాలో చర్చలేదు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ప్రధానంగా బైజూ కేస్ అప్‌డేట్‌పై చర్చించనున్నారు.

టీమిండియా మాజీ టైటిల్ స్పాన్సర్ బైజూతో బీసీసీఐకి వివాదం నడుస్తున్నది. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ఉన్నది. ఎడ్‌టెక్ సంస్థ గత ఏడాది మార్చిలో బీసీసీఐతో స్పాన్సర్‌షిప్ ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. బెంగళూరుకు చెందిన కంపెనీ మార్చి 2019లో మూడేళ్ల జెర్సీ స్పాన్సర్‌షిప్ ఒప్పందంపై బీసీసీఐతో ఒప్పందంపై సంతకాలు చేసింది. ఆ తర్వాత మరో ఏడాది పొడిగించింది. సెప్టెంబర్ 2022 వరకు చెల్లింపులు జరిగాయి.

అయితే, అక్టోబర్ 2022 నుంచి మార్చి 2023 వరకు బకాయిలపై వివాదం కొనసాగుతున్నది. అలాగే, బెంగళూరులో అత్యాధునిక వసతులతో నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ ప్రారంభోత్సవం అంశంపై సైతం చర్చించనున్నారు. ఎన్‌సీఏ ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం కాంప్లెక్స్‌లో కొనసాగుతున్నది. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయం, నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అంశంపై సైతం అపెక్స్ కౌన్సిల్‌లో బీసీసీఐ చర్చించనున్నది.

నిస్వార్థమే లక్షణం... సమాజసేవే లక్ష్యం

- ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం
- ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 24 (జనంసాక్షి) :

రంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం విభాగం వారు ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాలంటీర్లు స్వచ్ఛత హి సేవలో భాగంగా ప్లాస్టిక్ ని వినియోగించవద్దని, చెత్త–చెదారం మరియు వ్యర్థపదార్థాలను తొలగించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జెల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు గాను వారిని అభినందించి, ముందు ముందు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేసి దేశ సేవలో భాగమవ్వాలని తెలిపారు. విద్య ద్వారా సేవ అంటూ విద్యార్థుల్లో చదువు, విజ్ఞానంతో పాటు సమాజం పట్ల బాధ్యతను, సమస్యల పట్ల అవగాహనను పెంపొందిస్తూ విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వానికి, మంచి క్రమశిక్షణకి దారి చూపిస్తూ ప్రజా హృదయపథంలో పయనించే ఆ రథమే జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్. 1969 మహాత్మా గాంధీ జన్మ శతాబ్ది సందర్భంగా సెప్టెంబర్ 24న ఈ కార్య క్రమాన్ని ప్రారంభించారు. 55 ఏండ్లుగా ఎన్ఎస్ఎస్ తన సేవల్ని సమాజానికి అందిస్తూ వస్తుంది. విద్యార్థులను సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం చేస్తూ వారిలో సమగ్ర మూర్తిమత్వాన్ని,మంచిక్రమశిక్షణను పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా ఇది పని చేస్తున్నది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్ఎస్ఎస్ విభాగం ఎంతోమంది విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నది. తదానంతరం వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను గురించి ఫ్లాష్ మాబ్ మరియు లఘునాటిక రూపంలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్ర రెడ్డి, ఎ.ఇ.ఎల్ పి డైరెక్టర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు,ప్రొఫెసర్లు, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గేట్లు ఎత్తితే బిఆర్ఎస్‌లో ఎవ్వరు ఉండరు

- మాతో 26 మంది బి ఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారు
- మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనం సాక్షి):

కాంగ్రెస్ గేట్లు ఎత్తితే బిఆర్ఎస్‌లో ఎవ్వరు మిగలరు... మాతో 26 మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు... మెదక్ జిల్లాలోని నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి రాజిరెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. ఉద్యమకారులను వాడుకొని, బీఆర్ఎస్ నాయకులు నియంత పాలన సాగించడమే కాక హరీష్ రావు, కేటీఆర్ గతంలో లక్షల కోట్ల కుంభకోణం చేశారని, హరీష్ రావు, కేటీఆర్ 50 యూట్యూబ్ ఛానల్ ను మెయింటైన్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పదేళ్ల పాలనలో దోచుకు తిన్నారని నర్సాపూర్ లో పార్టీలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉంటారని, సిద్దిపేట రాజకీయాలపై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు. శివంపేట్ మండల పరిధిలోని గోమారం గ్రామంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడి అనేది ఇష్యూ కాదని, చిన్న సమస్యకు హరీష్ రావు రావాల్సిన అవసరం లేదు కానీ, హరీష్ రావు ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. పెద్ద స్థాయి లీడర్లు మంత్రులు ఎమ్మెల్యేలు మాట్లాడలేని స్థితికి కేసిఆర్ నియంత పాలనలో దిగజార్చాడని అంతేగాక హైదరాబాద్ ను ధ్వంసం చేసిందని, బీఆర్ఎస్ పార్టీ కాదా అని ఆడ్రస్ లేని వాళ్ళు తెలంగాణ సాధించామని చెప్పుకోవడం సిగ్గుచేటని నర్సాపూర్ ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలిచిన మదన్ రెడ్డి మరల ఎమ్మెల్యేగా నిలబడితే గెలిచేవాడని మదన్ రెడ్డి లాంటి వాళ్ళను ఎంతో

మందిని బొంద పెట్టారని ఆయన అన్నారు. వక్స్ బోర్డ్, అసైన్మెంట్ గవర్నమెంట్ భూములను బీఆర్ఎస్ ముఖ్య నాయకులు స్వాహా చేశారని భావబామ్మర్దులను టార్గెట్ చేయవలసిందిగా కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిస్తున్నాన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమతో టచ్లో ఉన్నారని, రెండు మంత్రి పదవులు ఇస్తే బీఆర్ఎస్ పార్టీ మొత్తం ఖాళీ అవుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తమతో పెట్టుకోవద్దని.. పెట్టుకుంటే మీ గోతి మీరు తవ్వుకుంట్లే అన్నారు. 10 సంవత్సరాలు వెంటాడే బీఆర్ఎస్ ఆదాచకాలను గమనించి అధికారంలోకి వచ్చామని హరీష్ రావు, కేటీఆర్ అరాచకాలను బయటకు తీసే టైం వచ్చిందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సిరెడ్డి, దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి శ్రీనివాస్ రెడ్డి, సిద్ధిపేట్ నియోజకవర్గ ఇన్చార్జి హరి కృష్ణ,రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి,సుహాసిని రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, మాజీ జడ్పీటిసి శ్రీనివాస్ గుప్త, మాజీ ఎంపిపిలు జ్యోతి సురేష్ నాయక్, నరేందర్ రెడ్డి,లలిత నర్సింగ్ నాయక్, ప్రముఖ సంఘ సేవా అవార్డు గ్రహీత బండారి గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు బ్లాక్ అధ్యక్షులు నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేట జిల్లాకు
ఆరుగురు ప్రొబిషనరీ ఎస్సైలు

జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి) : నారాయణపేట జిల్లా కు ఆరుగురు ప్రొబేషనరీ ఎస్సై లు వచ్చారని వారు మంగళవారం రిపోర్ట్ చేశారని జిల్లా ఎస్పి యోగేష్ గౌతం తెలిపారు. జోగులాంబ జోన్–7 డిఇజిఎల్ఎస్ చౌహాన్ నూతనంగా 12 నెలల శిక్షణ పొందిన 6గురు ప్రొబిషనరీ ఎస్ఐలను నారాయణపేట జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. సివిల్ సబ్ ఇన్స్పెక్టర్స్ ఏ మహేశ్వరి, టి రేవంత్, ఎం శివ శంకర్,జి.గాయత్రి ,రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్స్ ,బి. కృష్ణ చైతన్య ,ఎల్ శిరీష. లు ఈరోజు ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు..ఈ సందర్భంగా ఎస్పీ ట్రైనింగ్ ఎస్సైలకు శుభాకాంక్షలు తెలిపి వాళ్ల పేరు, చిరునామా, విద్య అర్హతలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మీరంతా ఇప్పటి నుండి జిల్లా పరిధిలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది అని అను నిత్యం ప్రజలతో మమేకమవుతు వారితో మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని వారి సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని పోలీస్ విధులు బాధ్యతయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లో పిసి నుండి ఏఎస్సై వరకు మరియు జిల్లా పరిధిలోని వివిధ విభాగాల్లో ఒక్కోనెల విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమయంలోనే గ్రేహౌండ్స్, ట్రాఫిక్, సాంకేతికత తదితర ట్రైనింగ్స్ కూడా ఉంటాయని తెలిపారు. ఎక్కడ ఎలాంటి తప్పులు చేయరాదూ అని పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పిలు ఎన్ లింగయ్య, మహేష్, ఆర్ఐ నరసింహ, సూపర్డెంట్ శంకర్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- కాంగ్రెస్ బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ కారును అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- పరిస్థితి ఉద్రుతం రంగంలోకి బిగిన పోలీసులు

వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 24(జనం సాక్షి):

తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కాంగ్రెస్ పార్టీపై బి.ఆర్.ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మర్పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ఆందోళనకు దిగారు. బి ఆర్ ఎస్ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. ఈ సంఘటన మంగళవారం నాడు చోటుచేసుకుంది. వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మర్పల్లి మండలం కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పై కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళనకు దిగారు. తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించదులేదని బి ఆర్ ఎస్ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గౌరవప్రదమైన పదవిలో ఉంటూ బిఆర్ఎస్ పార్టీ నాయకులపై వేధింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. అంతే కాకుండా అభివృద్ధిని మరిచిపోయి వేధింపులు ఏమిటని ప్రశ్నించారు. పదిమంది బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే

వారిపై చర్య తీసుకోవాలని హైకోర్టు ఆదేశించిన స్పీకర్ చర్య తీసుకోకపోవడం పట్ల విమర్శ చేశారు. వాటిని వదిలేసి టిఆర్ఎస్ పార్టీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అధికారులను బలవంత పెట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని వ్యాఖ్యానించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండిపడ్డారు. ఒక కేసు విచారణలో పట్లూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను మర్పల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారని దానితో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కు సంబంధం ఏమిటని వ్యాఖ్యానించారు. తమ నాయకుని కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బి ఆర్ఎస్ పార్టీ నాయకులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు వాద్వివాదానికి దిగారు మర్పల్లి పోలీస్ స్టేషన్ ముందు రెండు

వర్గాల వారు వాద్వివాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. గొడవ జరగకుండా పోలీసులు రెండు వర్గాల వారిని చెదర గొట్టారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరి పై మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడడానికి ప్రయత్నిస్తే కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కారును వెంబడించడంతో పరిస్థితి మరోసారి ఉద్రుతంగా మారింది పోలీసులు రంగ ప్రవేశం చేసి మాజీ ఎమ్మెల్యే వెతుకు ఆనంద్ మీడియా సమావేశం చేయనివ్వకుండా అక్కడ నుంచి పంపి వేశారు దీంతో గొడవ సర్దుమనిగింది పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 సెప్టెంబర్ 2024

ప్రభుత్వానికి పట్టభద్రులకు వారధిగా పని చేస్తా..

- నిరుద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తుతా
- ఎమ్మెల్సీ గా గెలిస్తే వచ్చే వేతనం నిరుపేదల సంక్షేమానికి వెచ్చిస్తా
- మెదక్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డా.వి నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 24 (జనంసాక్షి) : ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్యాడ్యుయేట్లు తనను ఆదరించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి కోరారు. మంగళవారం మెదక్ లోని, తెలంగాణ గురుకుల పాఠశాల, ప్రభుత్వ హై స్కూల్, జూనియర్, డిగ్రీ కళాశాలల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 34 సంవత్సరాలుగా విద్యారంగంలో ఉన్న, తాను వేలాది మంది విద్యార్థుల బంగారు భవిష్యత్ కు బాటలు వేసినట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర వాళ్ల స్కూళ్లు, కళాశాలలకు దీటుగా తెలంగాణ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించినట్లు వివరించారు. విద్యార్థులు, నిరుద్యోగులు, యువత సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందన్నారు. పట్టభద్రులు తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే వచ్చే వేతనాన్ని నిరుపేద విద్యార్థులకు బడుగు బలహీన వర్గాల ఉద్యోగాల సంక్షేమానికి వెచ్చిస్తానని వెల్లడించారు. తమ విద్యాసంస్థల ద్వారా ఏటా 40 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందిస్తున్నామని తమ కళాశాలల్లో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. మేధావి వర్గం నుంచి వచ్చిన తనకు ఎమ్మె ల్సీగా అవకాశం ఇవ్వాలని కోరారు.

ఓటరు నమోదు పై ప్రత్యేక దృష్టి ...

అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు నరేందర్రెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదు కార్యాక్రమం ఉన్నందున ప్రతి జిల్లా, మండల కేంద్రాల్లో సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ఎన్నికల సంఘం ఆన్లైన్లో ఓటు నమోదు చేస్తామన్నారు. గ్యాడ్యుయేట్లు తమ ఓటరు, ఆధార్ కార్డులు, ఆధార్ సర్టిఫికేట్లు తీసుకొచ్చి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల్లో నాలుగు జిల్లాల్లో 5 నుంచి 6 లక్షల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్ లు, ఉపాధ్యాయులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అక్టోబర్ 9న సింగరేణి కార్మికులకు

లాభాల బోనస్ చెల్లింపు

- ఈ నెల జీతంతో పండుగ అడ్వాన్సు ఒక్కొక్కరికి రూ.25 వేలు
- కాంట్రాక్టు కార్మికుల కు బోనస్ చెల్లింపు పై తక్షణమే విధివిధానాలు ఖరారు
- అధికారులను ఆదేశించిన సంస్థ సీఎండీ ఎన్. బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇటీవల ప్రకటించిన 33 శాతం లాభాల వాటా బోనస్ ను వచ్చే నెల 9వ తేదీన చెల్లించేందుకు యాజమాన్యం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.. అమెరికా నుంచి వీసీ ద్వారా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఉదయం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పోరేట్ జీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు , మంత్రివర్గ సభ్యులు, సింగరేణి సంస్థ 2023- 24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాలలో 33 శాతాన్ని అనగా 796 కోట్ల రూపాయలను లాభాల వాటా బోనస్ గా ప్రకటించారు. సింగరేణి చరిత్ర లో ఇది అత్యధికం కావడం విశేషం. సంస్థలో పనిచేస్తున్న సుమారు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో తాము పనిచేసిన పని దినాల సంఖ్య ను పరిగణనలోకి తీసుకొని లాభాల వాటా బోనస్ చెల్లిస్తారు. సగటున ఒక్కొక్కరు సుమారు లక్షా తొంభై వేల రూపాయల చొప్పున లాభాల వాటా బోనస్ ను పొందే అవకాశం ఉంది.

తొలిసారిగా కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా...

సింగరేణి లో పని చేస్తున్న దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు లాభాల వాటా బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. ముఖ్యంగా ఆర్థిక సంవత్సరంలో వివిధ కాంట్రాక్టర్ల వద్ద పనిచేసిన వారి వివరాలు, వారి సమాచారాన్ని పూర్తిగా సేకరించాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పండుగకు ముందే వారికి కూడా బోనస్ చెల్లింపు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఈ నెల జీతంతో పండుగ అడ్వాన్సు ఒక్కొక్కరికి రూ.25 వేలు లాభాల వాటా బోనస్ తో పాటు సింగరేణి సంస్థ ఎప్పటి లాగానే ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్ ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ ఆదేశించారు. ఒక్కొక్కరికి 25 వేల రూపాయల పండుగ అడ్వాన్స్ ను చెల్లించనున్నారు. దీని కోసం సంస్థ 95 కోట్ల రూపాయలను కేటాయించినట్లు తెలిపారు. సెప్టెంబరు నెల జీతాలతోపాటే ఈ పండుగ అడ్వాన్స్ సొమ్మును కూడా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలన్నారు.

లాభాల వాటా బోనస్... పండుగ అడ్వాన్స్ చెల్లింపుకు రంగం సిద్ధం

లాభాల వాటా బోనస్ మరియు పండుగ అడ్వాన్సులు కలిపి దాదాపు 900 కోట్ల రూపాయలను సింగరేణి ఉద్యోగులకు2024 చెల్లించనున్న నేపథ్యం లో సింగరేణి సిబ్బంది వ్యవహారాలు, ఆర్థిక విభాగాలు తగు ఏర్పాట్లు చేయాలని సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

హైడ్రా చర్యలు పేదలకు శాపం కారాదు

- ప్రభుత్వానికి కూనంనేని సూచన

హైదరాబాద్,సెప్టెంబర్ 24 (జనంసాక్షి): హైడ్రా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఐ సెక్రెటరీ కూనంనేని సాంబశివరావు పలు సూచనలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. హైడ్రా పేరిట ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని హితవుపలికారు. గ్రేటర్ హైదరాబాద్ లాంటి సిటీలో అనేకమంది పేదలు నివాసం ఉంటున్నారని తెలిపారు. మూడు భాగాలుగా పేద వారు, మధ్య తరగతి, సంపన్నులను గుర్తించి కూల్చివేతలు చేయాలన్నారు. మంచి కోసం మొదలు పెట్టిన పని రేపటి రోజున ఇతర అంశాలకు దారి తీసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు సీపీఐ ఆధ్వర్యంలో సిటీలో అనేక చోట్ల చాలామంది పేదలు ఇళ్ళు కట్టుకున్నారని.. అలాంటి వాళ్ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చూసి వ్యవహరించాలన్నారు. ఖమ్మం జిల్లా మంత్రుల అత్యాశతో నాగార్జునసాగర్ కెనాల్కు రెండు చోట్ల గండి పడడం వాస్తవమన్నారు. 'నేను మంత్రిగా ఉన్నప్పుడు ఖమ్మంతో పాటు మన జిల్లాకు కూడా నీళ్లు అందించా. మా హయాంలో సాగర్ కాలువకు గండి పడితే ఏడు రోజుల్లో పూర్తి చేశాం.. ఇప్పుడు 20 రోజులైనా దిక్కు లేదు. మీరు తెచ్చిన జీవో 33 వలన సూర్యాపేట, నల్గొండ జిల్లాలకు ఎక్కువ నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో అప్పుడే పోలీసు రాజ్యం మొదలు పెట్టింద్రు. వాళ్ల తప్పులపై ప్రశ్నించిన.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బఫర్ జోన్, ఎఫ్టీఎల్లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చివేతల్లో జెట్స్పీడ్లో దూసుకెళ్తున్న హైడ్రా మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై అక్రమ నిర్మాణాలకు బ్యాంకులు లోన్లు ఇవ్వకుండా హైడ్రా కట్టడి చేయనుంది. ఈ మేరకు రెండు రోజుల్లో బ్యాంకర్లతో హైడ్రా చీఫ్ రంగనాథ్ సమావేశంకానున్నారు. దీనిపై ప్రభుత్వ రంగ ప్రైవేటు బ్యాంకులకు హైడ్రా లేఖ రాసింది. చెరువుల్లో నిర్మాణాలకు అడ్డగోలుగా రుణాలు ఇవ్వడంపై హైడ్రా చీఫ్ రంగనాథ్ సీరియస్ అయ్యారు.

ఆదర్శప్రాయుడు సీతరాం ఏచూరి

- సంతాప సభలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,సెప్టెంబర్ 24(జనంసాక్షి): సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడు అని, నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన ధీశాలి అని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభలో మహేశ్కుమార్ మాట్లాడారు. 'విద్యార్థి ఉద్యమం నుంచి కమ్యూనిస్టు భావాలను పుణికి పుచ్చుకుని దేశంలో ఎన్నో విప్లవాత్మక పోరాటాల్లో భాగస్వాములయ్యారు. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదగడం అంటే మామూలు విషయం కాదు. 2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు, కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనలో కమ్యూనిస్టుల, ఏచూరి పాత్ర కీలకం. నేటి యువత ఏచూరి లాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవడం ఎంతైనా అవసరం ఉంది. దేశంలో మతతత్వ శక్తులపై రాజీలేని పోరాటం చేసిన ఏచూరి శ్లాఘనీయుడు. ప్రస్తుత పరిస్థితుల్లో భారతదేశం ఇలాంటి లౌకికవాదిని కోల్పోవడం బాధాకరం అని అన్నారు.

టీచర్ అసభ్య ప్రవర్తనపై ఆందోళన

- కామారెడ్డిలో పోలీసుల లాఠీఛార్జ్

కామారెడ్డి,సెప్టెంబర్ 24(జనంసాక్షి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవన్దాన్ పాఠశాల వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా అభం, శుభం తెలియని ఆరేండ్ల పాపపై పీఈటీ లైంగికదాడికి యత్నించాడు. యూకేజీ విద్యార్థి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ పాఠశాల వద్ద పాప బంధువులు గొడవకు దిగారు. కీచక ఉపాధ్యాయుడుని అరెస్టు చేయాలంటూ విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల వద్ద నిరసన చేపట్టడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ను శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులు- విద్యార్థుల తల్లిదండ్రులు, ఆందోళనకారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సీఐ చంద్రశేఖర్రెడ్డి, ఎస్ఐ రాజారామ్కు గాయాలయ్యాయి. ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసులు ఆందోళనకారులపై లాఠీ ఛార్జ్ చేశారు. భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మున్నేరు వరదలతో ప్రకాశ్ నగర్ బ్రిడ్జికి ప్రమాదం

- మూడు నెలల్లో మరమ్మత్తులు పూర్తి చేయిస్తాం
- బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం,సెప్టెంబర్ 24(జనంసాక్షి) : ఖమ్మంలో అక్రమ నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో యంత్రాంగం చాలా బాగా పనిచేసిందని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్లో మంత్రి తుమ్మల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ... తాగునీరు విద్యుత్ పునరుద్ధరణ సకాలంలో పూర్తి చేశారని అన్నారు. ప్రకాశ్ నగర్ బ్రిడ్జి మున్నేరు వరదల వల్ల మొత్తం 24 స్పాన్స్లో తొమ్మిది స్పాన్లు పక్కకు జరిగాయని అన్నారు. ఒక్కో స్పాన్ యథాతథ స్థితిలో బేరింగ్లు మార్చి పెట్టాలంటే పది రోజులు సమయం పడుతుందని చెప్పారు. బిల్డ్ కాన్ కంపెనీ వారు బ్రిడ్జి మరమ్మతు పనులు చేస్తారని అన్నారు. మూడు నెలల్లో బ్రిడ్జినీ యథాతథ స్థితికి తెస్తామని తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా మున్నేరు పాత చప్టాపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పారు. రిటైనింగ్ వాల్ రీ డిజైన్పై ఎక్సపర్ట్ కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. నిపుణుల నివేదిక ఆధారంగా రెటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే వంద ఏళ్లకు విపత్తుల వల్ల ఇబ్బందులు లేకుండా మున్నేరు రిటైనింగ్ వాల్...డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు. మున్నేరు వరద తగ్గగానే పది రోజుల్లో ప్రకాశ్నగర్ వద్ద కాజ్వేపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పారు. ఖమ్మం నగరం చుట్టూ జాతీయ రహదారుల వల్ల రింగ్ రోడ్డు ఏర్పాటుకు మార్గం సుగమైందని చెప్పారు. జాతీయ రహదారులు రింగ్ రోడ్డు వల్ల ఖమ్మం ట్రాఫిక్ ఫ్రీ నగరంగా ఉండబోతుందని చెప్పారు. ఖమ్మం టూ సూర్యాపేట... ఖమ్మం టూ కోదాడ జాతీయ రహదారి పూర్తి అయిందని అన్నారు. ఖమ్మం టూ కురవి జాతీయ రహదారి పనులు వచ్చే ఉగాది నాటికి పూర్తి అవుతాయని వివరించారు. ఆయిల్ ఫాం పై ఇంపోర్ట్ టాక్స్ పెంచడం వల్ల పామాయిల్ రైతులకు అదనపు లాభాలు వస్తాయని చెప్పారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంచి మనస్సుతో పామాయిల్ రైతులకు మేలు చేశారని తెలిపారు. కరవు కాటకాలు విపత్తుల వల్ల ఆయిల్ ఫాంకు ఎలాంటి నష్టం రాదని చెప్పారు. తెలంగాణ రైతాంగం ఆయిల్ ఫాం సాగు బాట పట్టాలని సూచించారు. వరదల వల్ల రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ఆలస్యమవుతుందని చెప్పారు. ప్రస్తుతం వచ్చిన డేటా వరకు రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆఖరి రైతు వరకు రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

ములుగు మున్సిపల్ బిల్లును ఆమోదించండి

- గవర్నర్ను కలిసి విన్నవించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, సెప్టెంబర్ 24(జనంసాక్షి) : ములుగు మున్సిపాలిటీ బిల్లును తక్షణం ఆమోదించాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మంత్రి సీతక్క కోరారు. గత ప్రబుత్వ హయాంలోనే దీనిని మున్సిపాలిటీగా చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం రాజ్భవన్లో గవర్నర్తో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మారుస్తూ 2022లో అసెంబ్లీ పాస్ చేసిన బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని గవర్నర్కు సీతక్క వినతి పత్రం సమర్పించారు. సాంకేతికపరమైన చిక్కులతో ములుగు మున్సిపాలిటీ బిల్లు ఇంతకాలం పెండింగ్లోనే ఉండిపోయిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ తప్పిదాలతో మున్సిపాలిటీకి ములుగు నోచుకోని పరిస్థితి. తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులోనే ములుగు మున్సిపాలిటీ అంశాన్ని గత ప్రభుత్వం చేర్చింది. అదే బిల్లులో జీహెచ్ఎంసీ చట్టానికి సవరణలు ప్రతిపాదించింది గత సర్కార్. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు గందరగోళంగా మారిపోయింది. సభ్యుల గందరగోళం నడుమ 2022లో బిల్లును అప్పటి ప్రభుత్వం పాస్ చేసింది. అయితే న్యాయపరమైన, సాంకేతికపరమైన అంశాల నేపథ్యంలో బిల్లును గత గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్ రాష్ట్రపతి ఆమోదానికి పంపించారు. దీంతో ములుగు మున్సిపాలిటీ బిల్లు పెండింగ్లోనే ఉండిపోయింది. ఈ క్రమంలో బిల్లు వివరాలు గవర్నర్కు అందజేసిన మంత్రి సీతక్క.. ములుగుకు మున్సిపాలిటీ హోదా కల్పించే బిల్లుకు ఆమోద ముద్ర వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఔటర్ దాటుతున్న హైడ్రా చర్యలు

- సమీప చెరువుల రక్షణకు ప్రణాళిక
- క్షేత్రస్థాయి పరిశీలనతో ఆక్రమణదారులకు దడ

హైదరాబాద్,సెప్టెంబర్24(జనంసాక్షి): హైదరాబాద్తో పాటు నగరంతోపాటు నగరం చుట్టూ ఉన్న చెరువుల సంరక్షణపై హైడ్రా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తోంది. కొన్ని తటాకాల విషయంలో అధికారులు హద్దులు మార్చినట్లు, తప్పుడు పత్రాలు సృష్టించినట్లు హైడ్రా విచారణలో తేలింది. వాటిని చట్టపరంగా ఎదుర్కొ నేందుకు కమిషనర్ రంగనాథ్ కేంద్ర ప్రభుత్వ సంస్థ సాయం తీసుకోబోతున్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఎన్ఆర్ఎస్సీ నుంచి 45 ఏళ్ల నాటి ఉపగ్రహ చిత్రాలను సేకరించేందుకు సిద్ధమయ్యారు. హైడ్రా, ఎన్ఆర్ఎస్సీ మధ్య త్వరలో ఒప్పందం జరగనుంది. ఇప్పుడు వెనకడుగు వేస్తే.. నగరంలో మిగిలిన అరకొర చెరువులు కూడా కబ్జా అవుతాయని, యుద్ధప్రాతిపదికన వాటిని రక్షించాల్సిన అవసరం ఉందని హైడ్రా భావిస్తోంది. లక్ష్యం నెరవేరే వరకు వెనకడుగు ఉండదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

సరైన ఆధారాలతో కూల్చివేతలు చేపట్టినప్పుడే పనులు లక్ష్యం ప్రకారం కొనసాగుతాయని హైడ్రా భావిస్తోంది. అందులో భాగంగా ఇటీవల కమిషనర్ రంగనాథ్ బాలానగర్లోని ఎన్ఆర్ఎస్సీ కేంద్రాన్ని సందర్శించారు. శాస్త్రవేత్తలతో హైడ్రా కార్యక్రమాలను పంచుకున్నారు. చెరువుల రక్షణకు సాయం కావాలని అడిగారు. అధికారికంగా చెరువుల హద్దులను నిర్ణయించి, స్పష్టమైన పటాలను ఇవ్వాలని కోరారు.

కొందరు అధికారులు ఎఫ్టీఎల్ హద్దులను మార్చినట్లు తెలుస్తోంది. అలాంటి సందర్భాల్లో ఎన్ఆర్ఎస్సీ పటాలు ఉపయోగపడతాయి. అధికారికంగా వాటిని కొనుగోలు చేస్తామని, త్వరగా ఏర్పాటు చేయాలని శాస్త్రవేత్తలను కోరాం అని రంగనాథ్ వివరించారు. ఎన్ఆర్ఎస్సీ సంస్థ ఇప్పటికే హైడ్రా అభ్యర్థన మేరకు 56 చెరువుల పటాలను అందజేసింది. 1979-2023 ఏళ్ల మధ్య చెరువులు ఏ విధంగా ఆక్రమణకు గురయ్యాయో చిత్రాలతో సహా వివరించింది. అనేక తటాకాలు కొన్ని రోజుల్లో కనుమరుగవుతాయని చెప్పడమే వాటి ఉద్దేశం. ఆయా పటాలను మరింత పక్కాగా రూపొందించి, హద్దులను నిర్ణయించాలని తాజాగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశోధన సంస్థను కోరడం గమనార్హం. ఈ క్రమంలో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా గతంలో ఉన్న చెరువులు నాలాలు గుర్తించి త్వరగా చర్యలు చేపట్టబోతున్నారు. ఈ క్రమంలో చెరువుల రక్షణపై మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోబోతున్నారు.

ప్రజారోగ్యంపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

- ఎక్స్లో కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్24 (జనంసాక్షి) : ప్రజల ఆరోగ్యంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. ఎవడి చావు వాడు చస్తాడని, తమకేం సంబంధం అన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని చురకలంటించారు. మంగళవారం కెటిఆర్ తన ట్విట్టర్ లో ట్వీట్ చేశారు. జనాలు రోగాలు, నొప్పులు, వ్యాధులతో బాధలు పడుతుంటే జనానికి చలనం లేదని ఎద్దేవా చేశారు. జనాలు జ్వరంతో చస్తుంటే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని కెటిఆర్ దుయ్యబట్టారు. విష జ్వరాలు విజృంభించి ప్రజలు ఒళ్లు, ఇళ్లు గుళ్ల చేస్తుంటే పట్టించుకునే నాథుడే కనిపించడంలేదన్నారు. బస్తీలకు సుస్తీ చేసిందని, ప్లలెలు మంచం పట్టినా కూడా వైద్యారోగ్య శాఖకు చీమకుట్టినట్టు కూడా లేదని చురకలంటించారు. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, ప్రభుత్వ శాఖలు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని కెటిఆర్ మండిపడ్డారు. ప్రాణాంతక రోగాలు పట్టి పీడిస్తుంటే అరికట్టాల్సిన ప్రభుత్వం అడ్రస్ లేదని ఎద్దేవా చేశారు.

భార్యాభర్తల మధ్య గొడవ

- ఉరేసుకుని భర్త ఆత్మహత్య

సూర్యాపేట,సెప్టెంబర్24(జనంసాక్షి) : ప్రేమ పెళ్లి చేసుకున్నాక దంపతులు మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో భర్త ఇంట్లో ఉరేసుకొని చనిపోయిన సంఘటన సూర్యాపేట జిల్లా బాణాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. బాణాపురం గ్రామానికి చెంది బాణాల శ్రీనివాస్, బరాఖత్ గూడానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. శ్రీనివాస్ హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇరు కుటుంబ సభ్యులను ఒప్పించి వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. గత కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు రావడంతో భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. బరాఖత్ గూడాకు వెళ్లి భార్యను కాపురానికి రమ్మని అడిగాడు. భార్యతో గొడవ తారాస్థాయికి చేరుకోవడంతో అక్కడి నుంచి అతడు బాణాపురం వచ్చాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో శ్రీనివాస్ ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370